డ్రింకోటేబ్

ఇన్‌స్టంట్ డ్రింక్

జాయ్‌సన్ వారి
మధురానందమునిచ్చు
పోటిలేని పానీయము

క్షణంలో మీకు మీరే
చేసుకొనవచ్చును

మంచినీటి గ్లాసులో
ఒక డ్రింకోటేబ్ (టెట్)
వేయుండి క్షణంలో
మధురమైన
ఫలపానీయం
తయారవుతుంది-



డ్రింకోటేబ్ ఆక్షేపణలేని ఆధునిక
పానీయము అతిథులు వచ్చినప్పుడునండి,
మీ ఆనందానికి కనండి – అన్నివేళలా
ఆదుకుంటుంది- ఎల్లప్పుడూ ఇంట్లో వుంచుకోండు

డ్రింకోటేబ్ లెమన్ – డ్రింకోటేబ్ ఆరెంజ్
డ్రింకోటేబ్ వనిల్లా – డ్రింకోటేబ్ పైనాపిల్
డ్రింకోటేబ్ రాస్బెరి

వ్యాపారవివరములకు
జాయ్‌సన్ ఎంటర్‌ప్రైజెస్ పోస్టుబాక్సు 51 గుంటూరు-1.

AMBLYTE/JE/66 TEL


రమా
పౌడర్

తొలిమాట

ఈ సంచికతో శ్రీమతి ముప్పాళ రంగ నాయకమ్మగారి ఎరియల్ చదువుకున్న కమల" పూర్తయింది

ఆగస్టు సంచికలో శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారి పెద్ద కథ "మారిన జీవితం ప్రారంభమౌతుంది కథా రచనలో సిద్ధహస్తులైన కుటుంబరావుగారి లేఖిని నుంచి వెలువడే ఏ కథ అయినా ఆలోచనామృతాన్నే పంచిపెడుతుంది కాగా కొత్త ఫక్కీలో నడిచిన ఈ కథ పాఠకులను అలరింప జేయగలదని నమ్ముతున్నాము

* * *

చిన్నారి చిన్న కథల పోటీలో పాల్గొన దలచిన విద్యార్థులు 24 వ పేజీలోని మనవి"ని మరొకసారి గమనించాలని మనవి ముఖ్యంగా దానిలోని రెండవ నిబంధనను — "స్వకపోల కల్పితమైన స్వతంత్ర రచనలే" పంపించాలని — ప్రత్యేకించి పాటించ గోరుతున్నాము

* * *

జ్యోతి" దీపావళి (నవంబరు 66) ప్రత్యేక సంచిక గురించిన వివరాలను వచ్చే సంచికలో చూడండి

సుచిత్ర మాసపత్రిక
బకింగ్‌హామ్ పేట పోస్టు
విజయవాడ 2

విడిప్రతి వెల
75 పైసలు

ఏడాది చందా
9 రూపాయలు

సంపుటి 4
జూలై 1966
సంచిక 7

మేనేజింగ్ ఎడిటర్
వి వి రాఘవయ్య

ముఖచిత్రం
భారత్ ఎలిమ్స్‌వారి
'భక్త పోతన' లో దృశ్యాలు

ఉత్తరాలు

జూన్ నెల "జ్యోతి" ఎంతో ఆకర్షణీయంగా వెలువడింది ప్రతి నెలా "సినిమా" శీర్షికలో ఏదో ప్రత్యేకత వుంటున్నది

చక్కని కథలతోపాటు మంచి సినిమా విశేషాల నందజేయు జ్యోతి వారికి నా హృదయపూర్వక అభినందనలు

భిక్షమాచారి
హౌజువ్వల్

ఈ నెల మీ పత్రికలో అంతఃపురం అన్న కథ చదివాను త్రేతాయుగంలో ఏం జరిగిందో మనకు తెలియదు కాని ఈనాటి ఊహల్తో అనుభవాల్తో వచ్చిన విజ్ఞానం వాటికి ఆపాదించటం ఎమంత సమంజసంగా లేదు ఇకపోతే ఒక రాజ కుటుంబంలోని మహారాణి అంత నీచానికి ఒడిగట్టడం అరుదు ఎమయినా మనకి పూర్తిగా తెలియని విషయాలమీద వచ్చే కథల్ని చదివితే మాత్రం జుగుప్సాకరంగా ఉంటుంది మరొక విషయం దశరధుని కొడుకులు విహారానికి వెడుతూ సేవకుడు నీళ్ళివ్వటం ఆలస్యం అయితే ఒకడు కొట్టాట్ట మిగతా వారు చూస్తూ ఊరుకున్నార్ట ఇది ఎంత హీనంగా ఉందో చూడండి శ్రీరాముడు చీమకి సహితం హాని తలపెట్టనివాడు అతని తమ్ములు సరె సరి వారి మీదనా యీ వ్యాఖ్య? బహుశా రచయిత రోమన్ రాజుల చిత్రాల్ని చూచి మన పురాణాలు కూడా అలాంటివే అనుకుని ఉంటారు

నరసింహారావ్
మ [illegible]

మల్లంపల్లి కృష్ణారావుగారి అంతః పురము ఎంతో బాగుంది దశరథ మహారాజూ ఆయన మంచితనమూ అయోధ్యా నగర వైభవమూ మాత్రమే చదువుతున్న చాలా మందికి ఆ సౌధాంతరాల్లో ఒక అబలకి జరిగిన అన్యాయం సంగతి తెలియదు ఏ రామాయణంలోంచి గ్రహించారో గాని ఈ సంఘటనకి కథారూపం కల్పించటంలో రచయిత మంచి ప్రతిభ కనపరిచారు ముఖ్యంగా దశరధుని మరణంతో రాణి ఆత్మహత్యను ముడివెయ్యటంలో!

తెన్నేటి రామారావ్
రూర్కేలా (ఒరిస్సా)

మీరు నిర్వహిస్తున్న "పోటీ నూతన రచ[illegible]ము ప్రతి నెల ఈ పోటీ [illegible]ండటము మిక్కిలి ప్రశంసనీయమైన విషయము. ఈ నెల బహుమతి పొందిన కథలన్నీ బాగున్నాయి.

"స్వయంవరం" మనోరంజకం.

"మనిష మనసు" రచయితకు నా అభివందనములు.

"అంతఃపురం" బాగుంది. ప్రతి నెల ఒక చరిత్రాత్మక కథ ప్రచురిస్తే బాగుండును.

యన్. శ్రీకాంత్,

ఉరవకొండ.

జూన్ సంచికలో మీ "రాజకీయాలు" చాలా బాగుగా, కాలానుగుణంగా వ్రాశారు.

"శివా భవానీ రుద్రాణి"కి మొదటి బహుమతి ఇచ్చిన బాగుండేదేమో!

వి. రమాకుమారి,

మద్రాసు.

అంగర సూర్యారావుగారి "తారాబలం" బావుంది.

జనపరెడ్డి వెంకటరమణ,

భీమడోలు.

ఈ నెల "జ్యోతి"లో మొదటి బహుమతి పొందిన "స్వయంవరం" కథ బాగుంది. రచయిత్రికి, ప్రచురించిన మీకు నా హృదయ పూర్వక నమస్కృతులను ఈ నా లేఖ ద్వారా తెలియ జేస్తున్నాను.

గుండుమళ్ళ సింహాచలం,

బుడితి.

మా అభిమాన రచయిత శ్రీ సోమంచి యజ్ఞన్న శాస్త్రిగారి వ్యాసం జ్యోతికి ఒక ప్రత్యేక ఆకర్షణ అనుటలో సందేహం లేదు. వారికి నా హార్దిక శుభాకాంక్షలు.

ఆర్. వి. గోపాలరావు,

విశాఖపట్నం.

జూన్ సంచికలో ప్రచురించిన డాక్టర్ మహీధర నళినీ మోహనరావు గారి "సంజీవి" అనే క్రొత్త వ్యాసాన్ని పాఠక లోకానికి అందించిన మీకూ, రచయితగారికి నా ధన్యవాదాలు.

పోతే లోగడ "గ్రంథ సమీక్ష" అనే శీర్షిక ప్రారంభించారు. కాని అనతికాలంలో మరుగున పడింది. మళ్ళీ ఆ శీర్షికను పునరుద్ధరిస్తారని ఆశిస్తున్నాను.

విజయమూర్తిగారు వ్రాసిన "మనిషి—మనసు" వాస్తవానికి అతి దగ్గరగా ఉంది. సులభ శైలిలో, రచయిత తీసుకున్న ఇతివృత్తం చాలా బాగుంది.

వి. ఆదిశేషయ్య,

విజయవాడ.

రాజకీయాలు

తగ్గిపోతున్న రూపాయి విలువ?

"ఓ అర్జునా! ఈ కౌరవ సైన్యం యావత్తు ఇదివరకే నా చేత చంపబడింది. అందుచేత నీవు కేవలం నిమిత్త మాత్రుడివై సంహారంచెయ్యి" అని శ్రీ కృష్ణ భగవానుడు ఉపదేశించాడు.

మన రూపాయి విలువ తగ్గిపోవడం ఈ గీతోపదేశాన్ని జ్ఞాపకం చేస్తుంది.

రూపాయి విలువ ఏనాడో తగ్గిపోయింది. ఇతర దేశాలలో దాని పరపతి ఎప్పుడో దెబ్బతింది. ఇన్నాళ్ళు ఒక డాలరుకు 4 రూపాయల 76 పైసలని, ఒక పౌండుకు 13 రూపాయల 33 పైసలని ప్రపంచాన్ని నమ్మించడానికి ప్రయత్నించాము. ఇకమీద ఈ బుకాయింపు సాధ్యం కాదని తేలిపోయింది. ఇప్పుడు మన ప్రభుత్వం కేవలం నిమిత్త మాత్రంగా రూపాయి విలువను దాని అసలు పరపతి స్థాయికి తగ్గించి వేసింది. ఇకపై దాని విలువ డాలరుకు ఏడున్నర రూపాయలు. పౌండుకు 21 రూపాయలు. అదీ జరిగిన కథ.

ఈ చర్యను సమర్థించడానికి మొత్తం ప్రభుత్వ యంత్రాంగ మంతా కదిలింది; బ్రహ్మాండమైన ప్రచారోద్యమం ప్రారంభమైంది. ఆర్థికమంత్రి శచీంద్ర చౌధరితో మొదలుపెట్టి, ప్రధానితోసహా కేంద్ర మంత్రులు, ప్లానింగ్ కమీషన్ సభ్యులు, ఇతర అధికారులు వరసగా రేడియోలో ప్రసంగా లేమి, పత్రికలలో ప్రకటన లేమి, వేదికల నుంచి ఉపన్యాసా లేమి ఊపిరి సలపకుండా చేస్తూ, దేశాన్ని ఊదరగొడుతున్నారు.

వారి ప్రసంగాల సారాంశం ఒకటే: రూపాయి విలువ తగ్గించడం తప్పనిసరి అయింది. గత్యంతరం లేకనే తగ్గించాము. అంతమాత్రాన వరల్డ్ బ్యాంకివారో, అమెరికావారో ఒత్తిడి పెట్టారని, మనం లొంగి పోయామని అర్థం చేసుకోరాదు. వారు సలహా యిచ్చినమాట నిజమే. కాని వారి సలహా ప్రకారం చేసిన పనికాదు. మనంతట మనమే రూపాయి విలువ తగ్గించుకున్నాము. (ఈ వాద వైచిత్రి సామాన్య పౌరుడికి చాలా ఆశ్చర్యం కలిగిస్తోంది. "ఎడమచేత్తో ముట్టుకోలేదు, పురచేత్తో" అన్నాట్ట ఒకడు. ఏదైనా ఒకటేకదా?)

ప్రభుత్వ వాదన మరొకటి వుంది: తప్పనిసరి అయి రూపాయి విలువను తగ్గించుకున్నప్పటికి మనకి దానివల్ల మంచే తప్ప చెడులేదు. మన ఆర్థిక పురోగతి కుంటు పడుతుందని భయపడ నక్కరలేదు. అసలు ఇలాంటి కొరడా దెబ్బ ఒకటి తగిలితే తప్ప

మందగించిన మన ఆర్థిక వ్యవస్థ ముందుకు నడవదు. 1949 లో బ్రిటన్ పౌను విలువను తగ్గించింది. ఆ తర వాత బ్రిటన్‌లో ఆర్థికాభివృద్ధి రేటు పెరిగింది. అప్పుడే మనం కూడా రూపాయి విలువను తగ్గించాము. మన అభివృద్ధి రేటు కూడా పెరిగింది. పాకిస్తాన్ అప్పటిలో రూపాయి విలువను తగ్గించకుండా మొరాయించింది. కాని దాని అభివృద్ధి రేటు మన దానికంటె చాలా తక్కువ. చివరికి అది కూడా రూపాయి విలువను తగ్గించుకోలేక తప్పలేదు. ఇంకా తమ కరెన్సీ విలువను తగ్గించడం ద్వారా బాగుపడిన దేశాలు ఫ్రాన్సు, యుగోస్లావియా, సోవియట్ యూనియన్, పశ్చిమ యూరపియన్ దేశాలు ఎన్నోవున్నాయి. అట్లాగే మనంకూడా మరింత అభివృద్ధి సాధిస్తాము. కరెన్సీ విలువను తగ్గించుకున్నా అభివృద్ధి చెందని దేశం — ఇండొనీసియా — వున్న దనుకోండి. అయినా దానిదారి వేరు.

ఇదీ ప్రభుత్వం తన చర్యను సమర్థించుకోడానికి చేస్తున్న వాదం.

అయితే, ప్రభుత్వ పక్షం తప్పిస్తే, విదేశాలలో మన ఋణదాతలు తప్పిస్తే, మనదేశంలో దాదాపు అందరు ఈ చర్యను విమర్శించినవారే. దీనికి ఒక ముఖ్య కారణం వుంది. ప్రభుత్వం చాలా హఠాత్తుగా ఈ పని చేసింది. జూన్ అయిదోతారీకు సాయంత్రం వరకు డివాల్యుయేషన్ ప్రసక్తే లేదని ప్రభుత్వం ఢంకామీద దెబ్బకొట్టి ప్రకటిస్తూ వచ్చింది. దానివల్ల ఎన్ని రకాలు అనర్థాలు వాటిల్లుతాయో చిల వలు పలవలుగా వర్ణిస్తూ చెప్పింది. అటువంటిది తెల్లవారితే ఆరో తారీకనగా చటుక్కున రూపాయి విలువ తగ్గిస్తున్నానని ప్రకటించింది. ఇందుకోసం ప్రజాభిప్రాయాన్ని ఏమాత్రం సిద్ధం చేయకుండా గుట్టు చప్పుడు కాకుండా అనుకున్న పని చేసింది. ఆ తరువాత తన పనిని ఎంతగా సమర్థించుకుంటే మాత్రం దేశంలో బయలుదేరిన అలజడిని అరి కట్టడం సాధ్యమా?

వ్యాపారస్థుల వర్గాలలో ఈ అల జడి మరీ మిక్కుటంగా బయలుదేరింది. ఒక్కసారిగా దిగుమతుల ధరలు పెరిగిపోతాయి. ఇదివరకు నూరురూపాయలు పెడితే వచ్చే సరుకు ఇప్పుడు 157 రూపాయలు పెడితేగాని రాదు. మన ఎగుమతులు అంతర్జాతీయ మార్కెట్‌లో ఇతర దేశాల పోటీకి నిల బడగలవు గనక ఆ మేరకు మన ఎగుమతి వాణిజ్యం పెరుగుతుంది. నిజమే కాని, మనదేశంలో ఆయా వస్తువులు పూర్వంకంటె ఎంతో ఎక్కువగా తయారైతే గదా, ఎక్కువ ఎగుమతి చేసి ఎక్కువ లాభాలు ఆర్జించ గలిగేది?

అంటే, రూపాయి విలువ తగ్గింపు నుంచి మనం లబ్ధి పొందాలంటే జరగవలసిన పనులు కొన్ని వున్నాయి. దిగుమతులను తగ్గించుకోవాలి. మన పరిశ్రమలకు అత్యవసరమైన వాటినే దిగుమతి చేసుకుని, వాటిసహాయంతో మిగతా అవసర వస్తువులను



ప్రధాని ఇందిరాగాంధీ ఇటీవల మధ్యప్రదేశ్‌లోని దుర్భిక్ష ప్రాంతాలలో పర్యటించినప్పుడు రాయపూర్ జిల్లాలోని ఒక గ్రామంలో ప్రసంగిస్తున్న దృశ్యం

దేశంలోనే ఉత్పత్తి చేసుకోవాలి. ఎగుమతులను బాగా పెంచడానికిగాను కష్టించి పని చేయాలి. ఆ విధంగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించు కోవాలి.

అంతేకాదు. దేశంలో ధరలు పెరగకుండా నిలకడగా వుండేట్లు చూసుకోవాలి. రూపాయి విలువ తగ్గింపులోని ఆర్థికమైన లాభనష్టాలు, దాని కారణాలు, సాధక బాధకాలు ఎలా వున్నా, సామాన్య మానవుడికి ఆసక్తి కలిగించే విషయం ఇదే.

రూపాయి మారకం విలువను ఇతర దేశాలలో తగ్గించారేగాని, దేశంలో దాని విలువ తగ్గలేదు. అయినప్పటికీ, దానివల్ల దేశంలో కూడా రూపాయి కొనుగోలుశక్తి ఇంకా తగ్గిపోయే ప్రమాదం వుంది. ఈ చర్య జరగ

డానికి ముందునుంచే దేశంలో ధరలు పెరిగి పోతున్నాయి. నిన్నటి ధర ఇవ్వాళ, ఇవ్వాళ్టి ధర రేపు వుండడం లేదు. అటువంటిది రూపాయి విలువ తగ్గింపు వంటి మహదవకాశం లభిస్తే ధరల్ని ఇక పట్ట పగాలుంటాయా? విజృంభిస్తాయి. వాటి విజృంభణ అప్పుడే ప్రారంభమైంది కూడాను.

అయితే, దిగుమతి వస్తువుల ధరలు, ఆ వస్తువుల అవసరమున్న పరిశ్రమలలో ఉత్పత్తుల ధరలు పెరగడంలో కొంత సబబున్నది. వాటిలో కూడా నిత్య జీవితానికి, వ్యవసాయానికి అవసరమైన వాటి ధరలను — అంటే ఆహార ధాన్యాలు, ఎరువులు, కిరోసిన్, డీసెల్ నూనె ఇత్యాదుల ధరలను — సబ్సిడీ ఇచ్చి పెరగకుండా చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఇక యంత్ర పరికరాల ధరలు మొదలైనవి ఎలాగూ పెరక్క తప్పదు.


కాని, దిగుమతులతో ఏ మాత్రం సంబంధంలేని వస్తువుల ధరలుకూడా పెరగడానికి అవకాశం వుంది. ధరలకి చెయిన్ రియాక్షన్ వంటిదేదో వుంది. ఏ వొక్కదాని ధరపెరిగినా అది మరొక దాని ధరను అది వేరొకదాని ధరను పెంచివేస్తాయి. అసలు ఇదేమీ లేక పోయినా, బడ్జెట్ ఇంకా రెండునెలలుండనగా వస్తువుల ధరలన్నీ పెరగడం మనకు తెలిసిందే. అలాగే ఇప్పుడూ జరుగుతుంది. ఇదే సాధారణ పౌరుడిని బాధిస్తున్న భయం.

ధరల్ని ఏమైనా సరే పెరగనివ్వరాదని ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ధరల్ని పెరగనివ్వబోమని ప్రజలకు హామీ ఇస్తోంది. ధరల్ని పెంచవద్దని, పెంచితే సహించనని వర్తక వర్గాలను హెచ్చరిస్తోంది.

ఇటువంటి దీక్షా కంకణాలు, హామీలు, హెచ్చరికలు ప్రజలకు అలవాటే. విని విని విసుగెత్తి పోయారు. ధరల్ని నిలకడగా వుంచే శక్తి ప్రభుత్వానికి లేదని ఏనాడో తేలిపోయింది. అవసరమైతే కఠిన చర్యలు తీసుకోగలనని అడపాదడపా బెదరిస్తూ వుంటుంది. ఆ అవసరం ఇప్పుడు కాక ఎప్పుడు వస్తుందో ఎవరికీ తెలియదు. లేస్తే మనిషిని కానన్న కొంగర మల్లయ్య బెదిరింపు వంటిదే ఇది.

ధరల్ని పెరగకుండా చేయడానికి ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకున్నమాట నిజమే. వీటిలో ఒకటి — వర్తకులకు విజ్ఞప్తి చేయడం. ఈ విజ్ఞప్తిని తాము మన్నించ గలమని పారిశ్రామికులు, వాణిజ్య వర్గాలవారు ప్రతిజ్ఞలు చేస్తున్నారు. ఇది ఎంతవరకు ఫలిస్తుందో చూడాలి.

మరొక చర్య — దేశంలో వినియోగదారుల సహకార సంఘాలను, ప్రభుత్వం స్వయంగా నిర్వహించే స్టోర్సును, ముఖ్యంగా డిపార్టుమెంటల్ స్టోర్సును నిర్వహించడం; వాటికి అవసరమైన సరకులను లెవీ పద్ధతిపై పారిశ్రామికుల నుంచి కొనుగోలుచేసి సరసమైన ధరలకు అమ్మడం. ఇదికూడా ఆచరణలో ఏ పాటి ఫలితా లిస్తుందో చూడాలి.



బియాస్ డాం నిర్మాణానికి అమెరికా ఇస్తున్న 24 కోట్ల 75 లక్షల ఋణ సహాయం ఒప్పందంపై భారత ఆర్థికశాఖ సహాయ కార్యదర్శి సి. ఎస్. కృష్ణమూర్తి, అమెరికా రాయబారి చెస్టర్ బౌల్స్ సంతకాలు పెడుతున్న దృశ్యం.

పోతే మరొక సమస్య — పెరిగిన ధరలకు వస్తువులు కొనరాదని ప్రజలకు ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఆ విధంగా చేస్తే ధరలుచచ్చినట్టు వాటంతటవేతగ్గుకుంటూ వస్తాయట. ఇది చాలా విచిత్రమైన విజ్ఞప్తి. అంటే ధరలను పెంచే వర్తకులను ఏమీ చెయ్యలేక ప్రజలను సత్యాగ్రహం చెయ్యమంటున్నారన్న మాట. ప్రజలు నిత్య జీవితావసరాలను మానుకుని ఎన్నాళ్ళు సత్యాగ్రహం చెయ్యగలరు? ఎందరు చేయగలరు? ఎన్నిచోట్ల చెయ్యగలరు? మొత్తం దేశమంతా ఉప్పు సత్యాగ్రహం వలే చెయ్యగలరా? ధనవంతులకు ఇటువంటి సత్యాగ్రహం చెయ్యవలసిన అవసరం ఏమిటి? ఒకవేళ పదిరోజులపాటు

దీక్షగా చేసినా, అన్నిరోజులూ పరుకును అట్టే పెట్టుకోగల శక్తి వర్తకులకు వుండదా?

• ఇవన్నీ ఏదో కాలక్షేపం చెయ్యడానికి, కన్నీళ్ళు తుడవడానికి చెప్పే కబుర్లు.

రాష్ట్రాలమధ్య తగూలు

దేశం ఇదివర కెన్నడూ లేనంత ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుండగా, సరిహద్దు ప్రాంతాలలో ఒక పక్క నాగ విద్రోహులు, ఇంకో పక్క మిజో విద్రోహులు గొడవ చేస్తుండగా, సరిహద్దుల అవతల పాకిస్తాన్, చైనాల ప్రమాదం ఇంకా అలాగే వుండగా, దేశంలో ఎంతో సమైక్యత అవసరమైన సమయంలో కొన్ని కొన్ని రాష్ట్రాలమధ్య తగవులు చెలరేగుతూ వుండడం చాలా శోచనీయమైన పరిస్థితి.

ఆంధ్ర, మైసూరు, మహారాష్ట్రాల మధ్య నదీజలాల వివాదం అలాగే వుంది. పోతే మైసూరు, మహారాష్ట్రాల మధ్య సరిహద్దు తగాదాలు ఉధృత రూపం దాల్చాయి.

ఇవి ఇలా వుండగా, ఇంకా పుట్టనైనా పుట్టని రెండు రాష్ట్రాలమధ్య స్పర్ధలు పుట్టాయి. అవి పంజాబీ, హరియానా రాష్ట్రాలు. ప్రస్తుత పంజాబ్ విభజనకు అంగీకరించిన కేంద్ర ప్రభుత్వం కొత్త రాష్ట్రాలమధ్య సరిహద్దు నిర్ణయించడానికై ఒక కమిషనును వేసింది. అది ఒక్క విషయంలో తప్ప మిగతా అన్నిటిలోను ఏకగ్రీవ నిర్ణయాలు చేసింది. ఏయే ప్రాంతాలు పంజాబీ రాష్ట్రానికి పోవాలో, ఏవిహరియానాకు రావాలో సిఫార్సు చేశాయి. వాటిని కేంద్రం కూడా యథాతథంగా ఆమోదించింది. పంజాబీ, హరియానా నాయకులు కూడా వాటిపై అట్టే పేచీ పెట్టడం లేదు

వచ్చిన పేచీ అంతా రాజధాని చండీఘడ్ వద్దనే. అది ఎవరికి పోవాలి. అనేది తేలలేదు. సరిహద్దు సంఘంలోని ఇద్దరు సభ్యులు అది హరియానాకు చెందాలని, ఒక్క సభ్యుడు మాత్రం పంజాబీ రాష్టానికి చెందాలని సిఫార్సు చేశారు.

కేంద్రం ఏ సిఫార్సును ఆమోదిస్తుంది? చండీఘడ్ ఏమైనా సరే తమకు రావలసిందేనని కావలిస్తే పంజాబీ వారు కొన్నాళ్లపాటు అక్కడ రాజధాని పెట్టుకోవచ్చునని హరియానా వారు చెబుతున్నారు. అలా వీలుకాదు, చండీఘడ్ తమకే రావాలని పంజాబీ వారు పట్టు పట్టారు. ఈ సమస్యపై ఎంత ఆందోళనకైనా సిద్ధమని వారూ, వీరూకూడా బెదరిస్తున్నారు.

ఈ పరిస్థితిలో కేంద్రం ఎటూ తేల్చలేక, చివరికి తునితగవు చేసింది.

చండీఘడ్‌ను తాను స్వాధీనం చేసుకుంటానని, ఉభయ రాష్ట్రాలవారు అక్కడ ఉమ్మడి రాజధాని పెట్టుకో వచ్చునని తెలియచేసింది. ఇది మంచి పరిష్కారంగా దాదాపు రాజకీయ పక్షాలన్నీ హర్షించినా, కొత్తరాష్ట్రాల వారిద్దరికి అది నచ్చలేదు.

కొత్త రాష్ట్రాలు అక్టోబరు 1వ తేదీకల్లా ఏర్పడాలి. ఈ లోగానైనా ఈ క్లిష్ట సమస్య ఉభయులకు సమ్మతమైన పద్ధతిలో పరిష్కార మవుతుందో, లేక అల్లరులకు దారి తీస్తుందోమరి.

రాష్ట్ర రాజకీయాలు

రాష్ట్రంలో రాజకీయాలు రసవత్తరంగా పరిణమిస్తున్నాయి; కెలేడోస్కోప్‌లో మాదిరిగా రోజురోజుకు రంగురంగుల, రకరకాల ఆకారాలు దాలుస్తున్నాయి. ఫలానా నాయకుడు ఏరోజున ఏ గ్రూపులో వుంటాడో, ఎందుకుంటాడో చెప్పడానికి వీల్లేక పోతోంది. గ్రూపు మార్చడం ప్లేటు ఫిరాయించటమంత కోటు తిరగేసినంత చులకన అయిపోతోంది.

రాష్ట్ర ప్రభుత్వరంగం నుంచి శ్రీ సంజీవరెడ్డి తప్పుకున్న తర్వాత రాష్ట్రంలో ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డిదే పెద్ద చెయ్యిగా వుంటూ వచ్చింది. రాష్ట్ర రాజకీయాలలో శ్రీ సంజీవరెడ్డి పెత్తనం చెల్లుబడి కావడానికి ఆయన ముఖ్య పరికరంగా ఉపయోగపడుతూ వచ్చారు. శ్రీ సంజీవరెడ్డికి ఆయన ముఖ్య అనుచరుడు. ఆయన శ్రీకృష్ణుడైతే ఈయన అర్జునుడు. దాదాపు మొన్న మొన్నటిదాకా—కాకినాడలో రాజకీయ మహాసభలు జరిగేదాకా—ఈ కృష్ణార్జునుల సంబంధం ఇలాగే వుండిపోతుందనే అనిపించింది.

కాని, ఈ అభినవ శ్రీ కృష్ణుడికి అర్జునుళ్ళను మార్చెయ్యడం అలవాటే. ఎందుకు వచ్చాయో, ఎప్పుడు వచ్చాయో, ఎలా వచ్చాయో — విచిత్రంగా ఇద్దరి మధ్య అభిప్రాయ భేదాలు వచ్చేశాయి. ఇదివరకు స్థూలంగా సంజీవరెడ్డి గ్రూపు, సంజీవయ్య గ్రూపు అని రెండుగా చీలి వున్న రాష్ట్ర కాంగ్రెసు కొత్త గ్రూపు—బ్రహ్మానందరెడ్డి గ్రూపు—రావడంతో మూడైంది. రాష్ట్రం కేబినెట్‌లోనే ఆయనను బహిరంగంగా విమర్శించేవారు బయల్దేరారు. ఈ విభేదాలను బయటినుంచి కొందరు అగ్ర నాయకులే ప్రోత్సహిస్తున్నారని శ్రీ బ్రహ్మానందరెడ్డి ఢిల్లీ వెళ్ళి పెద్దలకు ఫిర్యాదుచేసి వచ్చారు. శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డిని కేబినెట్‌నుంచి తొలగించాలని కూడా అనుకుంటున్నట్టు వదంతులు వచ్చాయి. అయితే, రాష్ట్రంలో ఇప్పుడు ఏ మార్పులు చేయటం మంచిదికాదని కేంద్ర నాయకత్వం సలహా ఇచ్చింది.

దీనితో శ్రీ బ్రహ్మానందరెడ్డి చాలా ఇరకాటంలో పడ్డారు.

ఇది ఇలా వుండగా, శ్రీ సంజీవయ్యను తమతో కలుపుకోవాలని అటు శ్రీ సంజీవరెడ్డి, ఇటు శ్రీ బ్రహ్మానందరెడ్డి కూడా ప్రయత్నించారట. చివరికి శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డి, శ్రీరామచంద్రారెడ్డి మొదలైన వారు చేసిన ప్రయత్నాలు ఫలించి, ఉన్నట్టుండి ఒక శుభోదయాన (ఆనాడు అమావాస్య అయినప్పటికి) శ్రీయుతులు సంజీవరెడ్డి, సంజీవయ్య ఏకమై పోయారు. ఇది రాష్ట్ర రాజకీయాలలో అనుకోని విచిత్ర పరిణామం. నిన్న మొన్నటి వరకు బద్ధ వైరులుగా వున్న ఈ ఇరువురు కలిసి పోవడం చాలా ఆశ్చర్యకరంగానే జరిగింది. ఇది ఎందుకు జరిగిందో, ఎలా జరిగిందో, ఎంతకాలం నిలుస్తుందో ఊహాతీతం. శ్రీ బ్రహ్మానందరెడ్డిని దెబ్బ తీయడానికే జరిగినట్టు కొందరంటున్నారు. ఏమైనా ఆయన చెయ్యి ఇప్పుడు కిందైపోయింది.

రాష్ట్రంలోని రాజకీయ విషయాలపై పెత్తనం చెలాయించేటందుకు గాను శ్రీయుతులు సంజీవయ్య, రఘురామయ్య, సుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి గార్లతో ఒక కమిటీకూడా ఏర్పడిందట. అంటే ఇకపై అసెంబ్లీ, పార్లమెంటు అభ్యర్థులను నిర్ణయించే తతంగంలో వీరిదే పైచెయ్యి అవుతుందన్నమాట. వెనుకనుంచి భాగవతం ఆడించే జగన్నాటక సూత్రధారుడు శ్రీ కృష్ణభగవానుడు ఎలాగూ వుండనే వుంటాడు.

ఎన్నికల వరకు ఈ యేర్పాటు ఇలాగే వుండవచ్చునని అభిజ్ఞులు భావిస్తున్నారు. అయితే ఆ తరవాత ఏమవుతుంది అని ఊహాగానాలు జరుగుతున్నాయి. శ్రీ బ్రహ్మానందరెడ్డి ఏమవుతారు ? ముఖ్యమంత్రి ఎవరవుతారు ? ఇదంతా మంచికే వచ్చిందా, చెడుకే వచ్చిందా ? ఈ కథంతా తెరపై చూడవలసిందే.

***

చందా దారులకు మనవి

పాత చందా దారులు తిరిగి చందా పైకం పంపేటప్పుడు మీ చందా నెంబరు, అడ్రసు వివరంగా వ్రాసి మాతో సహకరించ ప్రార్థన.

మేనేజరు, "జ్యోతి"

అరటి తొక్క

[కాదేదీ కవిత కనర్హం]

జోరుగా వర్షం కురిసి ఆగిపోయింది. తెంగుళూరు బస్ స్టాండు చిత్తడి చిత్తడిగా అసహ్యంగా వుంది. జనం ప్యాంట్లు మడిచి, గొడుగులు విప్పి నడుస్తున్నారు. బస్ స్టాండు గడియారం మూడు ముప్పావు చూపింది. రకీమని అనంతపురం బస్సు ఖాళీగా ప్రవేశించింది స్టాండులోకి. భాస్కరం కిళ్ళీ షాపు ముందు పొగ వదుల్తూ నిలబడి వాచీ చూసుకొన్నాడు. "అరె! రైట్ టైముకే వచ్చేసిందే" అన్నాడు కన్నడంలో కిళ్ళీషాపు వాడితో. కిళ్ళీషాపు వాడు ఏం మాట్లాడకుండా చూస్తూ కూర్చున్నాడు భాస్కరం వేపు.

రిజర్వు టికెట్టు మరోసారి చూసుకొని భద్రంగా ప్యాంటు కుడి జేబులో దాచుకొన్నాడు. కిళ్ళీషాపువాడు భాస్కరాన్ని గమనిస్తూనే వున్నాడు. చిన్ని మీసాలు, నారో ప్యాంటు, టీ షర్టుతో నిలబడ్డ భాస్కరం ఏం ఉద్యోగం వెలగ బెడుతున్నాడో అని ఆలోచిస్తున్నాడు. కిళ్ళీషాపుముందు అటొకటి ఇటొకటి వ్రేలాడుతున్న అరటి పళ్ళ గెలలు చూశాడు భాస్కరం. అనంతపురంలో తన తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ గుర్తొచ్చారు. వెంటనే ఓ డజన్ బేర మాడి కొన్నాడు. పళ్ళు సంచిలో దాచేసుకొని తనో పండు ఒలిచి తింటో నిలబడ్డాడు. కిళ్ళీషాపువాడు గమనిస్తూనే వున్నాడు. భాస్కరం అరటి పండు తినడం ముగించి తొక్క అవతల పారేసి, ఎడమ ప్యాంటు జేబులోని చేతి రుమాలుతో మూతి ముడుచుకొన్నాడు.

"ఆ తోలు ప్రక్కన పారేయ కూడదూ? ఎవడన్నా తొక్కి పడ్డానికా? అని పోలీసులా అరిచేడు కిళ్ళీషాపు వాడు కన్నడంలోనే.

"ఎవరూ పడరు. అంత కళ్లులేకుంటా ఎవరూ నడవరు. మూసుకొని నడిస్తే పడ్తారు. వాళ్ళ ఖర్మ." అని పక్కనే దగ్గరున్న పెద్ద ముల్లును చూసి గబగబా ప్రక్కనే ఉన్న హోటల్లోకి దాగి తీశాడు.

'ఓ పది నిమిషాలు పోజులు కొట్టాడు. అప్పుడు టిఫిన్ తినకూడదూ ఇప్పుడు పరుగెట్టకపోతే' అని మనసులోనే అనుకొన్నాడు కిళ్ళీషాపువాడు.

భాస్కరం హోటల్లోకి ప్రవేశించి ఓ దోసె ఆర్డరిచ్చి అదొచ్చేంతవరకూ కాలక్షేపానికి పకోడీ పత్రమ్మన్నాడు

మొదటి బహుమతి రూ. 50

సి. ఇందిర
(బి. ఎస్ సి. ఫైనల్, గవర్నమెంటు ఆర్ట్స్ కాలేజి. అనంతపురం)

సర్వరుతో. పకోడీ కాజేశాడు. తర్వాత ఓ ఐదు నిమిషాలగ్గాని దోసె రాలేదు. దోసె గబగబా లాగేశాడు.

"కాఫీ తెమ్మంటారా సార్ !" అన్నాడు సర్వర్.

ఔ నన్నట్టు ఎడమ కనురెప్ప పైకీ క్రిందికీ ఎగరేశాడు నాగేశ్రావులా.

గంట నాల్గూ పది అయింది. బస్సు నాలుగుం బావుకి కదలాలి. కాఫీ తాగేసి భాస్కరం హోటల్ తలుపు మధ్యగా నిలబడి సిగరెట్టంటిస్తున్నాడు.

"జరగవయ్యా" అంటూ లావుపాటి మనిషి భాస్కరాన్ని తోసికొని బయటి కెళ్ళాడు. దూరంగా పసుపుపచ్చ అనంతపురం బస్సు హడావుడిగా హారన్ వేసింది., భాస్కరం వాచీ చూసుకొని "ఇంకా మూడు నిమిషా లుంది, ఇవేం బస్సులు" అంటూ కిళ్ళీషాపువాణ్ణి చూస్తూ బస్సువేపు పరుగు తీశాడు.

అంతే. తర్వాత నల్గురు మనుషులు, కిళ్ళీషాపువాడు పగలబడి నవ్వు తున్నారు. కారణం మీరంతా ఊహించే వుంటారు. మన నారోప్యాంటు, టీషర్టు భాస్కరం తను పారేసిన అరటి తొక్క మీదే తన పాయింటెడ్ షూ పెట్టేడు. 'సర్' మని జారి బురద గుంటలో పడ్డాడు. మెల్లగా లేస్తు న్నాడు. తెల్లని ప్యాంటు, చొక్కా బురదలో పాడైపోయాయి. మొహ మ్మీద కూడా కొంత చిమ్మింది.

బస్సు కండక్టరు తన లెక్క సరి పోక పోవటం వల్ల తికమక పడుతూ ఈ గలభా చూసి ఇటొచ్చాడు. భాస్కరం యెక్కాల్సిన బస్సు అదే అని, అతను రిజర్వుడు చేసుకోవడం వల్ల లెక్క సరిపోలేదని తేలిన కండ క్టరు తాపీగా నవ్వుకొన్నాడు చుట్టూ చేరిన మనుషులు ఇంకా నవ్వుతూనే వున్నారు.

" 'ఎవరేనా పడొచ్చు, ప్రక్కన పారేయండి సార్ !' అన్నా అప్పుడు విన్లేదు. 'ఎవరు పడ్తార్లే' అని ధీమాగా అన్నాడు పెద్దమనిషి" అని కిళ్ళీషాపు వాడు భాస్కరాన్ని నవ్వుతూన్న వాళ్ళకు పరిచయం చేశాడు. భాస్కరం బురద పట్టిన ప్యాంటూ షర్టును ఏం చెయ్యడమా అని ఆలోచిస్తుండడంవల్ల వాళ్ళ నవ్వులు అతని చెవుల్లో పడ లేదు.

***

★ అరుగుమీద కూర్చుని ఏడుస్తున్న రెండేళ్ల పిల్లాణ్ణి దారే పోయే పెద్ద మనిషి పలకరించాడు.

"ఓంతమ్మా, ఎందుకూ ఏలుతున్నావ్" కుర్రాడు ఏడుపు ఆపి "ఏమి టయ్యా. ఎద్దులా వుండి ఆ ముద్దుమాటలు ?" అన్నాడు.

నిజాయితీ

హోటల్లో టిఫిన్ తినేసి డబ్బులు చెల్లిద్దామని కౌంటరు దగ్గరికి వెళ్ళాను, చేతిలో బిల్లు ఉంచుకుని. హిప్ ప్యాకెట్‌లో ఉన్న డబ్బులు తీయటానికి యింకో చేతిని పోనిచ్చాను. కౌంటరికి అటుప్రక్కన ఓ ఆరేళ్ళ అమ్మాయి నిలుచుని ఉంది. చిన్ని పెదాలూ, వెడల్పాటి కళ్ళూ, బుగ్గల్లో నొక్కులు నల్లటి వెంట్రుకలు అలా చూచేసరికి యితరుల విషయం ఏమోగాని నాకు మాత్రం ఎంతో ఆనందమేసింది. ఆ పాపని చూచేసరికి. కాసేపట్లో జాలేసింది, ఆ పాప వేసుకున్న దుస్తుల్ని చూచి. చిరిగిపోయిన ఫ్రాకులోంచి చిన్నారి దేహం కన్పిస్తోంది. "ఏం కావాలో? ఆకలేస్తుందేమో?" అనుకున్నాను. కళ్ళెత్తి చూచేటప్పటికి కౌంటరు ముందర పది పదిహేను మంది జనం పోగయ్యారు. గబగబ బిల్లక్కడవేసి డబ్బులు బిల్లు మీదుంచాను. కౌంటరుమీద ఆరుఏడు బిల్లులు అయిదారు నోట్లు వచ్చిపడ్డాయి రపాల్న.

సరిగ్గా అదే క్షణంలో, ఆపాప జేబులోంచి అయిదు ఆరు మడతలు మడచిన ఓ రూపాయి నోటుతీసి చేతులో ఉంచుకుని, చాచి మునివ్రేళ్ళమీద నిల్చుని కౌంటరుమీద వేసింది.

"చిల్లర యిస్తారా అండీ?" అంది.

ఆశ్చర్యపోయాను నేను. అంతదాకా నిల్చొని నిల్చొని ఎగాదిగా చూస్తూ నిలుచున్నది ఆ రూపాయి చిల్లర కోసమా? అనుకున్నాను.

కౌంటరుమీదున్న హోటల్ మేనేజరు రూపాయి నోటుని, అన్ని నోట్లతోపాటు కలుపుకుని గళ్ళాపెట్టెలో వేసుకున్నాడు. కౌంటరు దగ్గిర నిలుచున్న అమ్మాయి ముఖం పైకెత్తి చూస్తోంది. ఎక్కడో మాటాడుతూ, రెండు పావలా రూకలూ ఏభై పైసలు అమ్మాయి దగ్గర వేశాడు తీసుకోమని మేనేజరు.

పైసలన్నీ నెమ్మదిగా తీసుకుని చిన్ని చేతుల్లో లెక్కెట్టుకుంది ఆ అమ్మాయి. కాసేపు చూచింది. కాళ్ళెత్తి అదోలా ముఖం పెట్టింది. ఆ పాప పద్ధతేం అర్థంగాక ఆశ్చర్యంగా చూస్తున్నాను నేను.

"మీరు . మరేమో రూపాయికి చిల్లర యిచ్చారండీ?" అంది.

" మళ్ళా?" అన్నాడు ప్రశ్నిస్తూ మేనేజరు. కౌంటరులోంచి లేచి, వంగి, అమ్మాయిని చూచి పలకరిస్తూ నెమ్మదిగా మేనేజరు. అంతలోనే ఆ లేత బుగ్గల్ని ఓసారి చిదిమాడు.

"మరేమో ... మరేమోనండీ! నేను ..నేను యిచ్చింది రూపాయి కాదండీ? అర్థ రూపాయకాసేనండీ? మరేమో మరేమోనండీ రూపాయ చిల్లర యిచ్చేరండీ!" అంది ఇంచుమించు ఏడుస్తున్నట్లుగా పాప.

రెండవ బహుమతి రూ. 25

జె. శశాంకశేఖర్
(బి. ఎ. మొదటి సంవత్సరం,
నిజామ్స్ కాలేజీ, హైదరాబాదు)

ఆశ్చర్యం కలిగింది నాకు. కాకపోతే ఏమిటిదీ. నా కళ్ళారా నేనే చూచానే! మడచిపెట్టిన నోటును తీసి కౌంటరుమీద వేసింది యీ పాపే. ఆపాప వేసింది రూపాయే. కానీ మరి అర్ధరూపాయే యిచ్చా నంటుందేం! అనుకున్నాను.

"అల్లాగా! గుడ్‌గర్ల్! డబ్బు లెక్కవిచ్చానని వెనక్కిస్తుండటమే కాకుండా 'ఏడుస్తావెందుకూ! మంచిదికదూ!?" అంటూ మతి మరపులో తాను అర్ధరూపాయే తీసుకుని రూపాయకి చిల్లర యిచ్చాను కాబోలు ననుకుని పాప యిచ్చిన అర్ధరూపాయిని పెట్టెలో వేసుకున్నాడు మేనేజరు.

"మణీ..!" అంటూ అంతటితో ఆగక ఓ సర్వరును పిలిచి, ఆ అమ్మాయి చేతిలో ఓ యిడ్డెనువుంచమని చెప్పాడు.

"..వద్దండీ! నా కక్కర్లేదండీ? మా నాన్నగారరుస్తారండీ!" అందామ్మాయి.

"పర్లేదు తిను బేబీ!" అన్నాడు మేనేజరు.

ఆ పాప నిజాయితీ ఏమిటో బోధపడలేదింతకీ. సరే ఏమయినా యీ కేసు అంతు తేల్చుకోవాలనుకున్నాను. నెమ్మదిగా ఆ యిడ్లీ తిని ."వెళ్ళొస్తానండీ!" అని హోటల్‌దిగి నడిచి వెళ్ళింది పాప.

"....ఎవరో మంచి అమ్మాయిలాగుంది. పిల్లల పెంపకం అలా ఉండాలి. మన వాళ్ళయితేనా? మాట్లాడకుండా చక్కా పట్టుకొచ్చేస్తారు."

వెనకాల హోటల్ మేనేజరు ఎవరి

త ~ ... ంటే నవ్వుకున్నాను. అమ్మాయిని వెంటాడుతూ .

తిరిగి చూడకుండా నడుస్తోందా పాప. చిక్కడపల్లి దాటి నారాయణ గూడ వరకు నడచింది. గాంధీ బొమ్మ దగ్గర కాసేపు నిల్చుని చుట్టూ చూచింది. దూరంగా ఆ అమ్మాయిని చూస్తూనే ఉన్నాను నేను. దగ్గర్లో ఉన్న యింకో హోటల్లోకి దారి తీస్తుంటే చూచిన నేను పొందిన ఆశ్చర్యానికి అంతులేదు. అనుసరించి అదే హోటల్లోకి దారి తీశాను నేనూ. ఆ పాప ఎవరినీ గమనించకుండా కౌంటరు దగ్గరికి నడిచింది.

ఎవరో సర్వర్ వచ్చి అడిగా డేం కావాలని ఆ పాపని.

"పది యిడ్లీలు పార్సెల్ చేసివ్వ గట్టి పట్నీ వెయ్యేం?" అంది.

కాఫీ తాగుతూ ఆ పాప మాట్లాడిన ప్రతి మాట వింటున్నాను నేను. సరిగ్గా అదే సమయానికి రష్ యెక్కువయి పోయింది. సర్వర్ కాసేపట్లో పెద్ద పార్సెల్ తెచ్చి యిచ్చి వెళ్ళిపోయాడు. బిల్లు తీసుకున్న నేను. ఆ పాప కదులుతుందేమో అని చూస్తూ నిలుచున్నాను. కానీ పది నిమిషాలయినా కదలని ఆ పాపని చూస్తోంటే అర్థంగాక తెల్ల మొహం వేశాను నేను. కాసేపట్లో రష్ తగ్గింది కౌంటర్‌లో కూచున్న హోటల్ మేనేజరు అమ్మాయిని చూచినట్లున్నాడు.

"ఏం పాపా? ఏం కావాలి?' అన్నాడు ప్రేమగా.

"డబ్బులండీ?" అం దమాయకం!

ముఖంపెట్టి కౌంటర్ మీదికి ఎగురుతూ యించుమించు.

'అయితే యిదన్న మాట నాటకం' అనుకున్నాను నేను. నేరుగా కౌంటర్ దగ్గరపోయి నిల్చున్నాను నేనూ.

"అల్లాగా పాపా మరచిపోయాను నేను. ఎంతిచ్చావమ్మా నీవు? ఏం తీసుకున్నావ్?" లాలిస్తూ అడిగాడు మేనేజరు.

"మరేమోనండీ? పదిడ్లీలు పార్శిల్ తీసుకున్నానండీ! పది రూపాయల నోటు యిచ్చానండీ. పోతే మరేమోనండీ నాన్నగారేమో తొమ్మిది రూపాయల చిల్లర వస్తుందని చెప్పారండి."

పదిరూపాయలే! హే భగవాన్! ఎంత మోసం? అన్యాయం. ఈ లేత వయసులోనే ఇంత అన్యాయమా? ఇన్ని అబద్ధాలా? ఎలా నేర్చుకుందీ పాప? ఎవరు నేర్పారీ పాపకు?

ఊహుం నా మనసూరుకోలేదు. కానీ. తిరిగి చూద్దునుకదా? చిరిగిన ఫ్రాకును పైకెత్తి కన్నీళ్ళు ఒత్తుకుంటోన్న పాప కనిపించింది. అబ్బా! ఎంత అద్భుతంగా నటిస్తోంది. చిన్న పాపయినా అనుకున్నాను. ఆ హోటల్లో దొంగ నిజాయితీ ప్రదర్శించి అర్ధరూపాయి నష్టం చేసుకుంది. ఇక్కడ అమాయకతని ప్రదర్శించి పది రూపాయలు దొంగిలించు కుంటున్నది. పిల్లలు చేసే పెద్దతరహా దొంగతనమా? లేక పిల్లల వెనక పెద్దలు చేసే చిన్న తరహా లూటీయా?

"ఏడ్వకు పాపా! ఇదుగో ఇస్తున్నాగా! తీసికెళ్లు ఏడ్వకేం?"

పార్శిలు తొమ్మిదిరూపాయల చిల్లరా, పుచ్చుకుని బయటికి వెళ్ళిపోయింది పాప.

హోటల్ వాడిని అడిగాను నేను.

'అదేమిటండీ? ఆ పాప డబ్బులే యివ్వలేదు. అలా ఆ అమ్మాయి అడిగినంతా యిచ్చేయటమే!? అన్నాను.

"ఇంకా నయం? ఆ పాపముందే చెప్పారుగాదు. ఎంత నొచ్చుకునేదో! తనది కానిది ఒక్క పైసా కూడా ముట్టదు తెలుసా? ఓసారిలాగే మరపులో బాగా రష్ యెక్కువగా ఉన్నపుడు రెండు రూపాయల నోటు యిచ్చిందనుకుని చిల్లర యిచ్చాను. కానీ తీసుకుని వెళ్ళిపోయిందనుకున్నారు గదూ? ఊహుం. వెళ్ళలేదు. తానిచ్చింది రూపాయేనని, రూపాయి డబ్బులు తిరిగి యిచ్చి మరీ వెళ్ళింది ఏడుస్తూ! ఆ పాప మాకేం కొత్త కాదులెండి! చాలా నిజాయితీగల పిల్ల!"

అంటే యీ హోటల్లో ఈ నాటకం యింతక్రితం ఆడిపోయిం దన్నమాట. ఈనాడు ఆ నిజాయితీతో పది రూపాయలు కొట్టేసింది. చిక్కడపల్లి హోటలుదగ్గర తగుల్తుందేమో యింకో రోజు.

ఎంత గొప్ప ప్లాను!!

ఆశ్చర్యంతో బయటికి వచ్చి చుట్టూ చూచాను. పక్కనే ఉన్న గల్లీలోకి దారి తీస్తోంది పాప. ఆశ్చర్యంతో నిలుచుండి పోయా నలాగే నేను.

★★★

పచ్చనోటు

మాధవరావు ఆ కాలేజీలో లెక్చరరు. చాలా తెలివైన వాడని అందటి అభిప్రాయం (అతని అభిప్రాయం కూడా అదే!) ఎమ్. ఎస్ సి. యూనివర్శిటీ ఫస్టున ప్యాసయ్యాడు మరి. అందునా పాత రికార్డులు 'ముక్కా-ముక్కలు' చేసి ఉత్తీర్ణుడయ్యాడు. మరి అలాంటివాడు కాలేజీలో లెక్చరరుగా యెందుకు చేరవలసి వచ్చిందీ అని అడుగుతారేమో? అయ్యా! తమకు తెలియని దేముంది. పాపం, మాధవరావు చాల బీదవాడు. అందునా పరపతిగల అధిపతుల ముక్కూ-మొహం (కాళ్ళూ చేతులూ ఇత్యాదులు) కూడా తెలియనివాడు.

సరే! మాధవరావు చాల తెలివైన వాడని కదా చెప్పుకొన్నాం. అతన్ని క్లాసులో విద్యార్థులు అడిగిన ప్రశ్నలలో ఏవి నిజంగా సందేహనివృత్తి గురించి అడిగినవో, ఏవి తనని ఏడిపించడానికి ఉద్దేశించినవో ఇట్టే సూక్ష్మంగా పరిశీలించి, ఎవరికి 'అర్థమయ్యే' పరిభాషలో వాళ్ళకి ఆవిధంగా సమాధాన మివ్వడంలో దిట్ట. మొత్తమ్మీద అతనంటే చాలాబాగా చెప్తాడని విద్యార్థు లందరికీ భక్తి, గౌరవము. స్టాపు అందటికీ అతను చాలా 'స్నేహపాత్రుడు' మరి, అలాటివాడికి ఒకనాడు ఏం జరిగిందంటే........

* * *

'సీతా! నేనలా వెళ్ళొస్తాను. ఏవైనా కావలిస్తే చెప్పు. తీసుకొస్తాను' అన్నాడు మాధవరావు బయటికి వెళ్ళబోతూ భార్య నుద్దేశించి.

"ఏవీ అక్కరలేదు. కాని ఏవో రెండు కూరలు తెచ్చి పడెయ్యండి చాలు" అందామె వంటింట్లోంచే.

సరే, మాధవరావు మార్కెట్టుకు బయలుదేరాడు. దూరాన్నుంచే మార్కెట్టులో నుంచి పొగలూ, గత్రారావడం చూశాడు. దగ్గరకెళ్ళి చూస్తే ఏముంది? మార్కెట్టులో కూరల ధరలన్నీ మండిపోతున్నాయి. ఈ మంటనార్పడానికి ఫైరు సర్వీసు వాళ్ళకి సాధ్యంకాదు కదా! మార్కెట్టంతా చాల రద్దీగా ఉంది. ఎక్కడ చూసినా అరుపులూ. కేకలూ (ముఖ్యంగా అమ్మే వాళ్ళవే ఇవి) సరే, మాధవరావు అలా చూసుకొంటూ వెళ్తా ఒక చోట కూరగాయలు బావున్నట్టుగా తోచి అక్కడ కెళ్ళాడు కొందామని. చాలమంది జనం అక్కడే కొంటున్నారు. మాధవరావు అరవీశ వంకాయలు, పావువీశ బీరకాయలూ కొని అయిదు రూపాయల నోటు అందించాడామెకు. ఆ మనిషి ఎవరికో తూస్తున్న సందడిలో ఆ నోటు తీసుకొని అడుగున పెట్టింది. మాధవరావు ఒకటి రెండు నిముషాలు అలా నించున్నాడు చిల్లర గురించి. ఆమె పని అయేవరకూ.

రెండవ బహుమతి రూ. 25

కొడవంటి సత్యనారాయణ!

(సెకండియర్, గవర్నమెంట్, పాలిటెక్నిక్, విశాఖపట్టణం_7

ఆమె చిల్లర ఇవ్వలేదు. పైగా తన పని అయిపోయేక అతనివేపు తిరిగి,

"బాబుగోరూ, తవురు డబ్బు ఇవ్వ లేదు ఇంకా." అంది.

మాధవరావు ఇదివిని తెల్లబోయాడు. తను డబ్బు ఇస్తుండగా చూసినవాళ్ళు యెవరూలేరు, అందఱూ ఎవరి పనుల్లో వాళ్ళు మునిగి ఉన్నారాయె.

అతను తను అయిదు రూపాయల నోటు ఇచ్చానని చెప్పాడు.

"బాబుగారు, తవురు అబద్ధ మాడు తున్నారని అనను కానీ, తవురు ఏమీ నాకు ఇవ్వలేదు బాబూ. నాదగ్గిర అసలు ఒక్క అయిదురూపాయల నోటైనా లేదు. కావలిస్తే చూసుకోండి ఇదిగో" అంటూ ఆమె అడుగునున్న డబ్బుల పెట్టితీసి చూపించింది.

నిజం! అందులో అయిదురూపాయలనోటు ఒక్కటికూడా లేదు. అక్కడున్న అందరూ మాధవరావు వేపు వింతగా, ఆశ్చర్యంగా, అనుమానంగా చూశారు. మాధవరావు కొంత షేమ్ ఫీలయ్యాడు. అయినా, స్వతహాగా తెలివైన వాడు కదూ! కొంతసేపు ఆలోచించగా మెదడులో ఒక ఆలోచన మెరపులా తట్టింది. తట్టిన వెంటనే

"అమ్మీ! నిజంగా నే నిచ్చాను. నే నిచ్చిన దానికి ఏదో పసుపు మచ్చ కూడా ఉన్నట్లు అనుమానం. క్రింద నేలమీద యెక్కడైనా పడిపోయిందేమో చూడు" అని అన్నాడు.

వెంటనే ఆమె నేలమీదకు వంగి అటూ ఇటూ వెతికి కొంతసేపయాక ఒక అయిదు రూపాయల నోటు పైకి తీసింది తీసి,

"నన్ను చమించండి బాబూ? చూచుకోలేదు. ఇదిగో. తమరిచ్చిన నోటు. ఇదిగో, దీని కిక్కడ పసుపు కూడా అంటుకొన్నాది బాబూ" అంటూ చెప్పింది.

మాధవరావు ఒక్క క్షణం నిశ్చేష్టుడై అలా ఉండిపోయాడు యెందుకో మరి. ఇంతట్లోకే ఆమె

"బాబూ, ఈ నోటు సెల్లదుబాబూ! పసుపు మరకలు బాగా అంటుకొన్నాయి. దయసేసి మరోటి ఇప్పించండి" అంది.

అక్కడున్న అందరూ నోటు ఉన్నట్లు చూసుకోకుండా మాట్లాడినందుకు ముందు ఆమెను తిట్టి, తరువాత ఆ నోటు చెల్లదని చెప్పి మాధవరావుని మరోటి ఇమ్మన్నారు ఆమెకు. మాధవరావు ఆనోటు తీసికొని మరోటిచ్చాడు యాంత్రికంగా.

* * *

సరే. మాధవరావు తెలివిగా తన నోటు సంపాయించే డనుకొంటున్నారు కదూ. కాని అలా జరిగినట్టయితే అసలు కథేముంది? అసలు నిజంగా మాధవరావు ఇచ్చిన నోటు మంచిదే! కాని తను పసుపు మచ్చలు ఉన్నట్టు అనుమానం వెలిబుచ్చితేనైనా ఆ నోటు చెల్లదేమోనని భయపడి తీస్తుందని చాల తెలివిగా ఆలో పథకం వేశాడు, కాని, ఆ కూ ఇతని కన్నా చాల తెలివైనది. కని ఇంతకుముందే తన దగ్గరున్న చెల్లని అయిదు రూపాయల నో ఇతనిదంటూ అంటకట్టింది. అంత తె. వైన యూనివర్శిటీ ఫస్టు మాధవరావు కూడా కూరలమ్మిదగ్గర బోల్తాకొట్టాడు.

***

పోటీదార్లకు మనవి

"జ్యోతి" మాసపత్రిక కళాశాలల, విశ్వవిద్యాలయాల విద్యార్థినీ విద్యార్థుల నిమిత్తం "చిన్నచిన్న కథల పోటీ" నిర్వహిస్తున్నది. దీనిలో పాల్గొనేవారు ఈ క్రింది నిబంధనలు పాటించ గోరుతున్నాము.

1. కథలు "జ్యోతి"లో రెండు మూడు పేజీలకు మించరాదు.

2. స్వకపోల కల్పితమైనస్వతంత్ర రచనలే పంపించాలి.

3. తమ పూర్తిపేరు, చదువుతున్న తరగతి, కాలేజీ, లేక విశ్వవిద్యాలయం పేరుతో సహా పూర్తి చిరునామా జత పరచాలి.

4. ప్రతినెల 1వతేదీ వరకు అందిన రచనలనే ఆ పైనెల సంచికలో పోటీకి పరిగణిస్తాము.

5. బహుమతి పొందని రచనలు త్రిప్పి పంపబడవు. అందుచేత స్టాంపులు పంపించ నవసరం లేదు. రచనల విషయమై ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

6. కవరు మీద "జ్యోతి, చిన్న చిన్న కథల పోటీకి" అని స్పష్టంగా వ్రాయాలి.

7. రచనలను పంపవలసిన చిరునామా ఎడిటర్, "జ్యోతి" సచిత్ర మాసపత్రిక, విజయవాడ-2."

8. రూ. 50లు ప్రథమ బహుమతి. రూ. 25 లు చొప్పున రెండు ద్వితీయ బహుమతులు.

చిరునవ్వు

వే. నరసింహారెడ్డి

అంగుళిమాలా! అంగుళిమాలా!

గాలిలో అలలుగా ఆ శబ్దం తేల సాగింది.

మూలమూలలా ప్రాలి చూసింది. సమాధానం రాలేదు.

'సోదరా అంగుళిమాలా' మళ్ళీ సాదరమైన ఆ పిలుపు. ఎద తలుపులు తెరచి రమ్మన్నట్టు.

సమాధానంగా వికటాట్టహాసం.

ఆ అడవి గడగడ లాడింది.

చుట్టుగల కొండల గుండెలలో దడ
మళ్ళీ వికృతమైన నవ్వుతెర
పిడుగుల వడగళ్లు కురిసినట్లు
పిశాచాల నృత్య కేళికి భేరీ మ్రోగించినట్లు.

ఆ నవ్వు సవ్వడి వినబడినంతమేర
అరూపం పొడ కనబడినంత మేర
అడవి స్తంభించింది.

గర్జ. "ఎవరది? నన్నే?"

గర్జతో మేఘం కదలివచ్చింది. ఆ గర్జలో విలయలయ నవ్వింది. అయితే నెమిళ్ళు పురివిప్పి ఆడలేదు. అసలు వాటి జాడయే లేదు.

"ఎవరు నువ్వు"

దూరాన్నుంచి వస్తూనే ప్రశ్నించాడు వాడు. ప్రశ్నతో పాటు తీక్ష్ణ వీక్షణం కోపం రగిలిన ఆ చూపులో పాపం మండుతోంది.

మండే వాని అక్షి గోళాలపై క్రోధచండిక చండతేజం తాండవిస్తోంది.

ఐరావత మంతటి రూపు
ఆ కొన్న సింగంలా అరుపు
గళాన కరాళ కరాంగుళీ మాల
కరాన కసి లాంటి అసి

ఎదురుగా కాషాయాంబరాల్లో సాధు మూర్తి సాక్షాత్కరించిన క్షమ.

'ఎవరు నువ్వు?

ఎన్ని వేల గుండెలు నీకు? కొండల్నే గజగజలాడించే గండర గండని ఎదురుగా నిలువడానికి, బెదరక పిలవడానికి, ఎన్ని వేల గుండెలు నీకు?

నేటితో నీ బ్రతుకు పండింది. నీకు కాలం నిండింది. కుందేలై ఎందుకు వచ్చావిక్కడికి? పులి ఉందని తెలియదా! అభాగ్యుడా! నిన్నుచూస్తే నవ్వు వస్తోంది. ఎన్నడూ లేంది జాలి కలుగుతోంది. నీ స్థితి తలుస్తే నీకెందరు శత్రువులో తెలుస్తోంది. ఈ అడవి నడుమ ఆశ్రమంలో ఓ ఋషి ఉన్నాడని నిన్నెవడో పంపించాడు కదూ! నీ వాలకమే తెలుపుతోందది. నేను ఋషిని కాను. మగధ రాజధాని రాజగృహం నుండేనా నీరాక. 'ఋషిగిరి' నగరి కావలివైపు - ఆ ప్రక్క చైత్యకగిరి - అదిగో అదివృషగిరి. ఇటు ఈప్రక్కన దూరాన

వరాహ, వైహారగిరులు. వాని నడుమ అడవి యిది. తెలిసిందా ! ఆ ఋషిగిరి మీద ఉన్నారేమో ఋషులు.

ఇక్కడ కాదు.

"సోదరా ! నీ వంగుళిమాలుడవు కాదా ?"

'మూర్ఖుడా తెలిసేనా ఇటు వచ్చింది? ఒళ్ళు తెలియకనా ? నేనే అంగుళి మాలుణ్ణి. ఇంకా సంశయం ఎందుకు ? తెలియక పోతే విను. నా మెడలో చూడు అంగుళిమాల. దగ్గరగా వచ్చిచూడు. మరీ కనులు విచ్చిచూడు. జన పథంలో ప్రజలు, నిర్జన పథంలో పశుపక్షులు ఎవరిపేరు చెబితే అపువ్వలరచేతనిడి పరుగులు తీస్తారో – ఆ నేనే తెలియదా ?

ఈ ఊరికి ఈ దారికి క్రొత్తవాడవా ఏమి ?

ఈ మాలలోని ఒక్కొక్క అంగుళి నడుగు ఓ గాథ చెబుతుంది.

నా చేతి పౌరుషం ఎంతో– ఈచేతి వ్రేళ్ళ నోళ్ళే వేనోళ్ళ చాటుతాయి. ఇదిగో ఈ వ్రేలు చూడు. ఇప్పుడిది వట్టి ఎముకేకాని ఓనాడెలా ఉండేదని. ముగ్ధ బంతిలాంటి కన్నెది– వన్నె మాయని మేని ఛాయది. ఓనాడీడకే వచ్చింది ముని మాపువేళ. ఎందుకు వచ్చిందో తెలియదు. అచ్చంగా లేడిలా చూస్తే ఎంతగా నచ్చిందని ! ? జోడించిన రెండు చేతుల్లో—ఒకేసారి విసిరిన వేటుకు ఒకే వేలు తెగేలా వేశాను. అదే యిది. దానికో గడ్డిపోచ ఉంగరం ఉండేది. తోలుతోపాటు రాలిపోయింది.

ఇదిగో ఇది చూశావా ? పగలే కదా అని తెన్నున పోతున్న కుటుంబంలో బాలింతరాలి ఒడిలో పడుకొన్న శిశువు. నిద్రలో నోటిలో పెట్టుకున్న అంగుళి ఇది. ఇదేమో పౌరుషంతో పైకి రాబోయిన పురుష పుంగవుని వ్రేలు ఇది. దీని ప్రక్కనే ఉన్నదే ఇది ఒక కోటీశ్వరుడైనకోమటిది. ఇదేమో ఓ కవిది. తన్ను విడిచిపెడితే ఏదో నా మీద రాస్తానన్నాడు.

ఇల్లెన్నని చెప్పను ? అనుమానం వదిలిందా ? ' నేను తెలియందెవరికి ? చెట్టుకు తెలుసు. – గుట్టకు తెలుసు. రోజూ ఈ దారిన పోయే సూరీనికి తెలుసు. నిత్యం ఓ పుడిసెడు రక్తం వాడి మొహాన పుక్కిలిస్తే కందిన మొహం దాచుకునేందుకు ఆ కొండ చాటుకు వెళ్ళిపోతాడు. అరె ! ఇంకా నిలుచునే ఉన్నావే ! కాలికి బుద్ధి చెప్పనే లేదే ? గాలిలా వెళ్ళ లేదా ! కంపించడానికి బదులు అనుకంప చూపుతావెందుకు ?"

"సోదరా నువ్వు దుఃఖంలో ఉన్నావని తెలిసే వచ్చాను." అనూహ్యమైన ఆ సమాధానానికి అంగుళిమాలుడు బిగ్గరగా నవ్వాడు. కొండమీంచి రాయి దొర్లించినట్లు – గులకరాళ్ళ గంపగలపరించినట్లు, చుట్టూవున్న చెట్లూ గుట్టలు తనను వెక్కిరిస్తున్నట్లు మళ్ళీ

నవ్వినట్టు తోచింది వానికి ఎన్నడూ లేంది అలాంటి అనుభూతి ఇన్నాళ్ళూ తన భావనకే భయపడి ఆ చెట్లూ ఆ గుట్టలు ఒకటి నొకటి హెచ్చరించు కొంటున్నట్టుగా అనిపించే దతనికి ఈనాడలా లేదు ఎందుకో తనలో ఏదో -కొల్లదిగా, కొరతగా, కలతగా, నలతగా ఉన్నట్లు తోచింది మెత్తని కత్తి నోసారి లీలగా వలయంగా త్రిప్పి ఓసారి మట్టూ చూసి ఎదురుగా చూశాడు బెదరినాడేమోనని కాలివ్రేళ్ళ గోళ్ళు మొదలు ముడిచిన కెంజడల దాకా చూశాడు

అడుగుల చివళ్ళ మెత్తని జవుళ్ళు

సరసిలో విరిసిన పద్మాల్లా పాదాలు, అడుగుదాకా జీరాడే ఋషిమరోమల కాషాయాంబరం విశాలమైన ఎద_ అభయం చూపే చేతులు _ ఆలింగనం చేసుకోవాలని చూస్తున్నట్లు _ ఆశీర్వదిస్తున్నట్లు_ప్రసన్న సుందర వదనం. అంతకన్న మిన్నగా ఆ కన్నులు ఆ కన్నుల్లోకి సూదులు గ్రుచ్చినట్లు చూశాడు అంగుళీమాలుడు తను ఒక్కొక్కరి అంగుళులు నరికేముందు తనకేసి చూసిన ఆ కన్నులు స్మరించుకున్నాడు ఏదో అర్థిస్తూ, ప్రార్థిస్తూ దీనంగా హీనంగా చూసే వాకన్నులు మరి ఈ కన్నులో! మళ్ళీ చూశాడు

వర్షించబోయే మేఘంలా ఉన్నవి ఆ నయనాంతాలలో సుమించిన జాలి తనను లాలన చేస్తున్నట్లు అనుభూతి వాని ననుసరించియే ఆ పెదవి చివర దరహాసం తన కత్తికన్న మెత్తగా ఉంది పెదవిపైనా, కనుతుదలలోను శత కోటి వెన్నెలల వలయాలు

కనుల చివర హేమంత తుషారం ఉంది పెదవిచివర వాసంత సమీరం ఉంది భీష్మగ్రీష్మ మూర్తిలా తాను సుమ వసంతంలా ప్రభువు

ప్రభువు! ఎవడు ప్రభువు? తన ఆలోచనకు తనకే ఆశ్చర్యం కలిగింది. వికటంగా నవ్వాలని ప్రయత్న పూర్వకంగా నవ్వి అన్నాడు

“నేను దుఃఖంలో ఉన్నానని ఎవరు చెప్పారు నీకు? నేను దుఃఖంలో ఉండటమేమిటి? నా వద్దకు వచ్చేందుకు భయానికి భయం కలుగుతుంది. దుఃఖానికి దుఃఖం కలుగుతుంది

కన్నీళ్ళు కాలువలై పారుతూంటే పులకరించి చిలుకరించు కొన్నాను నా కత్తికీ, నాకూ రక్తాభిషేకం నిత్యం జరిగే పూజా క్రియ

విలాపాలు కలగానాలుగా విన్పిస్తవి నాకు తెలిసింది కసి _ నా అసికి తెలిసింది కసి

‘అవును సోదరా! కసి అసంతృప్తికి పరిణామరూపం అసంతృప్తి దుఃఖమే ఏకాకివైన నువ్వు ఎంత శోకాతురుడవో తెలుసు నాయనా,”

అంగుళిమాలుని ఎదలో కోపం తుఫాను రేగింది ఆ వీచిన పెను ఝంఝులలో దుఃఖ పరిమళాలు చింత నిప్పుల్లా మండే కన్నుల్లో కనిపించని దుఃఖ చింతా పవనాలు _ సమాధానం దొరకని అంగుళీమాలుడు కోపంతో అణువణువు కంపించాడు.

రా ! నాయనా ! నిన్నోసారి కౌగిలించుకోనీ నీ కోపం నీ శోకం అపనయించబడితే ఉపశమింపబడితేనాకాశించవలసిన దేముంది

వస్తున్నాను నీ పని పట్టడానికి

గర్జించబోయిన కంఠం గద్గదపడి జీరపోయింది లంఘించ బోయిన అడుగులు తడబడ్డాయి

శూలాల్లాంటి చూపులతో ఎదుటి నయనాల లోతులు చూడాలనుకున్నాడు

పెదవిపై మృదుహాసం సుందర చంద్రికాధవళిమ తెలిమల్లెల పరిమళాలు

కను తుదల చిందిన ఆనంద జలబిందులు చాచిన బాహులు చూసే సరికి పరుషపు చూపులు విరిగి వంగడమే కాదు ఎత్తిన కత్తికూడ నేల రాలిపోయింది కన్నుల్లోని మంటలు లోనికి జారి లోని వేదనా స్రవంతి పైకి ఉబికింది అంతర్దాహంతో సతమతమైనాడు అంగుళిమాలుడు తెలియకనే మాలను త్రెంచివేశాడు ఎదలో ఏదో వేదన

తడబడే అడుగులతో నేల రాలే వేళ ప్రభువు పైకెత్తి కౌగిలించుకున్నాడు

ఆ స్పర్శలో వానికి చలువ విలువ తెలిసి వచ్చింది

మంచుశిల కరిగి నీరైనట్లు ఏదో పరివర్తన

అమృత సేచనంవలె ఆనందానుభూతి

వెల్లువలై పారే కన్నీళ్ళు వేదన ఎద మాలిన్యం తుడిచేయి

సోదరా ఈ జగత్తు దుఃఖ సమేతం జన్మ దుఃఖము జరా దుఃఖము—వ్యాధి దుఃఖము – చావు దుఃఖము—నొవ్వు దుఃఖము ఉన్నది పోతే దుఃఖము అనుకున్నది రాక పోతే దుఃఖము ప్రియ వియోగం దుఃఖము అప్రియసంయోగము దుఃఖము ఈ దుఃఖము పరిణామ రూపాలే క్రోధం కసి ఈ దుఃఖానికి మూలం తృష్ణ — తృష్ణా నివారణోపాయం ఉన్నది – అదే అష్టాంగమార్గం— ఆ అష్టాంగమార్గం ఇది నాయనా !

ఇలా ఆయననోట చెప్పినాడో లేదో కాని ఆయన ఎదనుండి అంగుళీమాలుడు విన్నాడు

వాని నయనాంతాలలో ఆనందం తృప్తి లాస్యమాడేయి

అప్పుడే వెలిసిన ఓ వెన్నెల కిరణం వాని కన్నుల్లో తళుకు లీనింది ఆ తళుకుల్లో ప్రభువు రూపం ప్రతిబింబించింది

ఆ తలపుల్లో కలిసి తనువులో లీనమైంది ఎదకు ఎదపెట్టి ఆ బోధ విన్న అంగుళీమాలుడు ఆనంద పరవశాన అన్నాడు

ప్రభూ నీవు బుద్ధుడివా ?"

సమాధానంగా ప్రభువు చిరునవ్వు

***

‘కాస్మోపాలిటన్’

బాలగంగాధర్ తిలక్

రష్యాలో రివిజనిస్టు వోడ్కా సిప్ చేసి
చైనాలో రివల్యూషనిస్టు సప్పర్ భోంచేసి
అమెరికా హాలీవుడ్ తారాపథాలమీద చక్కర్ కొట్టి
టోక్యోలో గైషా యోషాధరాల టేస్టు చూసి
స్పెయిన్‌లో రెయిన్‌లో తడిసి
ఇరాన్‌లో కొరాన్ చదివి
ఈ రోజునే ఇండియా విచ్చేశారు వీరు

కాస్మోపాలిటన్ బోర్ వీరి మారుపేరు
శంకరుడూ సాంతాయనుడూ వీరి ఫింగర్ టిప్సుమీద
కారల్ మార్క్సూ కిర్క్‌గార్డూ వీరి హృదంతరాళంలో
బీటిల్సు బీట్నిక్సూ వీరి జిహ్వాగ్రంమీద
ఆరెంజ్ ఫ్రీస్టేట్‌లో వీరు ఉపన్యసించారు
అరిజోనాలో సత్యాగ్రహం చేశారు
వన్ వరల్డు రాస్తూ వెండెల్‌విల్కీ వీరిని సంప్రతించారు
ఆస్ట్రేలియన్ ఎబోరిజన్సు మీదా నెసెసిటీ ఆఫ్ ఎబోర్షన్సుమీదా
కలిసి ఒకే ఒక ఉద్గ్రంథం రచించారు
గాంధీకీ గాడ్సేకీ దాన్ని అంకితం యిచ్చారు
మొదటి భార్య నీయన వదిలేశాడు
రెండో ఆవిడ యీయన్ని తగిలేసింది
మూడో పెళ్ళాం కోసం మొనాకో పేపర్లలో ప్రకటించారు
ఫ్లీట్‌స్ట్రీట్‌లో బాండ్ స్ట్రీట్‌లో వీరి మాట వేదవాక్కు
స్ట్రిప్‌టీజ్‌లో ఫస్టుషోలో ఫస్టుసీట్ వీరికి జన్మహక్కు
పారిస్‌లో కవితనీ షాంపేన్‌నీ కలిసి సేవించారు
ఫ్లారెన్సులో యువతినీ ప్రకృతినీ కలిసి అనుభవించారు
ఫ్రీలాన్సు జర్నలిస్టు వార్ కరెస్పాండెంట్ వెంట్రిలోక్విస్టు
వీరు చూడని దేశంలేదు పొందని అనుభవంలేదు
అణుధూమం వంటి వీరి జీనియస్ భవిష్యత్తులో
అరవై శతాబ్దాల మీదకి కమ్ముకుంది
సకల సిద్ధాంతాలూ మతాలూ యిజాలూ సైంటిఫిక్ నిజాలూ
అన్నీ కలబోసి రంగరించి ఒకే ఒక రహస్యం కనుక్కున్నారు
దాన్నే తన మరణానంతరం ఎపిటాఫ్ గా ఎన్నుకున్నారు
దేవుడూ మానవుడూ వీరిద్దరే యీ అనంత విశ్వంలో మూర్ఖులు
ఏ కోణం నుంచి చూసినా వీరిద్దరూ మిజరబుల్ ఫెయిల్యూర్స్

పొట్టి కథలు

అతనికి పాతికేళ్ళుంటాయి ఆమెకి ఇరవై ఏళ్ళుంటాయి ఇద్దరూ మెడికల్ కాలేజీలో చదువుతున్నారు అతడు ఆమెను గాఢంగా ప్రేమించాడు ఆమె అతన్ని గాఢంగా ప్రేమించింది ఆమె నతడు పెళ్ళి చేసుకోవా లనుకున్నాడు అతడి నామె పెళ్ళాడాలనుకుంది కాని ఇద్దరికీ తగని సిగ్గు తమ ప్రేమను తమ హృదయాల్లోనే దాచుకున్నారు కనీసం చూపుల్లోనైనా ప్రేమను వ్యక్తం చేసుకోవడం వారికి చేతకాలేదు

ఒకరాత్రి పది గంటలవేళ ఇద్దరూ ఒంటరిగానే వున్నారు గదిలో ఆమె ఎడమవేపు కిటికీవద్ద నిలబడివుంది ఆకుపచ్చ నైలాన్ చీర ధరించి అప్సరసలా మెరిసిపోతోం దామె కుడివేపు కిటికీ దగ్గిర నుంచుని అతడు ఏదో ఆలోచిస్తున్నాడు టెర్లిన్ ప్యాంటూ చొక్కాతో రేగిన జుట్టుతో హాలీవుడ్ యాక్టర్లా వున్నా డతను

ఆమె ఏదో మాట్లాడాలని నోరు తెరిచింది మళ్ళీ సిగ్గు ముంచుకురాగా తలవాల్చుకుంది

అతడూ ఏదో అనాలని తలపైకెత్తి మళ్ళీ నిట్టూర్పు విడిచి వూరుకున్నాడు

ఆమె గదిమధ్యకు వచ్చి డ్రాయరు సొరుగులోంచి అతని ఫొటోతీసి చాల సేపు చూసింది హృదయానికి హత్తుకుంది ధైర్యంచేసి ముద్దుపెట్టుకుంది

అతడు జేబులోంచి ఆమె ఫొటో తీసి తనూ ముద్దు పెట్టుకున్నాడు

ఆమె ఫొటోకేసి చూస్తూ కొంచెం బిగ్గరగా రాజ్ ! నిన్ను ప్రేమిస్తున్నాను నువ్వు నన్ను ప్రేమిస్తున్నావో లేదో నాకు తెలియటం లేదు తెలిస్తే మా నాన్నగారితో చెప్పి పెళ్ళి ఏర్పాట్లు వెంటనే చేయిస్తాను అంది

అతడు ఆమె ఫొటోకేసి చూస్తూ గొంతు సవరించుకుని సిగ్గును అవతలకు నెట్టి బిగ్గరగానే అన్నాడు నేను నిన్నెంత కాలంనుంచీ ప్రేమిస్తున్నానో నీ కోసం ఎంతగా తపించి పోతున్నానో నీకేం తెలుసు నువ్వు నన్ను ప్రేమిస్తున్నావో లేదో తెలియక ఎంత బాధపడుతున్నానో నీకేం తెలుసు ? ప్రేమిస్తున్నానని ఒక్కముక్క నాతో చెప్పివుంటే ఈ పాటికి మా నాన్నగారితో నాకు వేరే సంబంధాలు చూడొద్దని చెప్పేయక వూరుకునే వాడినా ఎంత కఠిన హృదయరాలివి సుశీ ? అన్నాడు

ఇంత స్పష్టంగా తమ తమ ప్రేమలను వెల్లడించుకున్న తరవాతనైనా వారిద్దరికి పెళ్ళి జరిగి వుండవలసిందే కాని విధి బలీయం

అతడు అడయారులోని తన గదిలో కుడివేపు కిటికీ దగ్గిరగా కుర్చీ ఈడ్చుకుని పుస్తకం తెరిచి చదవటానికి ప్రయత్నిస్తున్నాడు

ఆమె త్యాగరాయ నగర్‌లోని తన గది ఎడమవేపు కిటికీ దగ్గిరగా మంచం

వైకుంఠ ద్వారాన్ని జయ విజయులు కాపలా కాస్తున్నారు. చీకటి బజారు వర్తకుడిలా వున్న ఒక ఆసామీ వొచ్చి లోపలికి పోనిమ్మన్నాడు.

జయుడు అతన్ని ఎగాదిగా చూసి "నువ్వెప్పుడన్నా పుణ్యం చేసిన పాపాన పోయావా ?" అని అడిగాడు.

"చెయ్యకేం ? ఈ మధ్యనే ఒక గుడ్డివానికి రెండు పైసలు దానం చేశాను" అన్నాడు చీకటి బజారు ఆసామి.

"నిజమేనా ?" అని జయుడు విజయుడి నడిగాడు. విజయుడు చిత్తా తిరగేసి "నిజమే" అన్నాడు.

"ఇంకేం చేశావు ?" అడిగాడు జయుడు.

"రెండ్రోజుల కిందటే ఒక కుంటి వాడికి ఒక పైస ఇచ్చాను."

చిత్తా చూస్తే అదీ నిజమేనని తేలింది.

"ఇంకా ?" అన్నాడు జయుడు.

ఆసామీ బుర్ర గోక్కుని "ఇంకేం లేదనుకుంటాను." అన్నాడు.

"ఏం చేద్దామంటావ్ వీణ్ణి" అని జయుడు విజయుడి నడిగాడు.

విజయుడు "ఏముంది ? ఆ మూడు పైసలూ వాడి మొహాన పారేసి చిత్ర

కొడుకు సరిగ్గా అన్నం తినడం లేదని. ఏది పెట్టినా వద్దంటాడని చెప్పి డాక్టర్ని సలహా అడిగాడు తండ్రి. "కుర్రాడికేదికావాలో కనుక్కొని, వాడే దడిగితే అది పెట్టండి" అన్నాడు డాక్టరు.

ఇంటికి వచ్చాక "ఏమన్నాడు డాక్టరు ?" అని అడిగింది భార్య.

"ఏదడిగితే అదల్లా పెట్టమన్నాడు. తల్లి పిల్లాణ్ణి అడిగింది ఏం కావాలని. కొడుకు గారెలు కావాలన్నాడు. తల్లి గారెలుచేసి, రెండుగారెలుప్లేటులో పెట్టి తినమంది.

"నాకిల్లా సయించవు. బాగా మాడ్చి పెట్టు" అన్నాడు కొడుకు. తల్లి ఆ రెండు గారెల్ని నల్లగా మాడ్చిపెట్టింది. "ఇంకా మాడాలి" అన్నాడు కుర్రాడు. బొగ్గుల్లా అయ్యేవరకు మాడ్చిపెట్టింది తల్లి.

"తిను" అన్నాడు తండ్రి.

కుర్రాడు గారెలకేసిచూసి "నువ్వోటి తిను. నే నోటి తింటాను" అన్నాడు తండ్రితో.

తండ్రి నెత్తి కొట్టుకుని "ఖర్మ" అంటూ ఓ గారె కష్టపడి తినేశాడు.

ఇంతలో కుర్రాడు ఇల్లెగిరి పోయేట్టు గొల్లున ఏడుస్తూ "నాకీ గారె వద్దు, నాది నువ్వు తినేశావ్" అని ప్లేటు విసిరికొట్టాడు.

***

పట్నం మామయ్య

వచ్చాడు.

వచ్చాడు,

పట్నం మామయ్య వచ్చాడన్న వార్త నిమిషాల్లో వూరంతటా వ్యాపించింది.

మారేడు పల్లె చిన్న కుగ్రామం. మారుమూల గ్రామం కూడా! తాలూకా పటంలో దాని వూసే కనిపించదు తుమ్మల్లో గ్రుంకిపోతున్న ప్రొద్దులా అది అడవుల్లో నిద్రపోతున్న పల్లెటూరు

ఆ పల్లెకు, పట్టణానికీ వున్న ఒకే ఒక లంకె పట్నం మామయ్య

కోట బురుజుపై నిల్చున్న కావలా సిపాయి మిత్రుడైన ఓ మహారాజు ఆగమనాన్ని గమనించినవాడై, వెను వెంటనే నగరంలోకి పరతెంచి వచ్చి శుభవార్తను పురజనుల కందరికీ చాటిచెప్పి స్వాగత సత్కారాలకు సన్నాహాలు చేయించడం ఎలాంటిది? సరిగ్గా అలాగే పట్నం మామయ్య రోడ్డులో బస్సు దిగాడన్న వార్త చీకి పొదలగుట్టలో మేకలు మేపుకుంటున్న అంజిగాడిద్వారా మారేడుపల్లికి తెలిసింది మంచులో తడిసిన తర్వాత నీ రెండలో నిగనిగ లాడుతున్న అడవి పువ్వుల్లా బడిపిల్లల ముఖాలు విప్పారిపోయాయి పంతులు రామజోగి ముఖం పండు గుమ్మడి పువ్వులా కళకళ లాడిపోయింది. ఇక పుల్లమ్మ సంతోషానికి పట్టపగ్గాలే లేవు. గుమ్మపాలు పైన మరగలు కట్టినట్టుగా ఆవిడ ముఖాన ఆనందం పరవళ్ళు త్రొక్కుతోంది. సంబరంలో కాలొకచోట నిలవక యింటికి ముంగిటికి, వీధికి వాకిటికి అదే పనిగా చెడతిరిగేస్తోంది రాజమ్మ. కొంత అతిశయోక్తికూడా మిళాయించి చెప్పుకోవాలంటే పట్నం మామయ్య రాబోతున్నాడనగా మారేడు పల్లెలో చెట్లుగూడా చిగురిస్తాయి. పిట్టలు పాడుతాయి వెదురు జొంపాల్లోనుంచీ వస్తున్న గాలి సవ్వడి పల్లెపైన ఆనందాల బావుటా రెపరెపలాడి నట్టుగా వినిపిస్తుంది ఎటొచ్చీ అవూరికంతా పట్నం మామయ్యరాకను కంటగించుకునే వాడొక్కడే! వాడి పేరు చిట్టిబాబు

చిట్టిబాబుకు వాడి భాషా ప్రపంచంలో కర్ణకఠోరమైన పలుకొక్కటే! — పట్నం మామయ్యా అనేది కళ్ళకు కనిపించడందాకా ఎందుకు, ఆయన కలలో కనిపించినా వాడికి జడుపే! వాడి దృష్టిలోమారేడు పల్లి ముందు నిత్యభోగాలకు విలయ

మధురాంతకం రాజారామ్

మైన స్వర్గలోకం బలాదూరు. కానీ ఎంతవరకు ? పట్నం మామయ్య నీడ వానిపైన పడేంతవరకు! పడీన తర్వాత వాడికా వూరువిడిచి ఏ కొండ కోనల్లోకో పారిపోవాలనిపిస్తుంది

సరే, యింకా ఉపోద్ఘాతాలెందుకు! పట్నం మామయ్య రానే వచ్చాడు

నట్టింట సిరిచాప వేసింది పుల్లమ్మ లేత కొబ్బరికాయ కొట్టించి ఎల నీరు సిద్ధంచేసింది "అమ్మగోరు కులాసాగా వున్నారా బాబూ! కళ్ళల్లో మెదిలి నట్టుండారు ఓసారి పిల్చుక రాగూడదూ" అంటూ పరామర్శించింది

పుల్లమ్మ మాటలు పట్నం మామయ్య చెవిదాకా ప్రాకినట్టే లేవు ఆయన పరధ్యానంగా వున్నారు ఆయన కళ్ళు దేనికొరకో గాలిస్తున్నాయి

పరేంగిత్తాన్ని పసిగట్ట లేనిదేమీ కాదు పుల్లమ్మ "చిట్టిబాబు కోసమేనా బాబూ! ఉన్నాడు ఇక్కడెక్కడో వున్నాడు. మీ రొచ్చారుగదా! ఒళ్ల మాలినంత సిగ్గూ బిడియమూ వాడికి!"

అంతలో పెరట్లోంచీ రాజమ్మ కంఠం వినిపించింది

"నీళ్ళు కాగాయే అమ్మా! అన్న గారు స్నానం చేస్తారేమో అడుగు"

"మిగిలిన పిల్లలేం చేస్తున్నారు ?" పెదవి కదిపాడు పట్నం మామయ్య

పుల్లమ్మ జవాబు చెప్పింది "పెద్ద పిల్లకాయ లిద్దరూ వాళ్ళ నాన్నతోనే వెళ్ళి మేస్త్రీపని నేర్చుకుంటున్నారు మూడోవాణ్ణి మేనమామ పెంచుకుంటు న్నాడు. పోగా యిద్దరాడబిడ్డలు, చిట్టి బాబు, చంటిబిడ్డ యింటి దగ్గరే వున్నారు"

పట్నం మామయ్య చొక్కాతీసి చీలకు తగిలించి స్నానం చేయడం కోసం పెరట్లోకి వెళ్ళాడు

ఆ పాటికి వీధి గుమ్మం దగ్గర పిల్లల హడావిడి ప్రారంభమైంది

పుల్లమ్మ కుర్రవాళ్ళపైన విరుచుక పడింది "అప్పుడే మీ రామందాడి ఆరంభమైందిట్రా కుర్రకుంకల్లా! మామయ్య యిప్పుడే వచ్చారు. స్నానం, భోజనం అయ్యాక కాసేపు కునుకు దీసిని తర్వాతగానీ బయటికి రారు వెళ్ళండి వెళ్ళండి"

నిజమే మరి! వందమైళ్ళ దూరం బస్సులో రావడమైంది గదా! పాపం, పట్నం మామయ్య బాగా అలసిపోయి వుంటాడు కాసేపు ఆయన్ను హాయిగా విశ్రాంతి తీసుకోనివ్వడమే మంచిది — అనుకున్నట్టుగా పిల్ల లందరూ దూరంగా మారేడు తోపు లోకి వెళ్ళిపోయారు

పట్నం మామయ్య స్నానం చేశాడు భోజనమూ ముగించాడు. పడుకుని ఓ కునుకు దీశాడు ఆయన నిద్ర లేవడమూ, 'పట్నం బాబుగా రొచ్చారటగా' అంటూ రామజోగిగారు లోపలికి రావడమూ ఒక్కసారే జరి గాయి

"రండి రండీ మేష్టరుగారూ! ఈ దఫా మీకు పది పలాల నస్యం డబ్బి తీసుకొచ్చాను "



మరచిపోతారా బాబూ! ఎముక లేని చేయా మరేమన్నానా! ఆశించిన వాళ్ళ అదృష్టం బాగుండాలేగానీ మీ కెంతయినా యివ్వాలనే వుంటుంది

చిటికతో చిటికెడు నస్యాన్ని నాసికలోకి దట్టించారు రామజోగిగారు

ఏమిటోలెండి జగన్నాధంగారూ! అంగ వంగ కళింగ అంటూ యాభై అరు దేశాలుండేవట మా వూరుంది

చూచారూ, యిది యాభై యేటో దేశం. మిగిలిన ప్రపంచం ఏమై పోతోందో మాకు తెలియదు. మీ రొస్తే ఆ పాపం పుణ్యం కాస్తా చెవిలో వేసుకో వచ్చునని ఆశ. చెప్పండి బాబూ! జనాలేమంటున్నారు? దొరతనం ఏం చేస్తోంది? పత్రికల వాళ్ళు ఏం రాస్తున్నారు?"

ఏదో ఉబుసు పోకకలా అడగడమే గానీ ప్రపంచంయొక్క భవిష్యత్తు పట్ల రామజోగిగారికున్న శ్రద్ధ గూడా అంతంత మాత్రమే! తన పలు కూటము, తన పొడుం డబ్బీ పదిలంగా వుంటే మిగిలిన లోకంతో అక్కర లేదాయనకు! జగన్నాధంగారి ప్రసంగం యింకా తొలి మజిలీకి చేరు కోక మునుపే ఆయన సెలవు తీసుకో డానికి ఉద్యుక్తు డయ్యాడు.

"మళ్ళీ సాయంకాలం కలుసు కుంటానండీ జగన్నాధంగారూ! మీరొచ్చారు కనుక ఈ పూట బడి కెలాగూ సెలవే! నాకూ పాపన్నపేట దాకా వెళ్ళి రావలసిన పనుంది...."

రామజోగిగారు వెళ్ళిపోయాక జగన్నాధంగారు చొక్కా వేసుకుని వూరిబయటకు బయల్దేరారు. అప్పటికే మారేడు తోపులో శివాలయం ఎదుట పిల్లల హంగామా తారస్థాయిలో వుంది. ఊరి పొలిమేరల్లో జగన్నాధం గారు కనిపించగానే ఒక్క పరుగుతో ఎదురుగావచ్చి పిల్లలందరూ ఆయన్ను చుట్టు ముట్టేశారు

—"నా కోకలం తెచ్చి పెడతా నన్నావుగా మామయ్యా!"

—"తేరగా వస్తుందట్రా కలం? కథలపోటీలో గెలిస్తేనే కలం! అంతేనా మామయ్యా?"

—"మరైతే ఆటల్లో సందా లుండవా మామయ్యా! పరుగు పందెంలో నైతే మనమే ఫస్టు...

అందరినీ సర్ది వరుసగా కూర్చో బెట్టారు జగన్నాధం గారు.

"అబ్బాయిలూ! అమ్మాయిలూ! శ్రద్ధగా వినాలిమీరు! అల్లరి చేయ కుండా ఎవరికొచ్చిన విద్యను వాళ్ళు చూపెట్టాలి. వాళ్ళ వాళ్ళ తాహత్తు ననుసరించి అందరికీ బహుమానా లుంటాయి. మొదట ఆడపిల్లలు పాటలు పాడాలి. ఏదీ అమ్మాయ్! నువ్వు పాడు చూద్దాం."

జగన్నాధంగారు ఎన్నిక చేసిన ఎర్రటి పెదవుల బుద్ధమూర్తి అమ్మా యికి ఆరేళ్ళుంటాయేమో! లేచి నిల్చుని, కళ్ళు మూసుకుని ముకుళిత హస్తురాలై ఆ అమ్మాయి మొద లెట్టింది—

"చేత వెన్నముద్ద,
చెంగల్వ పూదండ
బంగారు మొలత్రాడు,
పట్టుదట్టి........"

బాగుంది బాగుంది అంటూ చేతులు తట్టి జగన్నాధంగారు బిడ్డను ఒడిలోకి తీసుకున్నారు.

"బాగా చెప్పావమ్మాయ్! నీ పేరేమిటి?'

ఆ చిన్నపిల్ల సిగ్గుతో మల్లె మొగ్గలా ముడుచుకపోయి పరికిణిలో ముఖం దాచుకుంది

పద్యం చెప్పడానికి. లేనిసిగ్గు, పేరు చెప్పడాని కొచ్చిందన్నమాట! పోనీలే, అసలు పేరు చెప్పకపోతే నిన్ను జ్ఞప్తిలో వుంచుకోడంకోసం నేనే ఓ పేరు పెట్టుకుంటాను. బొద్దుగా ముద్దుగా వున్నావు గనుక గోదాదేవి అని పిలవనా అమ్మాయ్!"

"గోదాదేవి! గోదాదేవి!" పిల్లలు గొంతు కలిపి హర్షధ్వానాలు చేశారు.

"ఊరుకోండర్రా వూరుకోండి. గోదాదేవి పద్యం చక్కగా చెప్పింది గనుక ఆమెకో చిన్న పౌడరు డబ్బీ యిద్దామనుకుంటున్నాను .."

"ఏదీ, ఎక్కడుంది మామయ్యా! చూపించవూ"

"బహుమతు లెక్కడెందు కుంటాయి? ఇక్కడ పోటీలు, బహుమతుల నిర్ణయాలు మాత్రమే! సాయంకాలం యింటి దగ్గర ఎవరి బహుమతులు వాళ్లు తీసుకోవచ్చు..."

"అలాగలాగే! మరిప్పుడు నేను పాడనా మామయ్యా!"

"ఉండుండు. పేర్లు వ్రాసుకోక పోతే నేను మరచిపోయినా మరచి పోగలను. మొట్టమొదట గోదాదేవి_ చేత వెన్నముద్ద చెప్పినందుకు __ ఒక చిన్న పౌడరు డబ్బీ. తరువాత నీ పేరేమిటమ్మాయ్, వద్దొద్దు_అసలు పేరెందుకు, నేనే నామకరణం చేసు కుంటాను పాడు...."

'సముద్ర తీరము పోతిమి
చాలాసేపు వుంటిమి
సోముడెంతో సుంద్రముగా
సొగసు వెన్నెల కాయగా...."

విహారానికి సముద్రతీరాన్ని వల చిన ఆ అమ్మాయికి సాగరకన్య అని పేరు పెట్టారు జగన్నాధంగారు. ఓ బొమ్మల పుస్తకం బహుమతిగా ప్రకటించారు.

పాటలు పాడటం ముగిసిన తర్వాత ఓ కుర్రవాడు హరిదాసులా అభిన యిస్తూ కుచేలోపాఖ్యానం చెప్పాడు. వాడిపేరు నారాయణ అని జగన్నాధం గారు మునుపే ఎరుగుదురు. అన్వర్థ నామధేయంగా వుంది పోనిమ్మని వాడిని ఆదిభట్ల నారాయణ దాసంటూ వీపు చరిచి 'యిలాగే సాధన చేస్తుం డరా అబ్బీ! నీకో మంచి తంబూరా తెచ్చి పెడతాను" అన్నారు.

పాటలు, కథలు ముగిసిన తర్వాత ఆటల్లో పందాలు జరిగాయి. నడిమింటి భీమన్న అనే కుర్రవాడు చాంపియన్‌గా ఎన్నికయ్యాడు. మల్ల యుద్ధ వీరులు ధరించే మాదిరిగా ఓ చేతుల్లేని బనీను వాడికి బహుమతిగా ప్రకటింప బడింది.

ప్రొద్దుపోయి చీకటి పడుతుండగా పుల్లమ్మ పూరింటి ఎదుట పాఠశాల వార్షికోత్సవం లాంటి తతంగం జరి గింది. సూట్‌కేసు నిండుగా తీసు కొచ్చిన వస్తువు లన్నింటినీ జగన్నా ధం గారు పిల్లలకు పంచి పెట్టేశారు.

తానైతే పెట్టెలో అట్టడుగున దట్టమైన ప్యాకింగులో ఆయన పదిలంగా తీసు కొచ్చిన క్రొత్త బట్టలు కొన్ని, వాటికి తోడుగా ఓ పుస్తకాల సంచీ, బుల్లి పేనాఒకటి, ఒక చిన్న టార్చి లైటు యివి మాత్రం అలాగే మిగిలి వుండి పోయాయి.

అవన్నీ చిట్టి బాబుకు !

ఏడీ, ఎక్కడున్నాడు చిట్టి బాబు ?

వాడు ఆటల్లో లేడు. పాటల్లోలేడు. ఆనంద లోకాలకు ప్రతినిధుల్లాగా వీధుల్లో గంతులువేస్తూ, కేరింతలు కొడుతున్న బాల బాలికల్లో వాడులేడు.

ఏమయ్యాడు చిట్టిబాబు ?

అది జగన్నాధం గారి కొక్కరికి మాత్రమే ఎదురైన ప్రశ్నగాదు. తల్లి రాజమ్మను, అమ్మమ్మ పుల్లమ్మను సూటిగానే కాదు. శూలపు పోటులాగా ఎదుర్కొంటున్న ప్రశ్నగూడా అదే !

పుల్లమ్మ ముఖాన నెత్తురుచుక్క లేదు. వెదక వలసిన చోట్లన్నీ వెదకి రాజమ్మ ఉసూరుమని నిట్టూర్చు కుంటూ వచ్చి పెరట్లో కూర్చుంది, ఎంతగా వాళ్ళు దాచి పెట్టుకోవాలన్నా. అసలు విషయం జగన్నాధంగారు వూహించలేని దేమీగాదు.

"చిట్టిబాబు కనిపించడం లేదా ఏమిటి?" ఆయన వీలైనంత నిర్వి కారంగానే ప్రశ్నించారు.

"ఆ. ఎక్కడికి వెళ్ళాడు? దొంగ వెధవ, ఏ తడిక చాటునో నక్కి కూచుని వుంటాడు. ఇక్కడ వీడి నాన్న వీడికోసం రొక్కం రోజనాలు రాసి పోసి వుంచినట్టు, అందుకని మన సొప్పక మరెవరో వీణ్ణి దేశాంత్రం పంపించేస్తున్నట్టు! అదృష్టం భూము లేలమంటే బుద్ధి గాడిదల్ని కాయ మనడం—యిదేనేమో మరి!"

వేడిగా నిట్టూర్చారు జగన్నాధం గారు. ప్రొద్దుపోయి బాగా చీకటి పడి పోతున్నసమయం. పూరి కొంపల్లోంని గుడ్డి దీపాలకాంతి వీధి గుమ్మాల వరకైనా ప్రసరిస్తున్నట్టులేదు. మానవ జీవితంలో ఆశాలేశాలకు మల్లే గగ నంలో మినుకు మినుకుమంటున్న చుక్కలకేసి చూస్తూ జగన్నాధంగారు అరుగుపైన కూర్చున్నారు.

అడవిలో ఓ పల్లెటూరు. ఆ పల్లెలో ఒక పూరింటి అరుగుపైన దిగులుతో కృంగిపోయి కూర్చున్న ఓ నడి వయస్సు మనిషి! ఆయనే జగన్నాధం గారంటే జగన్నాధంగారిని గురించి తెలిసిన వాళ్ళెవరూ నమ్మరు.


నగరంలో జగన్నాధం గారికి రెండంతస్తుల మేడలు నాలుగున్నాయి. ఒకటి రెండు భారీ వ్యాపారాల్లో వాటా లున్నాయి. పిలిస్తే పలికే దాసదాసీ జనమున్నారు. సహ ధర్మిణి పార్వ తమ్మ నిలుపులో నిదానంలో నిండు కుండ, ప్రశాంత మహా సాగరంలా నిండుగా, నిరుపమానంగా కనిపించే జీవితమే ఆయనది. కానీ నిలకడగా కనిపించేకడలి లోతుల్లో బడబానలంలా పరీక్షించి చూసినవారికి జగన్నాధం

గార్కి జీవితంలో తీరని కొరత ఒకటి కనిపించనే కనిపిస్తుంది.

ఆ కొరత _ అందు మూలంగా ఏర్పడిన ఓ ప్రయాణం, ఆ ప్రయాణంలో ఎదురైన ఓ సంఘటన యివి మూడు మూడు కారణాలై జగన్నాధం గారికీ మారేడు పల్లికి ఓ తీరని అనుబంధాన్ని కల్పించాయి.

ఆ వున్న కొరత జగన్నాధం గారి నొక్కరిని మాత్రమే గాదు. చరిత్రలో దశరధుడు, మృకండుడు, శుద్ధోదనుడు మొదలైన సుప్రసిద్ధుల్ని గూడా ఎదుర్కొన్నదే! అనపత్యత. పుత్రులు లేని వారికి గతులులేవు! పరంలో నైతే పున్నామ నరకం. ఇహంలో ఉక్కు ముక్కు కాకుల్లా ఈనడించి పారవేసే లోకులు.

ఏడేళ్ళకు మునుపటి సంగతి: మ్రొక్కిన వరమీని చిల్లర వేల్పుల్ని రోసి, న్యాయంకోసం సుప్రీం కోర్టుకు వెళ్ళినట్టుగా వరంకోసం వడ్డికాసుల వాడి సన్నిధానానికివెళ్ళి సతీ సమేతంగా తిరిగొస్తున్నారు జగన్నాధం గారు. ఎవరి మొక్కుబడిని వాళ్ళు రహస్యంగా వుంచుకో దలచుకున్న మాట నిజమే! కానీ పార్వతమ్మే మొదట బయట బడింది. "ఏమండీ! సంతానం కలిగితే బంగారంతో బిడ్డలాగా బొమ్మచేయించి హుండీలో వేసే



టట్టు మ్రొక్కుకున్నాను. ఏమంటారు? సరేనా...." అంటూ ఆమె భర్త అంగీకారంకోసం అర్థించింది.

జగన్నాధంగారు మాత్రం మౌనం గానే కూచున్నారు. తమ మ్రొక్కుబడి భగవంతుడి మన్ననకు పాత్రం కావా లంతేగానీ, ఆయనకు తాము మ్రొక్కుబడి చెల్లించడ మేమంత విశేషంగాదు. ఐనా సంపద మాత్రం ఎవరిది? అదీ భగవత్ప్రసాదితమే, ఆయన సొమ్మును ఆయన కివ్వడంలో తనకే మభ్యంతర ముంటుంది?

ఎటొచ్చీ అర్థాంగి కోరిక నెర వేరితే తన కంతే చాలు—

ఆలోచనలో ,అన్య మనస్కులై కూర్చున్నారు జగన్నాధంగారు. బస్సు పరుగెడుతోంది. కనుచూపు మేరకు పచ్చగా కనిపిస్తున్న చిట్టడివి. చల్లగా గాలి. అంతకన్నా చల్లగా తారురోడ్డు పైన జారిపోతున్న బస్సులో జగన్నాధంగారికి చిన్నగా ఓ కునుకు పట్టింది.

"లేవండి, లేవండీ" అన్న కేకలతో వులికిపడి కళ్లు తెరిచారు జగన్నాధంగారు. ఆ పాటికే బస్సు యించుమించు నిర్జనంగా వుంది. పల్లెగానీ పేటగానీ కనిపించని అరణ్య ప్రాంతంలో బస్సాగిపోవడానికి కారణ మేమిటో స్ఫురించక అటూ యిటూ పరకాయించి చూస్తున్న జగన్నాధం గారిని కండక్టరు బలవంతాన క్రిందికి దింపించాడు. ఏమిటీ ఏమైందంటూ కంగారుగా పార్వతమ్మ కోసం వెదుక్కుంటున్నారు జగన్నాధం గారు. వాకబు చేయగా విషయం తెలిసింది. అదే బస్సులో ప్రయాణం చేస్తున్న ఓ నవమాసాల గర్భిణికి బస్సులోనే కడుపు నొప్పులు ప్రారంభ మయ్యాయి.

పరుగెడుతున్న బస్సు అనుకోని అవాంతరంవల్ల మార్గమధ్యంలో ఆగిపోతే ప్రయాణీకుల పాలిటికి కాలచక్రమే కాసేపు ఆగిపోయినట్టని పిస్తుంది. అలా అనిపించడ మెందుకని వితర్కించుకుంటున్నారు జగన్నాధంగారు — కదలిక ప్రాణికి పుట్టుకతో వచ్చిన గుణం. శారీరకంగానూ, మానసికంగానూ స్తబ్ధత ఎప్పుడైతే ఏర్పడుతుందో అదే జీవికి తుది క్షణం. ఆ రెంటికీ మధ్యనున్నదే జీవితం. జీవితం స్రవంతిలా కదలిపోతుంటేనే జీవికి ఆనందం. అందుకు విరుద్ధంగా నిల్వనీటిలా స్తంభించిపోతే, యిదిగో యిలాగే విషాదం!

ప్రేక్షకు లెంతోసేపు వేచి కూర్చున్న తర్వాత తెర పైకి లేచినట్టుగా, చుట్టూరా నెలకొన్న స్తబ్ధత ఒకక్షణంలో పటాపంచలైంది. క్రొత్త నాటకానికి ఉపక్రమణిక లాగా పసికందు కెవ్వు కెవ్వున ఏడవడం వినిపించింది.

"ఏమండోయ్! ఎవరైనా ఓ చాకిలా పడేస్తారూ! ఎవరి దగ్గరుంది? బొడ్డు కోయడానికి చాకు కావాలి ...." అత్యవసర పరిస్థితుల్లో మంత్రసాని పాత్రకు తోడ్పడుతున్నాడు కండక్టరు.

జగన్నాధంగారి పెదవులపైన

ఎందుకో అప్రయత్నంగా ఓ చిరునవ్వు విరిసింది.

"మీలో మీరే నవ్వుకుంటున్నారేమండి ! దేన్నిచూచి ?" సమీపిస్తూ అడిగింది పార్వతమ్మ.

"జగన్నాటకాన్ని చూచి !"

కానీ లోక వృత్తంలో నాటకీయతను గమనించేపాటి ఓపిక పార్వతమ్మకులేదు. ఆమె తనధోరణిలో తాను చెప్పుక పోతోంది— "ఎంత బాగున్నాడండీ ! మగబిడ్డ. పనసపండులాగున్నాడు. ఇది నాలుగో కాన్పట. మూడో కాన్పు తల్లి ప్రాణంమీదికొచ్చిందట ! ఇప్పుడే మానుతుందోనని యిలా ఆసుపత్రికి బయల్దేరారు. ఏమంత కలిగిన వాళ్ళులా కనిపించరు. అడిగితే బిడ్డను పెంపకానికి యిచ్చేటట్టే వున్నారు. అడగరాదుటండీ ?"

జగన్నాధం గారు నివ్వెరపడిపోయారు. పదిహేనేళ్ళ సాంసారిక జీవితంలో పార్వతమ్మ నాలుగు వాక్యాలు యిలా ఏకబిగిన మాట్లాడడం ఆయనకు క్రొత్త. ఆయనకో సందేహం గూడా కలిగింది. ఇది అర్ధాంగి కోరిక మాత్రమేనా ! భగవన్నిర్ణయం ఆమె నోటంట యిలా పలికించడం లేదుగదా !

ఎలాగైతేనేమి, జగన్నాధం గారు భార్య మాటనుకొట్టి పారవేయలేక పోయారు. అందుకు తగ్గట్టుగా ఆశించినంతకంటే అక్రమంగా కార్యం సానుకూలమయ్యే సూచనలు కనిపించాయి. పసివాడి తండ్రి పట్టింపులులేని మనిషి. పుట్టించినవాడు పూరిమేపడన్న విశ్వాసమొకటే అతడు తన సంతానానికి గడించి పెడుతున్న ఆస్తి. అతడు కిమ్మనకుండా జగన్నాధంగారి అభ్యర్ధనపైన తన ఆమోద ముద్రను వేసేశాడు. తన మనుమళ్ళలో ఒకడికి పుట్టగానే సిరి పట్టుకున్నందుకు పుల్లమ్మకు పరమానందమే కలిగింది. ఇక తల్లి గంగలో దూకమన్నా తన మేలుకే నసుకునే రాజమ్మ తన బిడ్డను విడనాడుకోవడానికి సమ్మతించడంలో ఆశ్చర్యమేముంది ?

కానీ పాలుత్రాగుతున్న బిడ్డను తల్లినుంచీ వేరు చేయడం న్యాయం కాదనిపించింది జగన్నాధంగారికి ! బిడ్డ తమవాడే ననుకున్న తర్వాత అందాకా ఓపికపట్టడానికి పార్వతమ్మకైనా అభ్యంతరం లేకపోయింది.

రెండు మూడు నెలల కొకసారి జగన్నాధంగారు మారేడుపల్లికి వచ్చి

★ తండ్రి : అతనికేం మూడు డిగ్రీలున్నవి — అతన్ని చేసుకుంటే సుఖపడతావు.

కూతురు : డిగ్రీలే ప్రధానమైతే, మనింట్లో ఉన్న దర్మామీటర్‌కు పదహారు డిగ్రీలున్నాయ్ !

బిడ్డను చూచుకుని వెళ్ళేవారు. వచ్చినప్పుడల్లా ఓపికనన్ని తినుబండారాలు, ఆట వస్తువులు పట్టుకొచ్చేవారు. లౌకిక వ్యాసంగాల నన్నింటినీ మరచి కాసేపు పిల్లలతో ఆడుకునేవారు. క్రిస్మస్ పండుగకు కానుకలు తీసుకొచ్చే గడ్డం తాతయ్యను గురించి మారేడుపల్లి పిల్లలకు తెలియదు. ఆయనకు బదులుగా వాళ్ళు జగన్నాథంగారిని ఎరుగుదురు. అదైనా జగన్నాథంగారని కాదు. పట్నం మామయ్యగా ఎరుగుదురు.

ఏడాది గడిచేసరికి చిట్టిబాబు పాలు మరచిపోయాడుగానీ తల్లి ఒడిని మాత్రం వదిలిపెట్టలేక పోయాడు. జగన్నాథంగారు చేతుల్లోకి తీసుకుంటే వాడు గిలగిలలాడి పోయేవాడు. ఏదో ఒక విపరీతశక్తి జగన్నాథంగారి రూపంలో వచ్చి తన నొక బంధిఖానాలోకి తసుకెళ్ళి పోనున్నదన్న ఊహ, కాకపోతే భ్రమ, వాడి లేతబుర్రలో చోటుచేసుకుంది. జగన్నాథంగారి గొంతు వినిపిస్తేచాలు, వాడు జడుసుకునేవాడు. వాడిలో ప్రాతికూల్యం పెరిగినకొద్దీ తమపంతాన్ని తాము నెగ్గించుకోవాలన్నపట్టుదల జగన్నాథంగారిలో చెలరేగకపోలేదు. కానీ అందువల్లాపరిస్థితి మరింతగా విషమించవచ్చునని మాత్రమే అనిపించింది. చిట్టిబాబుకు నాలుగోయేడు జరుగుతుండగా జగన్నాథంగారొక సారివాడిని బలవంతంగా నైనాసరే, తమతో తీసుకెళ్ళి పోదలచుకున్నారు. పల్లెనుంచీ మూడు ఫర్లాంగుల దూరం వెళ్ళేసరికి చిట్టిబాబు జగన్నాథంగారిని మూడు చెరువుల నీళ్ళు త్రాగించాడు. గోళ్ళతో గోకి, రక్కి చివరకి ముంజేతి పైన నెత్తురు కాట్లువేసి వాడు యింటికి పారిపోయి వచ్చేశాడు. ఆ రోజు రాత్రి వాడికి జ్వరం వచ్చింది. వచ్చిన జ్వరం నాలుగు రోజులవరకూ మన్నూమిన్నూ తెలియకుండా కాసింది. బిడ్డ తమకిక దక్కడనే అనుకున్నారు. లోకంలో నూకలింకా బాకీ వుండబట్టి చిట్టిబాబు మళ్ళీ బ్రతికి బట్టగట్టాడు.

మరికొంత కాలం ఓపిక పట్టడమొకటే జగన్నాథం గారికి గత్యంతరమైంది.

చూస్తుండగానే చిట్టిబాబుకు ఎనిమిదేళ్ళొచ్చేశాయి ...

గడచిన గాథలోనుంచీ జగన్నాథంగారు ప్రస్తుత ప్రపంచంలోకి వచ్చి పడేసరికి గంట తొమ్మిది గావచ్చింది. పెద్ద మనుషులు కొందరు లాంతరులు చేత బట్టుకుని చిట్టిబాబుకోసం వెదకుతున్న దృశ్యాన్ని ఆయన గమనించక పోలేదు. వాళ్ళ అన్వేషణకు ఫలితంగా రాత్రి పదిగంటల ప్రాంతంలో చిట్టిబాబు దొరకనే దొరికాడు.

ఊరి ముందర బావి దగ్గర పున్నపుగూడు చాటున నక్కి కూర్చున్న చిట్టిబాబుకు అక్కడికక్కడ వేడివేడిగా నాలుగు చురకలు లభించాయి. ఇంటికి తెచ్చి పడేశాక పులమ్మ దగ్గరనుంచీ పుష్కలంగా తిట్లు గూడా లభించాయి.

2

షష్టిపూర్తి వేరు. ఇష్ట పరిపూర్తి వేరు. మొదటిది చాలామంది విషయంలో సంభవమే గావచ్చు. రెండోది మాత్రం గగన కుసుమమే! ఇందుకు జగన్నాధంగారి కథ నికరమైన నిదర్శనం.

షష్టిపూర్తి జగన్నాధంగారు తమంతట తామే మనసుపడి తీర్చుకున్న ముచ్చటగాదు. అందుకు కారకులైన వారిద్దరు. ఒకడేమో యింజనీరు మాధవరావు. రెండో వ్యక్తి డాక్టరు నారాయణ. కృతజ్ఞతాభారం ఒక మోయరాని ముల్లె. ఆ ముల్లెలో కొంతకు కొంతైనా తగ్గించుకోవాలన్న కోరిక మానవుణ్ణి ఒక పట్టాన వదిలిపెట్టదు. రామజోగిగారి నాటు పలుకూటంలో అయిదో తరగతి వరకు చదువుకుని పొలాలవెంట తిరుగుతున్న ఈ కుర్రవాళ్ళిద్దరూ ఉన్నత విద్యాభ్యాసంపల్లా. రాణించ గలరని పసిగట్టినవారు జగన్నాధంగారే! ఈ సదుద్దేశం సుక్షేత్రంలో అదనుకు పడిన వానలా ఆ కుర్రవాళ్ళ భవిష్యత్తుకు ఘంటాపథాలు వేసింది. వాళ్ళ ఉన్నత విద్యాభ్యాసంపట్ల తల్లిదండ్రులు చూపిన శ్రద్ధ చాలా తక్కువ. జగన్నాధంగారి పూనికవల్లా వాళ్లు హైస్కూల్లో చేరారు. హాస్టల్లో వుండి చదువుకున్నారు. తమకే అవసరం వచ్చినా వాళ్ళు జగన్నాధంగారితో చెప్పుకునేవారు. ఆ అవసరం నిమిషాల్లో పరిష్కరింపబడేది.

పుట్టిన నేల, పారగడుతున్న నీరు, చుట్టూరా వేసిన కంచె ఒక్కటే అయినా తోటలో ఒక్కొక్క చెట్టు ఒక్కొక్క రకంగా పెరగడం అనుభవానికి అందుబాటులో వున్న విషయమే! జగన్నాధం గారొక తోటను పెట్టారు. కొన్ని మొక్కల్ని తామే తీసుకరాగా, మరికొన్ని మొక్కలు తామే ఆయన్ను వెదుక్కుంటూ వచ్చాయి. శక్తివంచన లేకుండా ఆయన అన్నింటికీ దోహదక్రియలు చేశారు. తాపీ చదువులోనైనా బడిలో చేరిన వాళ్ళందరూ నెగ్గుకొస్తారన్న నమ్మక మేముంది? అలాంటి వాళ్ళకాయన ఏవో వృత్తి విద్యలు చూపెట్టారు. ఒకడు మోటార్ల కంపెనీలో రిపేరీలు నేర్చుకున్నాడు. మరొకడు సంగీత సాధనచేసి గాయ

★ భర్త: (థర్మామీటర్ నోట్లో పెట్టుకున్న భార్యను చూసి డాక్టరుతో) డాక్టర్‌గారూ! మీరు ఆమె నోట్లో పెట్టిన ఆ గాజు గొట్టం ఎంత? ఈ రెండు నిమిషాలే మా ఆవిడ నోరు విప్పకుండా ఉండేట్లు చేయగలిగిన ఆ పనిముట్టు ఒకటి ఇంట్లో ఉంటే తప్ప బతకలేననిపిస్తోంది!

కుడుగా పేరు తెచ్చుకున్నాడు. ఇద్దరు సైన్యంలో చేరారు. ఉపాధ్యాయ వృత్తి మరికొందరికి ఆశ్రయమిచ్చింది. జగన్నాధంగారి షష్టిపూర్తికి పేరుపేరునా అందరికీ ఆహ్వానాలు వెళ్ళాయి.

ఆ విధంగా ఆహ్వానం అందుకున్న వాళ్ళల్లోజగన్నాధంగారు గూడా ఒకరు!

పసుపు కుంకుమల చిలకరింపుతో ఓ కవరు కనిపించగానే జగన్నాధం గారు ఎవరికో పెళ్ళి కాబోలు అనుకున్నారు. "ఇదిగో, పార్వతీ! ఎవరిదో పెళ్ళి పత్రిక వచ్చింది" అంటూ ఆయన హాల్లోకి వెళ్ళారు.

వంటింట్లోనుంచీ పార్వతమ్మ గూడా ఎదురుగా వచ్చేసింది— "పెళ్ళా! ఎవరికి చెప్మా! ఒకవేళ మన రఘుపతికేమోనండీ! ఆ ఛీ, అయివుండదు. వాడింకా రెండేళ్ళు పెళ్ళి చేసుకోనన్నాడుగా! అయితే సుధాకరుడికేమో! అవునవును. వాడికే అయివుండాలి "

"తీరా కవరులోనుంచీ కార్డుపైకి తీసిన తర్వాత అసలు విషయం తేట తెల్లమైంది. జగన్నాధంగారు ఒక నిమిషంపాటు నోటమాటరాక నిర్ఘాంతపడి వుండిపోయారు.

"ఏమిటండీ అలా అయిపోయారు, ఎవరికి పెళ్ళి ?" అంటూ దగ్గరికి వచ్చి పార్వతమ్మ పత్రికను తానే చదువుకుంది.

"మనతో ఒకమాటైనా చెప్పకుండా ఎంతపని చేశారో చూశావా పార్వతీ!"

ఆ ఒక్కమాట మాత్రం అన్నారు జగన్నాధంగారు. అందిన శుభవార్త పైన వ్యాఖ్యానించడానికి పార్వతమ్మ కామాత్రం మాటలైనా స్ఫురించాయి గావు

ఆ భార్యాభర్తల మధ్య అరగంటసేపటివరకు మౌనమే తాండవించింది.

"ఐతే ఎక్కడ జరుపుతారటండీ?" వంటింట్లోనుంచీ ప్రశ్నించింది పార్వతమ్మ

ఈ క్రొత్త వివరంకోసం మళ్ళీ ఒకసారి పత్రికను పరామర్శించారు జగన్నాధంగారు. "అందులోను ప్రత్యేకత లేకపోలేదు పార్వతీ! ఏడుకొండలవాడి సన్నిధానంలోనట. వైశాఖ శుద్ధ ద్వాదశినాటికి అందరూ కొండపైకి చేరుకోవాలట!"

ఏబదేళ్ళ పార్వతమ్మ ఉక్రోషంతో అయిదేళ్ళ పసిపాపే అయిపోయింది! "అలాగైతే అంతా వాళ్ళ యిష్టమేనటండీ! మెప్పుకైనా మనతో ఒక మాట చెప్పనక్కర్లేదా! అలాగైతే మనం వెళ్ళనే వెళ్ళొద్దు ఏం చేస్తారో చూద్దాం "

జగన్నాధంగారు ఒక్క పెట్టున నవ్వేశారు, "నీ బింకం సంగతి నాకు తెలియదా పార్వతీ! తీరా వెంటబెట్టుకుని వెళ్ళడానికి ఎవరైనా వస్తే, తొందరగా పెట్టే బేడా సర్దుకునే దానివి గూడా నువ్వే!"

మీ మాటలతో నా కేమి లెద్దురూ— అన్నట్టు పార్వతమ్మ మారు మాటాడ

కుండా లోపలికి వెళ్ళిపోయింది. ఈసారి మధ్యాహ్న భోజనాల వరకూ భార్యాభర్తలమధ్య మౌనమే నెల కొన్నది. భోజనం వడ్డిస్తూ ఉపక్ర మించింది పార్వతమ్మ

"ఏమండీ! మంచిదో చెడ్డదో సంబరమంటూ ఒకటి జరుపుతున్నారు గదా! దీనికైనా చిట్టిబాబు లేకపోతే ఎలాగండీ!"

"చిట్టిబాబు తప్పకుండా వుండవల సిందే! కానీ చిట్టిబాబనేవాడేమైనా ఒక వస్తువా పార్వతీ! వస్తువైతే అర్లు నూర్లయినా వెచ్చించి తెచ్చుకోవచ్చు. వాడెక్కడున్నాడో, ఏంచేస్తున్నాడో మనకేం తెలుసు! లేదంటే "తిరిగి రావాలి!" అంటూ పత్రికల్లో ఓ ప్రక టన వేయించమంటే అందుకు నేను సిద్ధం."

భోజనానికి కూర్చునేటప్పటికి జగన్నాధం గారికి ఆకలిగా వున్నమాట నిజమే! కానీ చిట్టిబాబు ప్రస్తావన వచ్చేసరికి అన్నం తినబుద్ధి పుట్టింది గాదు. చిట్టిబాబు వ్యవహారం ఆ భార్యా భర్తల పాలిటికి ఎదలో ముల్లులాగా



పరిణమించడం ఈనాటి మాట గాదు. చిట్టిబాబనే మూడి పదార్థంనుంచీ ఓ అద్భుతవ్యక్తిని తయారు చేయాలనుకున్నారు జగన్నాధంగారు. వాడి మూలంగా సంతానం లేని వెలితి తీరుతుందనుకుంది పార్వతమ్మ. ఆ ఆశలు అడియాసలే అయ్యాయి. మూడు రోజుల కొకసారి స్నానం, ముతక బియ్యపు అన్నం, చెప్పినపని సరిగా చేయకపోతే పులమ్మ చేతులో పిడి గుద్దులు, రారమ్మని వాళ్లు, పోపొమ్మని వీళ్ళు ప్రాధేయపడినా పీడలాగా పట్టుకుని వదలనందుకు పదిమందిలో ఛీత్కారాలు — యింతకుమించి పల్లెలో చిట్టిబాబుకు లభ్యమయ్యే సన్మానాలు లేవు. చతుర్విధోపాయాలు అవలంబించి పన్నెండేళ్ళ ప్రాయంలో చిట్టిబాబును మొదటిసారిగా పట్టణానికి తీసుకెళ్ళారు జగన్నాధంగారు. నిద్ర లేవగానే స్నానం, వెనువెంటనే ఉపాహారం, మడత చెరుగని చలువ బట్టలు, మధ్యాహ్నం బడికే భోజనం, సాయంకాలమైతే యింటి వెనుక తోటలోనే ఆటలాడుకునే సదుపాయం. పడుకోడానికి మెత్తటి పరుపు పైన గిర్రున తిరిగే ఫ్యాను. కలలోనైనా వూహించి ఎరుగని ఈ సౌఖ్యాలను ఒకసారి చవిచూస్తే నగరవాసంపట్ల చిట్టిబాబుకు ప్రలోభం కలగవచ్చుననే అందరూ ఆశించారు. కానీ వచ్చిన సిరికి మోకాలడ్డం పెట్టేశాడు చిట్టిబాబు. ముళ్ళమీద కూర్చున్న వాడిలా మూడు మాసాల కాలం అతడెలాగో వేగించాడు. ఓ రోజు తెలవారేసరికి వాడింట్లో లేడు. పట్టణమంతా గాలించినా కనిపించలేదు. నాలుగు రోజుల తర్వాత వాడు పట్టణంలో మునిగి పల్లెలో తేలాడన్న వర్తమానం తెలిసింది. జగన్నాధంగారీసారి అదనంగా మరికొంత జాగ్రత్త తీసుకున్నారు. తప్పిదాన్ని మన్నించి మళ్ళీ ఈసారి చిట్టిబాబును తాను పట్టణానికి తీసుకెళ్తున్నారు. కానీ యింకొకసారి యిలా చేస్తే వాణ్ణి పల్లెలోకి రానివ్వగూడదు. ఈ షరతుకు పులమ్మ ఒప్పుకోలును వ్యక్తపరచింది. చిట్టిబాబు నగర జీవితంలో రెండో అధ్యాయం ప్రారంభమైంది. అది కొనసాగింది గూడా చాలా తక్కువ కాలమే! మళ్ళీ పల్లెలో ప్రత్యక్షమయ్యాడు చిట్టిబాబు. పులమ్మ మండిపడింది. తల్లి వాడి ముఖమైనా చూచిందిగాదు. ఊరి పొలిమేరలదాకా వాడిని తన్ని తరిమివేయడం జరిగింది. ఆ దెబ్బతో చిట్టిబాబు అయిపు లేకుండా అంతర్ధానమయ్యాడు. ఆరు మాసాల తర్వాత వాడు అంబా సముద్రం బస్‌స్టాండ్‌లో కనిపించాడని చూచిన వాళ్లెవరో జగన్నాధంగారికి కబురుపెట్టారు. ఆయన పని గట్టుకుని అంతదూరం వెళ్ళారు. వెదికించి చిట్టిబాబును మళ్ళీ స్వస్థలానికి పట్టి తెచ్చారు.

చివరికిది ఎడతెగని ప్రయత్నాలతో విక్రమార్కుడు బేతాళుణ్ణి మూపున మోసితెచ్చిన కథలాగా పరిణమించింది.

మొదటిసారి గ్రహపాటుగా జరిగిన

పొరపాటు చూస్తూండగానే చిట్టిబాబు కొక అలవాటు క్రిందికి వచ్చేసింది. ఎంతగా నిగా వేసివుంచినా వాడిని హద్దుల్లో అట్టిపెట్టడం అసాధ్యమై పోయింది. చేతికి దొరికిన డబ్బును జేబులో వేసుకుని వాడు దేశంపైకి పారిపో సాగాడు తెచ్చుకున్న డబ్బు ఖర్చయి పోతే తక్షణం మరికొంత పంప వలసిందని నిర్దాక్షిణ్యంగా జగన్నాధం గారికొక కార్డు ముక్క వ్రాసి పడేసే దాకా వాడిలో కర్కశత్వం విజృంభించింది మాటిమాటికీ యిలా డబ్బు పంపుతూ రాపడం చిట్టిబాబు మరింతగా చెడిపోవడానికి మాత్రమే ఉపకరించ గలదని జగన్నాధంగారు అనతికాలం లోనే గ్రహించారు పంపడం మాను కున్నారు. అప్పుడిక చిట్టిబాబుకు మిగిలినవి రెండేగత్యంతరాలు ఒకటి కాయకష్టం. రెండోది హస్తలాఘవం. చిట్టిబాబు రెండోదానికే ఒడిబడ్డాడు ఈచేతిఫట్టు పనితనంవల వాడు ప్రభుత్వం వారికి అతిధిగా అడపాదడపా కృష్ణ జన్మస్థానంలో కాలం గడవలసి వచ్చింది

మొత్తంమీద జగన్నాధంగారి జీవిత వాతావరణంలో చిట్టిబాబు ఓ సుడిగాలి లాంటివాడుగా తయారయ్యాడు. వాడు ఎప్పుడొస్తాడో తెలియదు. రాకుండా మాత్రం వుండడు వచ్చిన తర్వాత ఈనాడో రేపో పరారీ చిత్తగించడం ఎంత ఖాయమో, ఎంతో కొంత సంగ్రహించుకుని వెళ్ళడం కూడా అంతే ఖాయం!

ఇలాగే పదేళ్ళు గడిచి పోయాయి.

ఈ పదేళ్ళ పొడుగునా జగన్నాధం గారిని ఎదుర్కొని నిరుత్తరంగా వుండి పోయిన ప్రశ్న ఒక్కటే. చిట్టిబాబు ఎందుకిలా తయారయ్యాడు? మానవుడికి సుఖశాంతులకంటే కావలసిన వేమున్నాయి? వాటిని కాలదన్ని చిట్టిబాబు అగమ్మ కాకిలా ఇలా దేశం పైన తిరుగుతున్నాడంటే అందుకు కారణ మేమిటి? లోపం ఎక్కడుంది?

షష్ఠిపూర్తికి ఆహ్వానం అందిన నాటి సాయంకాలం ఈ ప్రశ్నకొక పరిక్రొత్త సమాధానంతో భర్త సమక్షానికి వచ్చింది పార్వతమ్మ.

"ఏమండీ, ఓ మాటడుగుతాను మిమ్మల్ని! మొక్కుబడి చెల్లించు కోకపోతే దేవుడికి కోపంరాదూ?"

"రావచ్చునేమో. భగవంతుడి యింగితం మన కెలా తెలుస్తుంది పార్వతీ."

"సంతానం లభ్యమైతే బంగారంతో బొమ్మ చేయించి హుండీలో వేస్తామని మ్రొక్కుకోలేదటండీ ఒకవేళ ఆ మాట మనం మరచిపోయినా, భగవంతుడు మాత్రం మరచిపోయి వుండడు"

"భగవంతుడి జ్ఞాపక శక్తిపైన నీ కామాత్రం నమ్మక మున్నందుకు చాలా సంతోషం."

"మీ ఎగతాళి మాటలకేం గానీండి, ఎలాగూ మనం కొండకు వెళ్తున్నాము. పనిలో పనిగా మొక్కుబడి గూడా చెల్లించేయాలి"

అలాగే కానిద్దాం నాలుగు రోజుల్లో బొమ్మ చేయించి తీసుకొచ్చే భారం నాది...."

'ఎందుకు చెబుతున్నానంటే — ఆ మొక్కు కాస్తా చెల్లించుకునేదాకా చిట్టిబాబుకు బుద్ధి కుదరదేమోనండీ."

జగన్నాధంగారు తెల్లబోయారు— "అలాగైతే చిట్టిబాబుకు బుద్ధి కుదర వచ్చునని నీ కింకా నమ్మకముందా పార్వతీ."

"దేవుడు దయదలిస్తే అదెంత పనండీ."

పై అధికారుల అనుగ్రహానికి మల్లే భగవంతుడి అనుగ్రహం గూడా యివ్వకపు మాటలపైన, మెరమెచ్చు గౌరవాలపైన, ఇచ్చి పుచ్చుకోడాలపైన, ఆధారపడి వుంటుందన్న విషయం పైన జగన్నాధంగారికి నమ్మకంలేదు. ఐనా భార్య సంతృప్తికోసం ఆయన పది తులాల బరువులో ఓ పుత్తడి బొమ్మను తయారు చేయవలసిందని కంసాలికి పురమాయించారు.

ఆ బొమ్మ యింటికివచ్చిన వేళా విశేషమేమిటో గానీ, దానితో బాటుగా చిట్టిబాబుగూడా యింట్లోకాలు పెట్టాడు. కొండలవాడి దయ అంది పార్వతమ్మ

వైశాఖ శుద్ధ దశమినాటి రాత్రి ఎనిమిది గంటలకు జగన్నాధం దంపతులు చిట్టిబాబుతో సహా తిరుపతిలో దిగారు. మాధవరావు, నారాయణ, యింకా మిగిలిన కార్య నిర్వాహకులు స్టేషనులోనే వాళ్ళకు స్వాగత మిచ్చారు.

"మనం రిజర్వు చేయించుకున్న బస్సు ఉదయంఏడుగంటలకే బయల్దేరుతుంది. ఆరుగంటలకల్లా మనం ప్రయాణానికి సిద్ధంగా వుండాలి ..." అన్నాడు నారాయణ.

మాధవరావు అందుకున్నాడు— "సత్యనారాయణ రాత్రి పన్నెండు గంటలబండిలో వస్తున్నట్టు వ్రాశాడు. రామమూర్తి గూడా అదే బండిలో రావచ్చునని అనుకుంటున్నాము. పోతే తెల్లవారు జామునగూడా బస్సున్నాయి. మారేడు పల్లినుంచీ ఎవరైనా వస్తే ఆ బస్సులో రావచ్చు. అన్నట్టు మాష్టారూ. రేపురాత్రికి బహుశామీకు నిద్రవుండకపోవచ్చు. ఈరోజురాత్రి బాగా రెస్టు తీసుకోడం మంచిది ..."

★ ఒక పత్రికలో ప్రకటన :

మొన్న విజయవాడ — గుంటూరు బస్‌లో కళ్ళజోడు పొదిలేశాను. దొరికిన వారు యీ పత్రికలోనే కాస్త పెద్ద టైపుల్లో ప్రకటించ కోరుతాను.

ఎంతగా తొందరపడినా అందరూ పడుకునేసరికి అర్ధరాత్రి దాటింది. మండుటెండల తాలూకు వేడిగూడా అప్పటికి పూర్తిగా చల్లారింది. శేషాచల సానువుల్లోనుంచీ చల్లనిగాలి తెమ్మెరలు తెమ్మెరలుగా వచ్చి తిరుపతి నగరం పైన వింజామరాలు వీచింది.

అందరిలోనూ ముమ్మందుగా నిద్ర లేచిన వ్యక్తి పార్వతమ్మ.

ఆమె ఐదుగంటలకే లేచింది. గదిలోకి వెళ్ళి ముఖప్రక్షాళనాదికాలు

ముగించుకుని తిరిగివస్తూ చిట్టిబాబు కోసం చూచింది. వాడు గదిలోలేడు, వరాండాలోనూ కనిపించలేదు.

"ఏమండీ. చిట్టిబాబు ఎక్కడ పడుకున్నాడు ?" రహస్యంగానే అడిగింది పార్వతమ్మ.

"గదిలో పడుకున్నాడుగా. నువు గమనించలేదా పార్వతీ."

"ఏడీ ? గదిలోలేడే ?"

భార్యాభర్తలిద్దరూ గదిలోపలికి వచ్చారు. వచ్చీరాగానే జగన్నాథంగారి కళ్ళు ట్రంకుపెట్టె పైకే వెళ్ళాయ్. దాన్ని బలవంతంగా తెరిచిన సూచనలు బాహాటంగానే కనిపిస్తున్నాయి.

"కొంపదీసి డబ్బంతా పెట్టెలోనే వుంచేశారేమిటండీ ?" గుండెలు కొట్టుకుంటూవుండగా అడిగింది పార్వతమ్మ.

"మరేం కంగారుపడకు పార్వతీ, డబ్బు నా జేబులోనే వుంది"_ కానీ మరుక్షణాన జగన్నాథంగారి ముఖంలో గూడా కలవరపాటు ప్రారంభమైంది. "అన్నట్టు బంగారపు విగ్రహం మాటేమిటి పార్వతీ. అది పెట్టెలోనే వుండాలి...."

జగన్నాథంగారు ఆదరాబాదరా పెట్టెను తెరచిచూశారు. అనుమానం కాస్తా నిజమై వూరుకుంది. పెట్టెలో బొమ్మలేదు.

ఆపాటికి వరాండాలో మేలుకొలుపులు ప్రారంభమయ్యాయి — "ఒరేయ్‌సత్యం. ఏమిట్రా రామ్మూర్తీ!

లేవండి. లేవండి. తెల్లవారడానికింక ఆట్టే వ్యవధి లేదు....."

గది తలుపులు మూసివచ్చి కుర్చీలో కూర్చున్నారు జగన్నాధంగారు. "పోతే పోయిందిలే పార్వతీ. ఆ వస్తువు పోయిందని ఎవరితోనూ చెప్పుకోవద్దు. కడుపు చించుకోడమెందుకు, అదికాళ్ళ పైన పడటమెందుకు. భగవంతుడి కెందుకో దాన్ని స్వీకరించడం యిష్టం లేదనుకుందాం...."

"మనల్ని మనం ఓదార్చుకోవడం గాకపోతే, భగవంతునికెందుకు యిష్టం లేక పోతుందండీ."

"అదంతే ననుకోరాదా పార్వతీ. కాకపోతే మిగిలిన వస్తువులన్నీ వుండగా ఆ విగ్రహమే ఎందుకు పోవాలి? మరొకవిధంగా చెబుతాను. మనం ఎందరినో చేరదీశాము. అందరిలోనూ ఒక్క చిట్టిబాబుమాత్రం ఎందుకిలా కావాలి?"

"అంతా వాడి కర్మ."

"వాడి కర్మతో నైతే మనకు ప్రసక్తి లేదు. నేను చెబుతున్నది మన తప్పిదాన్ని గురించి...."

"మీ పిచ్చిగాకపోతే మనమేం తప్పు చేశామండీ."

"మనం మాధవుడు యింజనీరవుతాడని అనుకోలేదు. కావాలని ఆశించనూ లేదు. అలాగే నారాయణ డాక్టరౌతాడనిగానీ, కావాలని గానీ ఊహించలేదు. కానీ చిట్టిబాబు మాత్రం ఏదో పెద్ద కొండలకు నిచ్చెన వేస్తాడనీ, త్రవ్వి తలకెత్తుతాడనీ అనుకున్నాము. అవునా పార్వతీ."

"ఆశించడం గూడా తప్పేనటండీ."

"మనం ఒక వ్యక్తి పైన పెద్దగా ఆశలు పెట్టుకుంటాం మనుకో. అవి నెరవేరితేనే ఆనందం. నెరవేరకపోతే ఎదురయ్యేది తీరని దుఃఖం. ఇందుకు విరుద్ధంగా ఒక వ్యక్తిపైన మనకెలాంటి ఆశలూ లేవనుకో. అయాచితంగా అవి నెరవేరితే ఆనందించక్కపోము. కానీ నెరవేరక పోయినా ఆశాభంగం చెందము. గాఢమైన మమకారాలు, తీవ్రమైన అనుబంధాలు దుఃఖహేతువులనడం ఇందువలననే."

"ఏమిటో బాబూ. మీ వేదాంతం మాటలు నాకర్థం గావు....."

"వేదాంతమనేది జీవితానికి నిజాపైన వ్యాఖ్యానమైతే, దాన్ని మనం త్రోసిపుచ్చడం భావ్యమంటావా పార్వతీ. ఔషధం చేదుగావున్నా పుచ్చుకోక తప్పదు. ధర సింహాసన

డాక్టరు : కొత్తగా కళ్ళజోడు పెట్టుకున్నా ఎలావుందీ?

రోగి : ఘోరం సార్. యీ రోడ్లమీద ఇన్ని బస్సులేమిటీ, ఇంతట్రాఫిక్ ఏమిటీ — అదంతా కనిపిస్తూఉంటే రోడ్డు దాటట మెలాగో తెలియక మతిపోతోంది.

మై నభంబుగొడుగై .... బ్రహ్మాండమాకారమై' అంటూ భగవంతుడి మహాత్మ్యానికి తగ్గట్టుగా ఆయనకొక రూపాన్ని, నివాసాన్ని నిర్ధారణ చేశాడు మానవుడు. ఆ భగవంతుడి ఏలుబడిలో సర్వ మానవులూ సమానులేనన్న అభిప్రాయం కలిగింది. కానీ కాలక్రమాన ఆ దేవుణ్ణి గూడా తమస్థాయికి దిగలాగి ఎవరికి తోచినట్టుగా వాళ్లు పేర్లు, ఆకారాలు, మందిరాలు నిర్మించుకోవడంతో ఏమైంది? రచ్చలు, రగడలు ప్రారంభమయ్యాయి. ఊహ విశాలం కావడంలోనూ, కాకపోవడంలోనూ వున్న లాభనష్టాలని. ఈ లోకమంతా మనదే అయినప్పుడు, మానవులందరూ ఆత్మబంధువులే అయినప్పుడు మనం మన అనుబంధాలను, మమకారాలను ఒకస్థలానికి, ఒక వ్యక్తికి పరిమితం చేసుకోవలసిన దౌర్భాగ్యమేముంది? కంబళి పురుగుంది చూచావా పార్వతీ. అది కదిలీ మెసలడానికైనా వీలులేనట్టుగా ఒక గూడు కట్టుకుని అందులో నిద్రపోతోంది. ఆ గూటిని పెకలించుకుని బయటపడిన తర్వాతనే గానీ. ఆ కంబళిపురుగు సీతాకోక చిలుకగామారి సువిశాల జీవితోద్యాన వనంలో విహరిస్తూ ఆనందమకరందాన్ని గ్రోలడం లేదు. గిడసబారిన బుద్ధిలో, సంకుచిత హృదయంలో యిరుకుగోడల మధ్య ముడికిగా బ్రతకడమెందుకు పార్వతీ?"

పదిహేను నిమిషాలవరకూ స్తబ్ధురాలై కూర్చుండిపోయింది పార్వతమ్మ. ఆ తరువాత ఆమె వున్నట్టుండి పైకి లేచింది. ఎంతోసేపు ఆ కదలాడకుండా స్తంభించి వుండిపోయిన పొన్నచెట్టు హఠాత్తుగా వీచిన దక్షిణానిలంలో పులకరించినట్టుగా. తలపై నుంచీ కొండంత బరువును దించివేసిన తరువాత శరీరం తేలికపడ్డట్టుగా ఆమె లేచింది. మెల్లగా వరండాలోకి వచ్చి స్తంభానికి ఆనుకుని నిల్చుంది. ఇంకా తెల్లవారినట్టులేదు. కొండ మెట్లను వెన్నంటి వున్న విద్యుద్దీపాలు వెలుగుతూనే వున్నాయి. తెల్లవారకేమి. గోవిందరాజస్వామి గుడిగోపురంపైని కనకకలశాలు వికసిస్తున్న పద్మాలను తలపిస్తున్నాయి.

బస్సు బయల్దేరడానికి సిద్ధంగా వుందని చెప్పడానికి వచ్చిన నారాయణ పార్వతమ్మను చూచి పదిబారల దూరంలో ఆగిపోయాడు. వచ్చిపోతున్న మసకచీకటి వెలుగుల్లోనుంచి ఆమె ముల్లోకాలకు కన్నతల్లి అయిన అలిమేలు మంగమ్మలా కనిపించింది.

★★★

విజేత

యద్దనపూడి సులోచనారాణి

[గత సంచిక తరువాయి]

"యేంమిటది? యేమైంది?యెందు కేడుస్తున్నాడు." అప్పటికి మాధవ్ ఆయాకి ఎదురు వెళ్తూ అడిగాడు. అతను అప్పుడే తలారా స్నానం చేశాడులావుంది. పొడిపొడిగా వున్న జుట్టు కొద్దిగా నుదుటిమీదికి వడి గాలికి కదుల్తోంది. ఒంటిని షర్ట్‌కి బదులు మీద తువాలుంది.

"దారపు వుండ సరిగ్గా పట్టుకో లేదుట. పట్టుకు కొట్టాడు. పిల్లలు యేముంది." అంది ఆయా.

"యేం వాసూ?—" అన్నాడు మాధవ్ చేతులుజాపి కొడుకుని అందు కుంటూ.

"అవును కొట్టాను." వాసు నిశ్చ యంగా అన్నాడు. వాడి మొండితనానికి సంధ్యకి, ఆయాకి యిద్దరికీ ఆశ్చర్యం వేసింది.

"యెందుకు కొట్టావు? మీ యిద్దరూ స్నేహంగా వుండాలని నేను చెప్ప లేదూ?—"

"నాకూ వాడికి స్నేహం యేమిటి? నేను పెద్దవాడిని, వాడు చిన్నవాడు."

"అందుకని? కొట్తావా?—"

"కొట్టటం కాదు. అవకాశం దొరి కితే చంపేస్తాను. వాడంటే నాకంత అసహ్యం."

మాధవ్ వాసు దగ్గరిగా వచ్చాడు. ఆయా కూడా భయంగా చూస్తోంది.

"అసహ్యం యెందుకో కాస్త వివ రంగా తెలియజేస్తారా వాసుదేవరావు గారూ?—" గంభీరంగా అడిగాడు మాధవ్.

"వాసు చురుగ్గా కళ్ళెత్తి చూసాడు. వెంటనే వాటినిండా గిర్రున నీళ్లు తిరి గాయి. పళ్లు బిగబట్టి "అసహ్యం కాదూ. ఈ వెధవ వచ్చినప్పటి నుంచి మీరెంత మారిపోయారు. నేను వచ్చినప్పటి నుంచీ చూస్తున్నాను. నాతో మీరు ఒక్క సారి కూడా సరిగ్గా మాట్లాడ లేదు. ఒక్క క్షణం కూడా నన్ను దగ్గర కూర్చో పెట్టుకో లేదు. యెప్పుడూ వాడే—" కంఠం బొంగురు పోవటంతో ఆగిపోయి చప్పునకళ్లుతుడుచుకున్నాడు.

సంధ్య తెల్లబోయి చూడసాగింది.

మాధవ్ కొద్దిసేపు రెప్పవాల్చ కుండా చూచి వెంటనే చెయిజాపి వాసు భుజాలచుట్టూ వేసి దగ్గరకు లాక్కున్నాడు.

"మీరు—మీరు—నన్ను సరిగ్గా చూస్తే నేను వాడిని ఏమీ అనను. వాడి మీద నాకేంలేదు." వెక్కిళ్ళ మధ్య అస్పష్టంగా అన్నాడు.

"తెలిసింది వాసూ, తెలిసింది. పొర పాటు నాదే. యింకెప్పుడు అలా వేయనుగా." వాసు జుట్టులోకి వేళ్ళు పోనిస్తూ ప్రేమగా అన్నాడు మాధవ్.

"నేను నేను కూడా వాడిని యెప్పుడూ కొట్టను." అతనిచేతికి పెన వేసుకుపోతూ వాగ్దానం చేసాడు వాసు.

ఆయా మెల్లిగా లోపలికి వెళ్ళి పోయింది. సంధ్యకూడా తనగదిలోకి తిరిగి వచ్చింది. ఈ సంఘటనతో సంధ్యకి కొత్త సత్యం తెలిసింది. వాసుకి మాధవ్ ప్రేమ అంత అవ సరమా! స్వంత అక్క ప్రాణంగా చూచే అభిమానం వాడికి చాలదా? ఆమాటకొస్తే వాసుని తనకంటె మాధవ్ ఎక్కువ ప్రేమిస్తాడా? అసలు ఇది వరకులా వాసు తనదగ్గరకూర్చోవాలని కాని, కబుర్లు చెప్పాలనిగాని చూడడే! ఒకవేళ యెప్పుడైనా బలవంతంగా కూర్చో పెట్టుకున్నా వాడి మనసు, ప్రాణం రెండూ మాధవ్ దగ్గరే వుంటాయి. భగవాన్ తనేం పాపం చేసిందని వాసుకూడా చివరికి దూరమై పోతున్నాడు. ఇది గుర్తించిన సంధ్య మనసు వికలం కాసాగింది.

38

"నన్నాయన స్కూల్లో చేర్పిస్తా నంటున్నాడు." అన్నాడు వాసు వుత్సాహంగా అక్కగారి ప్రక్కన వచ్చి కూర్చుంటూ.

"వద్దు."

"యెందుకని?" విచిత్రంగా చూసాడు.

"మనకంత డబ్బు లేదు."

"ఆయనిస్తానంటున్నారుగా."

సంధ్య చ్రుమనిలేచింది. "తీసుకో టానికి అంతూ పంతూ లేదా?—"

వాసు ముఖం వాడిపోయింది. గది లోంచి లేచి బైటికి వెళ్ళిపోయాడు. కాలు నయం కాగానే యెన్ని కలలు కన్నాడు. మళ్లీ స్కూల్లో జేరవచ్చునని, యిదంతా పీడ కలలా మర్చిపోవచ్చు నని, యింకా యెన్నిఆశలు పెట్టుకున్నాడు. ఇన్ని కష్టాలమధ్య దేవుడిచ్చిన వరంలా మాధవ్ అండ దొరికింది. యేం? మాధవ్ దగ్గర యెందుకు తీసుకో గూడదు? ఇప్పుడు ముగ్గురి తిండిఅతను భరించటంలా? అసలు తీసుకోనే కూడదు. కానీ తీసుకోటం మొదలు పెట్టిన తర్వాత యెక్కువ తక్కువవభేదం యేముంది? ఒక్క రూపాయి తీసు కుంటే యెంతో పది రూపాయలు తీసు కున్నా అంతే. సంధ్యని యెదురు ప్రశ్నలు వేసి తర్కిస్తే మరీ మండి పడుతుంది. మెల్లగా నచ్చచెప్పివప్పించాలి. గదిబైటకాసేపుఅటూయిటూతారట్లాడిన వాసు వెనక్కు తిరిగి మళ్లీ అక్కగారి దగ్గరకు వచ్చాడు.

"పోనీ అప్పుగా తీసుకుందాం." అన్నాడు.

"తీసుకోగానే సరా? మళ్ళీ తీర్చద్దూ?—"

"నేను చదువుకుని వుద్యోగంచేసి తీర్చేస్తాను."



"మహా తీర్చావులే. యిప్పుడు తీసుకున్నదంతా మొదట తీర్చు."

వాసుకి కోపంవచ్చింది." అయితే యెల్లకాలం ఆయన పీకలమీద యిలా కూర్చుని తింటూ వుందాం.." అది బాగుంటుంది నీకు."

"నోర్మూయ్. యెల్లకాలం యెందుకుంటాం. ఆ స్థలం మళ్ళీ దున్నించి తోట వేసుకుందాం. యిల్లుపూర్తికాగానే ఆ యింట్లోకి వెళ్ళిపోదాం. కూరగాయల మీద డబ్బు రావటం ప్రారంభం అవగానే కాస్తకాస్త అప్పు తీర్చేద్దాం."

"పోనీ అలాగే అనుకుందాం. అదయినా యెన్నాళ్లు ? నువ్విలా బ్రతికి వున్నంతకాలం కాయకష్టం చేస్తూ కూర్చుంటావా ?_" .

"యెప్పుడూ యెందుకు చేస్తాను ? నువ్వు పెద్దయేవరకూ చేస్తానంతే."

వాసు దిమ్మెరపోయినట్టు చూసాడు. "నేనా ? నా వల్ల అవుతుందా. బరువు పనులు యెప్పుడూ చేయకూడదని డాక్టరు చెప్పినమాట మర్చిపోయావా?"

సంధ్య మాట్లాడలేదు.

వాసు బ్రతిమలాడటం ప్రారంభించాడు. "అక్కా నామాట విను_"

"ఈవిషయంలో మాత్రం వినదల్చుకోలేదువాసు. ఇప్పటికే తప్పనిసరిగా చాలా సహించాను. నేనింక సహించలేను. నాకు శక్తిలేదు."

"అయితే నేను చదువుకోవటం నీ కిష్టంలేదుకదూ ?_" నిష్టూరంగా అడిగాడు. సంధ్య మౌనంవహించింది. వాసు ముఖం కోపంతో జేవురించింది.

"అంతేలే. నేను జాగ్రత్తగా కష్టపడి చదువుకుంటానంటే నువ్వు వినవు. యెలాగో కొద్దిరోజులు కాలం గడుపుకోమంటే గడుపుకోలేవు. ఆ బరువుపనులు నేను చేయలేను. నువ్వు చేస్తుంటే చూస్తూ వూరుకోలేను. యెప్పుడో ఓ రోజు నీకు సాయం చేయబోయి నడుం విరిగి మళ్లీ మంచంలో పట్తాను. సరిపోతుంది. అప్పుడు నీ కళ్లు చల్లగా వుంటాయి."

"వాసూ ! " సంధ్య బిగ్గరగా అరిచింది.

"అంతే. నా మొహాన అదే వ్రాసిపెట్టివుంది. అలా జరక్కపోతే చూడు నువ్వు."

వాసు విసురుగా తల యెగరేసి అక్కడనుంచి వెళ్లిపోయాడు.

"వాసూ. " సంధ్య వణుకుతూ పిల్చింది. వాసు మళ్లీ మంచంలో పడటమా. వాడికి పునర్జన్మ యివ్వటం కోసంకదూ తమ అభిమానాన్ని చంపుకుంది. వాసు మళ్ళీ మనిషిగా మారటం కోసం కదూ తన అసహ్యాన్ని అణుచుకుంది. లేకపోతే మాధవ్ నీడనైనా తను కన్నెత్తి చూసేదా. ఇదంతా వాసు మళ్లీ మంచంలోపడి యెప్పటిలా అవిటి బ్రతుకు బ్రతకటానికేనా ఇను చేసింది.

ఆ రాత్రి వాసు భోజనం చేయలేదు. ముాతిముడుచుకుని మంచంమీద పడుకున్నాడు. ఆయావచ్చి పిలిస్తే "తంతాను" అవతలకివెళ్లు అని అరి

వాడు. సంధ్య స్వయంగా వచ్చి యెంత సేపో బ్రతిమలాడింది. అయినా విన లేదు. చివరికి చదువుకి ఒప్పుకున్నానని అంగీకారం తెలుపుతూ అనుమతి యిచ్చింది. "నిజంగా" వెంటనేలేచి అక్కగారి రెండుచేతులూ పట్టుకుంటూ ఆత్రంగా అడిగాడు.

"నిజంగానే"

"నేను అన్నంతిన్న తర్వాత మళ్ళీ మనసు మార్చుకోవుగా ." అనుమా నంగాచూసాడు.

"మార్చుకోను. నువ్వులేచి భోజనం చెయ్యి." కఠినంగా అంది సంధ్య వాసుకి రెక్కలు వచ్చాయి. ఎగిరి పోతున్నాడు. ఆకాశానికి ఎగిరిపోవాలని తహతహలాడుతు రెక్కలుకొట్టుకుంటున్న పిట్టని బలవంతగా పట్టుకుని ఆపా లనుకోటం కంటె వెర్రితనం యింకోటి లేదు.

39

వాసుని తీసుకెళ్ళి హైదరాబాద్ లో స్కూలులో చేర్పించి కావలసిన సదు పాయాలన్నీ చూసివచ్చాడు మాధవ్. ఇల్లుకడుతున్న మేస్త్రి భార్య చనిపోవటం వల్ల యింటిపని ఆగిపోయింది. మాధవ్ యింట్లో భోజనంచేస్తున్నటుంటం ఆయా యెలాగూ వుంచుకోటం లేదు. సంధ్య కూడా వుంచుకోదలుచుకో లేదు. బాబు పనులన్నీ యిప్పుడు సంధ్యే చూస్తోంది. వాడిని తాకినప్పుడల్లా మనసు విచిత్రంగా అనుభూతి పొందటం మాన లేదు. మాతృత్వానికి శాశ్వతంగా దూర మైన మనిషినని గుర్తుకురావటం వల్లనా! అందరి ఆడవాళ్ళలా కాకుండా తన జీవితం యీ విధంగా అష్టవంక రలు యెందుకు తిరిగింది ? వాసు వెళ్ళి పోవటంతో వంటరితనంతో శూన్య మైన సంధ్య మనసు మెల్లమెల్లగా తనకు తెలియకుండానే బాబువైపు తిరగ సాగింది. మాధవ్ కోరుకున్నది యెంతో ఓపికగా యెదురుచూస్తున్నది కూడా దీనికోసమే. యెన్నిసార్లో సంధ్యకి అసలు విషయాన్ని చెప్పాలని ప్రయత్నం చేశాడు. కాని అతను సిద్ధం చేసుకున్న సంభాషణ అంతా సంధ్య కనుబొమల మధ్య ముడి చూడగానే గుర్తు పట్టలేనంత దూరంగా పారి పోయేది.

సంధ్యకి, తీరికగా కూర్చునిమాధవ్ యింట్లో వుంటున్నానని ప్రత్యేకించి జ్ఞాపకం చేసుకుంటే తప్ప గుర్తురాదు. మాధవ్ సాధారణంగా ఇంట్లో వుండడు. వున్నప్పుడు కూడా యెక్కువకాలం అతని గదిలోనే గడుపుతాడు. నెలకి 20 రోజులు అతను పట్నంలో వుండి చేసేపని యేమిటో సంధ్యకి తెలియదు. రకరకాలుగా వూహించుకుని మరింత అసహ్యించుకునేది. యేదయినా అత నెక్కువగా యింట్లో వుండకపోవటం మాత్రం ప్రాణానికి హాయిగావుంది. తీరిక సమయం అంతా రాట్నంవడక టంలో గడుపుతోంది. ఆ యేకులు అమ్మగా వచ్చినడబ్బు ఆయా ద్వారా మాధవ్ కి అందజేస్తోంది. కానీఅందులో చిల్లిగవ్వకూడా అతను ముట్టుకోలేదని. అదంతా భద్రంగా ఆయా దగ్గరే వుంచ

మని చెప్పాడని, ఆయా అలాగే దాచి వుంచిందని సంధ్యకి తెలియదు. రోజులు గడిచిన కొద్ది ఆయాకిమాత్రం మాధవ్ అంటే మాతృత్వంతో కూడిన మమకారం వెల్లువలా పొంగసాగింది. బుద్ధిమంతుడైన అతన్ని సంధ్య భర్తగా స్వీకరిస్తే బాగుండునని మనసులో ఆశించేది. కాని పైకిచెప్పాలంటే సంధ్య ఎక్కడ విరుచుకు పడ్తుందోనని లోలోపలే ఆ అభిప్రాయాన్ని దిగమింగి వూరుకుంది. కాని కొద్దిరోజులు యిలాగే అతనితో కలిసివుంటే అతని వ్యక్తిత్వం చూచి యేనాటికైనా ఆకర్షింపబడక మానదని కూడా అనుకునేది. అందుకే భగవంతుడి బలవంతాన యీ యింట్లో వుండాల్సివచ్చిన పరిస్థితులుకి మనసారా నమస్కరించేది.

40

అందరిలాగానే బాబుకూడా సంధ్యని పేరు పెట్టి పిలుస్తున్నాడు. అది చూసిన మాధవ్ ఓ సారి వంటరిగా వున్నప్పుడు అలా పిలవకూడదు తప్పు అని చెప్పాడు

"మరి యేమని పిలవాలి ?—" తండ్రి ఒళ్ళో కూర్చుని గడియారంతో ఆడుకుంటున్న బాబు తలెత్తి సూటిగా అడిగాడు.

మాధవ్ క్షణంసేపు తటపటాయించి "అమ్మ అని పిలు" అన్నాడు.

"అమ్మ అంటే ?—"

మాధవ్ జవాబు చెప్పలేక పోయాడు.

"చెప్పు. అమ్మంటే ? —" ప్రతి దాన్ని వివరంగా తెలుసుకోవాలనే ఆరాటం వాడికి మహా యెక్కువ. సమాధానం చెప్పేవరకూ వదలడు.

"అమ్మంటే — చాలా మంచిది. అందంగా వుంటుంది. నిన్ను బాగా చూస్తుంది.

"సంజ్యలాగానా ?—"

మాధవ్ ఔనన్నట్టు చూసాడు. తదేకంగా తండ్రిముఖంలోకి చూస్తున్నవాడు వేలుజాపి బుగ్గమీద మచ్చవున్నచోట ఆనించి "యిదేంటి?" అన్నాడు.

మాధవ్ కొడుకువైపు క్షణంసేపు అలాగే చూస్తుండిపోయాడు.

"చెప్పు. పడ్డావా ?—"

"లేదు"

"మరి ? యెవరన్నా కొట్టారా?—"

మాధవ్ ఔనన్నట్టు తలూపాడు.

"యెవరు ?"

"సంధ్య."

బాబుకళ్లుఆశ్చర్యంతో పెద్దవైనాయి. "యెందుకు ? గారిపటం చింపావా ?"

చింపలేదన్నట్టు చూసాడు మాధవ్.

"మరి ? తలంటి పోసుకోలేదా?—"

అదికూడా కాదన్నట్టు చూసాడు.

"చాకలెట్లు అన్నీ తినేశావా ?—"

"ఉహూ." అడ్డంగా తలూపాడు మాధవ్.

"యింకెందుకు కొట్టింది?—" ప్రపంచంలో దెబ్బతినటానికి యింకా కారణాలు వుంటాయి అంటే వాడి పసిమనసు నమ్మలేక ఆశ్చర్యపోతోంది.

"నువ్వే అడుగు."

"యెవరిని? వంజ్యనా?"

"సంధ్య అనకూడదు అని చెప్పలా".

"అంటే యేమవుతుంది?"

"కళ్ళు రెండూ పోతాయి."

క్షణంసేపు తండ్రి కళ్ళలోకిచూసిన బాబు వెంటనే ఒళ్లోంచిదిగి వంటయింటి వైపు పరుగెత్తాడు.

41

"అమ్మా. అమ్మోయ్." కొత్తగా నేర్చుకొన్న మాటని అప్పటికప్పుడు వుపయోగించేస్తూ హుషారుగా బిగ్గరగా పిలిచాడు బాబు.

వుతికి ఆరేసిన బట్టలు తెచ్చి మడత పెడ్తున్న సంధ్య చివ్వున వెనక్కు తిరిగి చూసింది.

"మా నాన్నారి బుగ్గమీద యెందుకు కొట్టావు?_" సీరియస్‌గా అడిగాడు.

సంధ్య చిత్రంగా చూసింది.

"చెప్పమ్మా."

"అమ్మా."

"అవును. నీపేరు సంజ్యకాదు. అమ్మ." చేతులు కట్టుకుని నీ సంగతి నాకు తెలుసులే అన్నంత ధీమాగా గంభీరంగా అన్నాడు.

సంధ్యకి చాచి చెంప వగలగొట్టా అన్నంత కోవం వచ్చింది.

అయినా నిగ్రహించుకుంటూ "యెవరు చెప్పారు?" అంది.

"నాన్న_" వాడు వాక్యం పూర్తి



ఆతలుపుతియ్యడానికి అరగంట వృథా చేశావ్
ఇనప్పెట్టికీ ఐసుప్పెట్టికీ తేడా తెలీపోతే
ఇంకెందుకు పనికొస్తావురా నువ్వు

చేయనేలేదు, సంధ్య చేస్తున్నపని వదిలేసి చరచరావచ్చి వాడి రెక్క పట్టుకుని మాధవ్ గదిలోకి యీడ్చుకొచ్చింది.

మాధవ్ ముఖానికి పేపరు అడ్డుంది. చదువుకుంటున్నాడు కాబోలు.

"మీ అబ్బాయికి సరైన మాటలు నేర్పుకుంటే బాగుంటుంది." అంది కోపంగా.

"యేం చేశాడు?" పేపరు దీసేస్తూ యేం తెలియని వాడిలా ఆశ్చర్యంగా అడిగాడు.

"ఆయాని అమ్మా అని పిలుస్తే యెంత అసహ్యం."

"పసివాడు, ఆయాకి, అమ్మకి భేదం వాడికేం తెలుస్తుంది." మాధవ్ ప్రేమగా బాబుని దగ్గరకు లాక్కుని రెండు బుగ్గల మీద గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు. సంధ్య యీడ్చుకు రావటంతో బెదిరి పోయినబాబు తండ్రిమెడచుట్టూ చేతులు పెనవేసి కౌగిలించుకున్నాడు. వాళ్ళిద్దర్ని అలా చూస్తుంటే సంధ్య హృదయం యీర్ష్యతో భగ్గుమంది వాడంటే మాధవ్‌కి అంత ప్రాణం యెందుకని. వాడి తల్లిని అంతగా ప్రేమించేవాడా. ఆ ప్రేమకి ప్రతిఫలం కాబట్టీ వాడంటే అంత అపరూపమా? అయినా స్త్రీలోలుడైన మాధవ్‌కి అలాటి సున్నితమైన భావాల విలువలు కూడా తెలుసా? వికలమైన మనసుతో సంధ్య గదిలోంచి గిర్రున వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది.

"బాబూ. నీకు అమ్మ బాగుందా? సంధ్య బాగుందా?" కొడుకుని అడిగాడు మాధవ్. బాబు వెనక్కి తిరిగి గదిలోంచి సంధ్య వెళ్ళిపోయిందని నమ్మకంగా తెలుసుకున్న తర్వాత తండ్రి చెవిలో రహస్యంగా "అమ్మే బావుంది" అన్నాడు.

"ఆల్‌రైట్ అలాగే పిలు."

"కాని సంజ్య కొడ్తుందిగా."

"కొట్టదు. కొడ్తే నాకు చెప్పు."

"యేంచేస్తావు?"

"సంధ్య చెవులు మెలేస్తాను."

బాబు కళ్ళలో కుతూహలం కలిసిన సంతోషం తొంగిచూసింది.

ఆ సాయంత్రం భోజనం చేస్తుండగా "అమ్మా. మంచి నీళ్ళు." అన్నాడు పిరాగ్గా.

"నీక్కాదూ చెప్పేది, అమ్మకాదు. ఆ_యా." మంచినీళ్ళగ్లాసు తెచ్చి గట్టిగా పెడుతు కోపంగాఅంది సంధ్య.

"ఆయానాకు వాలేదు." మొండిగా అన్నాడు.

"యెందుకని?"

"యేంబాంటుంది? ఆయా అంఠే నల్లగా, అసహ్యంగా మీ ఆయాలా వుంటుంది."

"అమ్మంటే?_"

"నీలా ఎర్రగా బాంటుంది." వాడి బుంగమూతి చూసేసరికె సంధ్య కోపం పటాపంచలైంది. నవ్వునాపుకుని వాడిబుగ్గ గిల్లుతూ "అయితే సంధ్యా అని పిలు" అంది.

"ఉహుం."

"ఎందుకని?"

"కళ్లుపోతాయి." బాబు రెండు కళ్లూ మూసుకున్నాడు. ముద్దొస్తున్న వాడి ముఖం వైపు అలా తదేకంగా చూస్తుంటే మళ్ళీ అదే బాధ! మనసులో మారుమూల యెక్కడో కలుక్కు మన్నట్టు అన్పిస్తుంది. ఈ పసివాడిమీద తనకెలాంటి అధికారంలేదు. ఈ జీవితంలో బాబులాంటి వాడికి తనెప్పటికీ జన్మ యివ్వలేదు. అబాధేనా వాడంటే యేప్పడినా ఈర్ష్యకి అసలు కారణం

మాధవ్ మీద యెంతద్వేషంవున్నా సంధ్య బాబువైపు ఆకర్షింపబడకుండా వుండలేక పోతోంది. పిలవకుండానే వచ్చి మీదపడి అల్లరిచేస్తూ అడక్కుండానే తన చుట్టుమట్టూ తిరగాలని ఆరాటపడటం సంధ్యకి ఓసారి ఆశ్చర్యం అన్పించేది. వాసు చదువుకోసం దూరంగా వెళ్లిపోవటంలో, ఒంటరితనంతో కృంగిపోతున్న సంధ్యకి బాబు రాను రాను ఓ లోకంగా తయారవుతున్నాడు. వాడి చురుకుదనం, ముద్దొచ్చే ఆ మాటలు తనకి తెలియకుండానే మనసంతా నిండిపోతున్నాయి. ఇప్పుడిప్పుడు ఒక్క అరగంట వాడు కన్పించకపోతే కళ్లు బాబుకోసం యిల్లంతా గాలిస్తాయి. కొద్దిసేపు వాడు వచ్చి మీదపడి, యేవేవో ప్రశ్నలతో వేధించి విసిగించకపోతే యేదో లోటుగా తోయినట్టే వుంటుంది. ఇదంతా అప్పుడప్పుడూ గుర్తుకురాగానే సంధ్యకి యెలాగో అన్పించసాగింది. బాబుని బాబుగాగాక మాధవ్ కొడుకుగా చూసి అసహ్యించుకోవాలని అనేక విధాల ప్రయత్నించసాగింది, కాని లాభంలేక పోతోంది.

42

ప్రియమైన బావకి,

సుధ నమస్కరించి వ్రాయునది. నేను పిల్లలు యిక్కడ కులాసాగానే వున్నాం. నీక్షేమంబొత్తిగా తెలియటం లేదు. నువ్వసలు ఆ పల్లెటూరు వదిలి యిక్కడకు రావటంలేదా? లేక ఒకవేళ వచ్చినా నాకు కన్పించకుండా వెళ్లిపోతున్నావా? ఈ మధ్య నిన్ను గురించి విన్న కొన్ని వార్తలనిబట్టి నాకు రెండోదే నిజమని అన్పిస్తోంది. బావా. ఇది నిజమేనా? యెవరో మనిషిని తెచ్చి యింట్లో పెట్టుకున్నావుట. ఇది ఆయన తనేస్వయంగా కళ్ళారా చూసివచ్చాను అని చెప్పినా నేనునమ్మలేక పోతున్నాను, పైనుంచివారు నీ క్షేమంకోరి యేదోహెచ్చరించబోతే మీదపడి కొట్టినంతవని చేసావుట. ఆయన యింటికివచ్చి యిదంతా చెప్పి నాతో 'నువ్వికనుంచి మీబావతో రాకపోకలుగాని, వుత్తర ప్రత్యుత్తరాలు గాని మానెయ్యాలి' అని అంత ఖచ్చితంగా మా అత్తగారి వాళ్లముందు చెబుంతే దుఃఖంతో, అవమానంతో నా గుండెలు యెలా వగిలిపోయినాయో నీకు తెలుసా? అపలయినా అయినవాళ్లనికూడా నువ్వు అవమానించి పంపించటానికి వెను

నీయసంతటి ఆప్తురాలయిపోయిందా ఆవిడ? అసలు ఆ మనిషి యెవరు? నాకావూళ్లో కాస్త చదువు సంధ్య కలిగిన మనుష్యులెవరూ కన్పించ లేదే! అంటే_ నా బావ, పురుష లోకానికే మణిపూసలాటి వ్యక్తిత్వంగల నా మాధవ్ చివరికి ఓ పల్లెటూరి కులుకులాడికి లొంగిపోయి తన చెప్పుచేతల్లో నడుస్తున్నాడు అంటే, ఆ నిజం నమ్మే బదులు యెందులోనైనా పడి చావటం వుత్తమంఅన్పిస్తోంది. అయినా నీకా ఖర్మ యేమిటి? అయినింటి పిల్లని చేసుకుని మాఅందరిలా పిల్లా, జల్లాతో సుఖంగా సంసారం గడపకుండా యీది గజారటం యేమిటి? 'యెంత ఆలోచించినా నాకేమీ అర్థంగావటంలేదు. బావా! ఇప్పుడేచెబ్తున్నా ఆ మనిషియెవరో తక్షణం నువ్వు యింట్లోంచి వెళ్ళగొట్టకపోతే స్వయంగా నేనే వచ్చి ఆ పని చేస్తాను. నీ మరదలుగా, నీ చిన్ననాటి స్నేహితురాలిగా, యీ ప్రపంచంలో నీకున్న ఒక్కగానొక్క ఆప్తురాలిగా నా కర్తవ్యం నాకు తెలుసు. నీజీవితం అలా వక్రమార్గంలో పడిపోతుంటే నేనుచూస్తూ వూరుకోలేను. అసలు నువ్విలా అయిపోవటానికి సగం కారణం నేనేమో అన్పిస్తోంది. అందుకే నా బాధ్యతని నేను నిర్వర్తించటానికి నిశ్చయించుకున్నాను, ఇప్పుడర్థమః తోంది. ఆ పల్లెటూరులో, ఆ నిరక్షర కుక్షుల మధ్య నిన్నుపట్టి నెలలతరబడి అక్కడేవుండిపోయేలా బంధించుకున్న ఆకర్షణ చివరకిది అన్నమాట. బావా!

తక్షణం ఆ మనిషిని యింట్లోంచి పంపి వేయకపోతే నీయీ సుధ చచ్చిపోయి నంత ఒట్టు. నా పిల్లల తలమీద చెయ్యి పెట్టి నేనీ ఒట్టు వేస్తున్నాను. సువ్వా వూరునుంచి మకాం మార్చేసి యిక్కడికిరా! మా అందరితో కలిసి తిరుగుతుంటే మళ్ళీ జీవితం దానంతట అదే గాడిలోపడ్తుంది. బావా! నన్నర్థం చేసుకుని నాయీ గుండెలమీద బరువు దింపమని ప్రార్థిస్తున్నాను. నా ప్రార్థనని మన్నిస్తావుకదూ! నీరాకకోసం, నువ్వు చెప్పబోయే ఆ చల్లటివార్తను వేయి కళ్ళతో యెదురు చూస్తుంటాను. నన్ను నిరాశ పరచవనే గాఢమైన


నమ్మకంతో,

నీ

చిన్నారి మరదలు

సుధ.

వుత్తరం చదవటం పూర్తయే సరికి మాధవ్ ముఖం యెర్రబడటమేకాదు కోపాన్ని బలవంతంగా నిగ్రహించుకుంటున్నట్టుగాదవడలుబిగుసుకున్నాయి. సుధకి హఠాత్తుగా యిన్ని సంవత్సరాల తర్వాత మళ్ళీ యిలా అనురాగం - అధికారం గుర్తురావటం యెంత విచిత్రం! వుత్తరాన్ని విసుగ్గా మంచంమీద పారేసి



లేచి కిటికీ దగ్గరకెళ్ళి నిలబడ్డాడు. పది రోజులక్రితం — ఆరోజు హైద్రాబాద్ వెళ్ళినపుడు — జ్యోతి పెళ్ళి ప్రసంగం యెత్తబోతె ఖచ్చితంగా తిరస్కరించి, అసలు తనకిప్పుడు పెళ్ళి చేసుకునే వుద్దేశ్యమే లేదని తెలియజేసి, మళ్ళీ జ్యోతి అవమానం పొందినట్టు భావించకుండా మెల్లగా చల్లటి మాటలతో మృదువుగా సేదదీర్చి ఆరోజు సాయంత్రమే యింటికి తిరిగి వచ్చేస్తున్నాడు. వూరికి సరిగ్గా ఆరుమైళ్ళ దూరంలో కారు టైర్ బరస్టు అయింది. డ్రైవర్ దిగి మరో టైర్ బిగించే ప్రయత్నం ప్రారంభించాడు. సూర్యాస్థమయం కావస్తోంది. చల్లటిసాయంత్రం. నిర్మానుష్యంగా వున్న రోడ్డు. మాధవ్ చేతి వాచీ చూసుకున్నాడు. అరగంట పాటు నడిస్తే యిల్లు చేరుకోవచ్చు. వంటరిగా, ప్రశాంతంగా వున్న ఆ పరిసరాల్లో అతనికి నడవాలనే అన్పించింది. తన తిరస్కారాన్ని జ్యోతి యెలా తీసుకుంటుందో, యీ సంఘటన వల్ల ప్రసాద్ కుటుంబంతో తన పరిచయంలో యేమైనా మార్పులు వస్తాయేమోనని ఆ విషయాన్నే పరధ్యానంగా ఆలోచిస్తు నడుస్తున్న అతను ఆ కొద్ది దూరం యెప్పుడు నడిచేసాడో జ్ఞాపకమే లేదు. వూళ్ళో ప్రవేశించగానే "అదేంటి దొరా! నడిచివస్తుండారే?" అనియెవరో పలకరించటంతోవులిక్కిపడ్డాడు.

వీధులుదాటి మలుపులు తిరిగి తన యింటి ఆవరణలో ప్రవేశిస్తూనే తెల్లబోయాడు. ఇంటి వరండాముందు భాస్కరం కారు ఆగివుంది. ఆరోజు మధ్యాహ్నమె బజారులో భాస్కరం కలిసినప్పుడు వుంటారా రెండురోజులు అంటే యివాళ మాత్రం వుంటాను అని జవాబు యిచ్చాడు. తనతో యేదయినా పనివుంటే అక్కడే చెప్పవచ్చుగా! అయినా అసలు తను హైదరాబాద్‌లోనే వున్నాడని అంత ఖచ్చితంగా తెలిసి కూడా అతనిక్కడికి రావటంలో గల వుద్దేశ్యం! ఆలోచనతో — అనుమానంతో అతని కనుబొమలు ముడిపడ్డాయి, ఇల్లంతా బార్లా తలుపులు తెరిచి వున్నాయి. యెక్కడా యే శబ్దంలేదు. సంధ్యయేది? భాస్కరం యెక్కడున్నట్టు! వంట యింటివైపు వెళ్ళిన అతనికి వంటయింటి తలుపులు చేరవేసి కన్పించాయి. ఇంట్లో ఆయా, బాబు కూడా లేరు. వీళ్ళంతా ఒక్కసారి యిలా తలుపులన్నీ తెరిచేసి యెక్కడికి వెళ్ళినట్టు! వంటయింటి ముందు నుంచి వెనక్కి తిరిగి వచ్చేస్తున్న మాధవ్ సంధ్య గుమ్మంముందు ఆగిపోయాడు. లోపలనుంచి మాటలు విన్పిస్తున్నాయి. తలుపులు వేసివున్నాయి అతని కెందుకో ఒక్కసారి ఒంట్లో వున్న రక్తం అంతా మరిగిపోయింది. పిడికిలిచాచి తలుపుమీద గట్టిగా కొట్టబోయాడు. అతనిచేయి తలుపు దగ్గరకి వెళ్లకముందే మధ్యలోనే ఆగిపోయి వాలిపోయింది.

"భాస్కరం. మర్యాదగా దారికి అడ్డులే. తలుపుతీయి." కోపంగా అంటోంది సంధ్య.

41 "ఉహూ. తియ్యను. నువ్వు నా ప్రశ్నకి సమాధానం చెప్పేవరకూ యీ గది తలుపులు తెరుచుకోవు."

"సమాధానం యిందాకే చెప్పాను."

"నాక్కావల్సింది సమాధానంకాదు. అంగీకారం."

క్షణంసేపు నిశ్శబ్దం.

మాధవ్ బైట బొమ్మలా నిలబడి పోయాడు.

కొద్దిసేపయింతర్వాత కోపాన్ని అణుచుకున్న కంఠంతో "నువ్విలాటి దుర్బుద్ధితో వచ్చావని తెలిస్తే అసలు యింట్లోకి అడుగు పెట్టనిచ్చేదాన్నికాదు. ఒకవేళ రానిచ్చినా అలా తెలివితక్కువగా అప్పుడే ఆయాని యేకులు యిచ్చి రమ్మని పంపేదాన్ని కాదు." అంది.

భాస్కరం నవ్విన శబ్దం విన్పించింది.

మళ్ళీ సంధ్య అంది." మాధవ్‌కి యీ విషయం తెలిస్తే నీ రక్తం కళ్ళ చూస్తాడు."

"యేం? నువ్వు మాధవ్ భార్యవా? అక్కవా? చెల్లివా?–"

"యేం కాకపోయినా నీలాటి దుర్మార్గుల్లో లేని మంచితనం అతనిలో వుంది."

"ఓహో! యేం మంచితనం! సరే. నేనిప్పుడు నీ నోటినుంచి అతని పొగడ్తలు వింటానికి రాలేదు. ఆ సంగతి వదిలేసి మన విషయానికి వద్దాం. నువ్వు నాతో హైదరాబాద్ వచ్చేసినా సరే! పోనీ నీకలా యిష్టం లేకపోతే నేనే అప్పుడప్పుడు యిక్కడికి వస్తూంటాను. ఎలాగైనా నువ్వు నాకు కావాలి. నువ్విలా మాధవ్ యింట్లోవుండటానికి వీల్లేదు."

"నువ్వెవరు చెప్పటానికి?–"

"నేనెవర్నా?–" క్షణంసేపు ఆగి "నీ జీవితంలో వున్న భయంకరమైన రహస్యం ఒకటి నా చేతిలో వుంది."

"బెదిరిస్తున్నావా?–"

"ఉహూ. నామాటవిని నా దానివి కమ్మని బ్రతిమలాడుతున్నాను. నువ్విలా మాధవ్‌తో వంటరిగా వుంటున్నావని తెలిస్తే మా ఆవిడ ఒక్కక్షణం కూడా

★ మిలిటరీ హోటల్ చాలా రష్‌గా ఉన్న సమయంలో కోడి కూర్మాలోకి ఫోర్క్ గుచ్చి ఎత్తితే – పెద్ద ఎలిక వొచ్చింది. ఆ అతిథి దాన్ని ఎత్తి ఊపుతూ నలుగురికీ చూపి గోల చేసేందుకు సిద్ధపడుతూన్న సమయంలో సర్వర్ పక్కనే ఉండి తగ్గు స్థాయిలో—"దాన్ని పైకిలాగి ఊపుతూ గొడవ చెయ్యకండి. మిగతా అతిథు లందరూ తమ 'కది వొడ్డించ లేదని ఫిర్యాదుచేస్తే హోటల్‌లో స్టాకులేదు. మీకు బిల్లులో ఆ ఎలిక్కి చార్జి చెయ్యములెండి!"

నిద్రపోము. తక్షణం వచ్చి నిన్ను మెడ బట్టి బైటికి గెంటితేకానీ పచ్చి మంచి నీళ్ళుకూడా ముట్టదు. అనవసరంగా యెందుకు అవమానం పొందుతావు ? ఆ బావామరదళ్ళ మధ్య నువ్వెందుకు అడ్డు వెళ్ళాలి ?—"

"నువ్వు తలుపు తీస్తావా తీయవా?"

"నేను తీయను. కావాలంటే నువ్వు వచ్చి తీసుకో ! నా కభ్యంతరంలేదు."

"నువు అడ్డంలే !—"

"అన్నీ నువ్వు చెప్పినట్టు వినాలని యెక్కడుంది ?—"

"అయితే నేనే తీస్తాను."

మరుక్షణంలో తలుపు తీయబోయిన శబ్దం, ఆవెంటనే "సంధ్యా నాసంధ్యా" అన్న భాస్కరం గొంతు, "ఛి-వదులు వదులు" అని సంధ్య పెనుగులాట, ఈ రెండింటి మధ్య 'సంధ్యా !' అన్న మాధవ్ కంఠం పురిమిన చప్పుడు, అతనిచెయ్యి పిడుగు పడ్డట్టు తలుపుని కొట్టటం అన్ని ఒక్కసారి కలగాపులగంగా జరిగిపోయినాయి.

గదిలో హఠాత్తుగా నిశ్శబ్దం యేర్పడింది.

"సంధ్యా ! నిన్నే-తలుపుతీయ్-" మాధవు అరిచాడు. అతని ముఖంకూడా చెమటలు పట్టాయి,

వెంటనే తలుపులు తెరుచుకున్నాయి. తెరిచిన తలుపుల మధ్య చెదిరిపోయిన కళ్ళతో ఆయాస పడుతూ సంధ్య నిలబడింది. తనని చూడగానే సంధ్య కళ్లలో కన్పించిన భావం చూసి వెంటనే ముందుకు అడుగువేసి తన చేతుల్లో వాలిపోతుంది అనే అనుకున్నాడు. కాని సంధ్య యెంతో ప్రయత్నంమీదని గ్రహించుకుని గుమ్మం పట్టుకుని ఆగిపోయింది.

"హలో మాధవు ! యెప్పుడు రావటం ?" భాస్కరం నవ్వు తెచ్చిపెట్టుకుంటూ అన్నాడు. మాధవు వేలు పెట్టి బైటికి చూపిస్తూ "ఐదునిముషాల్లో నువ్వు యీ యింటి ఆవరణ దాటివెళ్ళిపోవాలి." అన్నాడు.

భాస్కరంకళ్ళు ఆశ్చర్యంతో పెద్దవైనాయి. కోపం తెచ్చిపెట్టుకుంటున్నట్టుగా "నువ్వింట్లో లేని సమయం చూసి నేనేమీ నీ వస్తువు యెత్తుకుపోటానికి రాలేదులే. సంధ్యా - నేను - పాతస్నేహితులం. యేం సంధ్యా ?-" అతనివాక్యం పూర్తికానేలేదు మాధవు కాలర్ పట్టి దగ్గరకులాగి గుమ్మంలో నుంచి బైటికితోస్తూ "గెటవుట్ రాస్కెల్" అన్నాడు. మాధవుకూడా వాక్యం పూర్తిచేయలేదు. భాస్కరం చెయ్యివచ్చి అతని చెంపమీద ఛెడేలుమంది. క్షణంలో సగంసేపు గదిలో భయంకరమైన నిశ్శబ్దం యేర్పడింది. అంతే. మరుక్షణంలో మాధవ్ ఒకడుగు ముందుకువేసి భాస్కరం షర్ట్ గుండెల దగ్గర పట్టుకున్నాడు. మొదట భాస్కరం ఆ చెంప యీ చెంప అదిరిపోయింది. తర్వాత మాధవ్ తోసిన తోపుకి వెళ్ళి గోడ దగ్గరగా పడ్డాడు. అత నెలాగో లేవబోతుంటే ఈ లోపల మాధవ్ వచ్చి పై పట్టుకుని పైకి లాగాడు. అతని కుడిచేయి పిడికిలిగా

మారి అతన్ని మళ్ళీ డొక్కల్లో ఆ ప్రక్క యీ ప్రక్క గుద్దింది. భాస్కరం కిందపడ్డాడు. కోపంతో వివేకం కోల్పోయిన మాధవ్ మళ్ళీ చేయి యెత్తాడు. కానీ అప్పటికే తేరుకున్న సంధ్య కెవ్వుమంటూ వచ్చి అతని యెత్తిన చేతిని బలవంతంగా దించేసి దాన్ని గట్టిగా పెనవేసుకుని పట్టుకుంది. ఊపిరి పీల్చుకోటానికి ఆగిన మాధవ్‌కి స్పృహ తెలిసి తను చేసిన పని గుర్తుకు వచ్చింది.

"మీరు-మీరు అతన్ని చంపేశారు" అంది సంధ్య యేడుస్తూ.

"ఏం లేదు" మాధవ్ సంధ్య చేతిని వదిలించుకుని వంట యింటి వైపు వెళ్ళాడు. అతను నీళ్ల గ్లాసులో తిరిగి వచ్చేసరికి సంధ్య మోకాళ్ల మీద కూర్చుని భాస్కరం భుజాలు పట్టి వూపుతూ "భాస్కర్-భాస్కర్" అంటోంది.

"కొద్దిగా నీళ్ళు తాగిస్తేసరి. అతనే సరి అవుతాడు-" తనుకూడా మోకాళ్ల మీద కూర్చునినీళ్ళు తాగించబోయాడు. సంధ్య అతనివైపు తీక్షణంగా చూసి అతనిచేతిలో గ్లాసుని విసురుగా లాక్కుంది. "భాస్కర్ ! భాస్కర్" అని మృదువుగా పిలుస్తూ యెలాగో నీళ్ళు తాగించింది. క్షణంసేపు సంధ్య వైపు, భాస్కరంవైపు మార్చి మార్చి చూసిన మాధవ్ తర్వాత మెల్లిగా అక్కడనుంచి లేచి వెళ్ళిపోయాడు. అతనినాలిక కూడా పొడారిపోయింది. అతనికికూడా దాహం వేస్తోంది.

వంటయింట్లో మంచినీళ్ళు తాగిన వెంటనే అతనుబైటికి రాలేకపోయాడు. చెప్పలేనంత నీరసం, తనమీద తనకే అర్థంలేని కోపం, తనబలహీనతకి సిగ్గు అన్ని కలిగాయి.

అతనుతిరిగి వచ్చేసరికి భాస్కరం లేచి సంధ్య సాయంతో హాల్లోకి వెడుతున్నాడు.

"భాస్కరం ! ఈ పూట యిక్కడ వుండిపోకూడదూ ?- ఎలా డ్రైవు చేస్తావు?-" సంధ్యబ్రతిమలాడుతోంది.

"ఇంకా యిక్కడా ?-" భాస్కరం సంధ్య చేతిని విదిలించి పారేసి తూలుతూ కారు దగ్గరికివెళ్ళి పోయాడు. మరో ఐదు నిముషాల్లో కారు వెళ్ళిపోయింది.

"డ్రైవర్ యింకా రానట్టున్నాడే!" అన్నాడు మాధవ్.

చివ్వున తిరిగిచూసిన సంధ్య కోపంతో,రోషంతోమండిపడుతూ"మీరు-మీరు యింతవరకూ ఒకందుకేసమర్థులు అనుకున్నాను. ఇప్పుడు తెలిసింది. అవసరం అయితే హత్య చేయటానికికూడా వెనుకాడరని-" అంది

"సంధ్యా ?-" వెనక్కి తగ్గినట్టు చూశాడు.

"భాస్కరం బ్రతికి బైట పడటం యివాళ నా అదృష్టం." సంధ్య విసురుగా లోపలికి వెళ్ళిపోయింది.

మాధవు అక్కడే నిలబడిపోయాడు చాలాసేపు.

ఆ సంఘటన ఫలితం ఈ రోజు సుధ వ్రాసిన ఉత్తరం. ఒక వేళ అన్నట్టుగానే సుధ వచ్చి యిక్కడ

యేదయినా గొడవచేస్తే! అతని పెదవులమీద కఠినమైన చిరునవ్వు కదిలింది. రానీ! వస్తే యింతపగకూ తెలియని సత్యం ఒకటి తెలుసుకుని వెడుతుంది.

“అయ్యగారేరి? — ఎక్కడున్నారు?—” అని బైట వినిపించటంతో కిటికీ దగ్గర చాలాసేపటినుంచి అలాగే నిలబడిపోయి ఆలోచిస్తున్న మాధవ్ వులిక్కిపడ్డాడు.

“గదిలో వున్నారు. యెందుకు?—” ఆయా జవాబు యిస్తూ ప్రశ్న కూడా వేసింది.

“కావాలి. పనుంది.” ఆదుర్దాగా అన్నాడు గోవిందు. మాధవ్ అప్పటికే గది గుమ్మంలోకి వస్తూ “యేమిటి గోవిందూ?” అని అడిగాడు.

గోవిందు బట్టలన్నీ దుమ్ము కొట్టుకుని వున్నాయి. ముఖంనిండా చెమటలు కారుతున్నాయి. మనిషి పరుగెత్తుకు వచ్చినట్టు ఆయాస పడుతూ రొప్పుతున్నాడు.

అతను మాధవ్‌ని చూడగానే “మీరు—మీరు — వెంటనే రావాలి. తూర్పు వీధిలో సాలెవాళ్ళు — కమ్మరివాళ్ళు కొట్టుకుంటున్నారు. పెద్ద దొమ్మీ జరిగేట్టుంది” అన్నాడు.

“ఎందుకు?- పద-పద—” మాధవు చెప్పులన్నా వేసుకోకుండా గోవిందుతో త్వరత్వరగా బైటికివెళ్ళిపోయాడు.

★ ★ ★


(సశేషం)

1. రాకెట్ ఎలా ఎగురుతుంది?

పక్షి ఎగురుతుంది. విమానం ఎగురుతుంది. హైడ్రోజన్‌తో నింపిన రబ్బరు బుడగ ఎగురుతుంది. కాని, ఇవి ఎగరడానికీ రాకెట్ ఎగరడానికీ చాలా భేదం ఉంది. మొదట చెప్పినవన్నీ గాలి ఉండడం వల్ల ఎగురగలుగుతున్నాయి. హైడ్రోజన్ గాలికన్న తేలిక. కనుక ఆ వాయువుతో నిండిన రబ్బరు బుడగ నీటిలో కర్రముక్కలాగ పైపైకి తేలిపోతుంది. పక్షి గాలికన్న బరువైనాని రెక్కలతో గాలిని కిందికి తోసి తాను పైకి ఎగురుతోంది. ప్రొపెల్లరులో గాలిని వెనుకకు తోసి, విమానం ముందుకీ, పైకి ఎగురుతోంది. వీటన్నింటికీ గాలికావాలి. శూన్యాకాశంలో ఎగరడం నీటికిచేతకాదు. ఒక్క రాకెట్టు మాత్రమే గాలి లేకపోయినా ఎగురుతుంది. ఇంకా మాట్లాడితే గాలి లేకపోతేనే బాగా ఎగురుతుంది.

భూమిని విడిచి పైపైకివెడితే వాతావరణం క్రమక్రమంగా పలుచనై, సుమారు 200 మైళ్ళు దాటేక ఇంక ఇంచుమించు గాలి అనేదే ఉండదు. ఈ విషయం గమనించని 15వ శతాబ్ది ఫ్రెంచి గ్రంథకర్తఒకడు చంద్రలోక ప్రయాణాన్ని వర్ణిస్తూ, హంసలు పూన్చిన విమానం ఎక్కి ఎగిరి వెళ్ళినట్లు కథ వ్రాశాడు. మరొకడు హైడ్రోజన్ నింపిన బుడగలు ఒంటికి కట్టుకుని ఎగిరి వెళ్ళినట్లు వ్రాశాడు. ఇటువంటి కథలు మనకీ ఉన్నాయి. రాజుగారి పెద్ద భార్య కొడుకు గండభేరుండ పక్షి రెక్కలమధ్య కూర్చుని, జై పరమేశ్వరా అని నక్షత్రలోకం చేరుకుని, అక్కడి రాజకుమార్తెను పెళ్ళాడి, అర్ధ రాజ్యమూ, కావడిపెట్టెడు రత్నాలూ మూట గట్టుకుని, కిందికి దిగివచ్చిన కథలు ఎన్ని వినలేదు?

ఒక్క అరమైలుకన్న ఎక్కువ ఎత్తు ఎగిరే పక్షులు లేవు. హైడ్రోజన్ బుడగలు 15 మైళ్ళ ఎత్తు ఎగురుతాయేమో మహా అయితే. పదిమైళ్ళకన్న



ఎత్తు ఎగరగల విమానాలు మనకు లేవు. రెండున్నర లక్షల మైళ్ల దూరంలో ఉన్న చంద్రమండలానికీ, అనేకకోట్ల మైళ్ల దూరాలలో ఉన్న ఇతర గ్రహాలకూ, కోటాన కోట్ల మైళ్ల దూరాలలో ఉన్న నక్షత్రాలకూ ఈ బుడగలను, పక్షులనూ నమ్ముకుని వెళ్లడం ఎంత హాస్యాస్పదం!

గాలి ఏమీ లేని శూన్యాకాశంలో ప్రయాణం చేయగల సాధనం రాకెట్టు తప్ప మరొకటి లేదు. రాకెట్ట రహస్యం తెలిస్తే తప్ప గ్రహాంతర నక్షత్రాంతరయానాలు అసంభవం.


ఇంతకీ రాకెట్లు ఎలా ఎగురుతాయి? ప్రతి దీపావళికీ తారాజువ్వలు దట్టించి పోటీలు పడి వదులుతూ ఉండడం వల్లె టూళ్లన్నిటా మామూలే. అయినా తారాజువ్వ ఎల్లా ఎగురుతోందన్న ప్రశ్న సాధారణంగా ఉదయించదు. జువ్వకీ రాకెట్టుకీ చిన్నా పెద్దా తేడా తప్పించి సిద్ధాంతంలోభేదమేమీ లేదు.

..! దీపావళి నాడు విష్ణుచక్రాలు చూచి సంబరపడని పిల్లకాయ లుండరు, అవి పువ్వులు విరజిమ్ముతూ, గిరగిరా తిరుగుతూ ఉంటే సంతోషించడమే కాని, అది అలా ఎందుకు తిరుగుతోందన్న జిజ్ఞాస తక్కువ. ఒకవేళ ఎవరైనా అడిగినా పెద్దలు విసుక్కుంటారే తప్ప సరియైన సమాధానం ఇవ్వరు.


పార్కులలో నీళ్ళు విరజిమ్ముతూ గిరగిరా తిరిగే నీటి గొట్టాలు — జడ్ ఆకారంలోఉండేవి, చూచేవుంటారు. ఆ గొట్టం అల్లా ఎందుకు తిరుగుతుంది?

నీళ్ళల్లో చిన్న బల్లచెక్క తేలుతోంది. దానిమీద ఒక కప్ప కుదురుగా కూర్చుని ఉంది. అంతలో దగ్గరలో ఒక పురుగు ఎగురుతూ కనిపించింది. కప్ప తపస్సు చాలించి చటుక్కున ఎగిరి ఆ పురుగును అందుకుంది. కప్ప ఎగరగానే అది కూర్చున్న బల్ల చెక్క వెనక్కి తూలి జరిగిపోయింది. ఇంతకీ ఆ బల్లచెక్క వెనక్కి ఎందుకు వెళ్ళిందీ? కప్ప తన కాళ్ళతో తోసేసింది కనుకనా? తోయకుండా జాగ్రత్తగా ఎగిరితే అప్పుడేమవుతుంది? ఏమీ అవదు. బల్ల కదలకుండా కప్ప అక్కడినుంచి ఎగురనేలేదు!





ఒడ్డుకు పట్టించిన నావలో నుంచి గట్టుమీదికి దూకినప్పుడు నావ వెనక్కి జరిగి పోవడం మనకందరకూ అనుభవమే.



"నావ కదలకుండా ఒడ్డుకు దూక లేవు" అని ఎంత డబ్బు అయినా పందెం కట్టవచ్చు. ఓడిపోతామనే భయం అక్కరలేదు.

సైనికు లందరికీ అనుభవంలో ఉన్న విషయం ఒకటి ఉంది. ఫిరంగి పేల్చినప్పుడు గుండు ఎదరకు వెడు తుంది. ఫిరంగి వెనక్కి దొర్లుతుంది.

అతి పరిచయంవల్ల ఈ ఉదాహరణ లన్నీ సర్వసామాన్యమైనవిగా, అను మానాలకు తావు లేనివిగా కనబడ తాయి. కాని, వీటిలోనే రాకెట్ల రహస్యం అంతా ఇమిడి ఉంది! ఈ సంగతి మొట్టమొదట గ్రహించిన వాడు న్యూటన్. భౌతికశాస్త్ర పితా మహుడు ఆయన. ప్రపంచంలో నిరంతరమూ జరిగిపోయే వస్తువుల కదలికలు, వేగాలు, వాటిమీద పని చేసే శక్తులు — అన్నీ పరిశీలించి, అంతటిని 'కట్టె కొట్టె తెచ్చె' అన్నట్లు మూడే మూడు పొడిపొడి మాటలలో తేల్చేశాడు. వాటిలో మూడవదే ఇప్పుడు మనకు కావలసినది: "ప్రతి ఒక్క క్రియకూ 'ప్రతి క్రియ' ఎప్పుడూ ఉండనే ఉంటుంది. క్రియ, ప్రతి క్రియ ఒకదాని కొకటి సరిసమానం. కాని అవి రెండూ పరస్పర వ్యతిరేక దిశలలో పని చేస్తాయి." ఇదీ ఆయన చెప్పిన మూడవ సిద్ధాంతం. చూస్తే దీనికి రాకెట్టు ఎగరడానికీ సంబంధం ఏమిటనిపిస్తుంది. కాని, ఉన్నదంతా సంబంధమే.

పిడికిలి బిగించి బల్లమీద గుద్దుతే, బల్ల పిడికిలిని సరిగ్గా అంతే బలంతో విరోధిస్తుంది. అందుకే నీ చెయ్యి నెప్పెడుతుంది. ఇందులో బల్లను కొట్టడం క్రియ. బల్ల నీ చేతిని విరో ధించడం ప్రతిక్రియ. ఈ రెండూ సమానం అంటుంది ఈ సిద్ధాంతం.

బల్లమీద కూర్చున్న కప్ప పైకి ఎగరాలంటే కాళ్ళను తన్నిపెట్టి బల్లను వెనుకకు తొయ్యాలి. అప్పుడు బల్లకూడా కప్పను అంతే శక్తితో ముందుకు తోస్తుంది. కనుక,

కప్ప ముందుకీ బల్లవెనక్కు వెడతాయి. బల్లబరువూ, కప్పబరువూ సరిసమానమైతే, కప్ప ఎంతవేగంతో ముందుకు ఎగిరితే, బల్లకూడా అదే వేగంతో వెనక్కు జరుగుతుంది. (నీళ్ళు బల్లను నిరోధించకపోతే సుమా!) బల్లబరువు ఎక్కువైన కొద్దీ వెనక్కి జరిగేవేగం తక్కువైపోతుంది. కాని, క్రియ, ప్రతిక్రియమాత్రం ఎల్లప్పుడూ సమానమే.


విష్ణుచక్రంలో ఒకకొసను వత్తిలోనుంచి రవ్వలు విసురుగా బయటికి వస్తాయి. రవ్వలను బయటికి తోసిన శక్తికి ప్రతిశక్తి ఉంటే అదివత్తిని వెనుకకు తోస్తుంది. కనుక రవ్వలకు వ్యతిరేక దిశలో చక్రం తిరుగుతుంది. "పార్కు"లో నీళ్లు చల్లే యంత్రం అచ్చంగా విష్ణుచక్రం లాంటిదే.

ఫిరంగి పేలినప్పుడు గుండు ముందుకి పోతుంది. గుండును ముందుకి గెంటిన శక్తికి సరిసమానమైన ప్రతిశక్తి ఫిరంగిని వెనుకకు తోస్తుంది. గుండుకన్న ఫిరంగిబరువు చాలారెట్లు అధికం కనుక గుండు మైలు దూరం వెళ్ళి పడితే, ఫిరంగి రెండుగజాలు మాత్రమే వెనుకకు జరుగుతుంది.

ఫిరంగిలోనుంచి గుళ్ళు ఆగిపోకుండా ఒకదాని వెనుక ఒకటిగా బయటికి వస్తున్నా యనుకుందాం మాటవరసకి. ప్రతి గుండుకీ ఒక్కొక్క కుదుపుతో ఫిరంగి వెనక్కి వెనక్కి అంతకంతకు హెచ్చిన వేగంతో పరుగెడుతుంది (భూమితోడి ఘర్షణ లేకపోతే.) సరిగ్గా రాకెట్టులోనూ ఇదే జరుగుతోంది. ఫిరంగి గుళ్ళకు బదులు రాకెట్టులోనుంచి మండిన వాయువుల అణువులు కోటానకోట్ల సంఖ్యలో వేలకొద్దీ మైళ్ళ వేగంతో బయటికి పుంఖాను పుంఖంగా వస్తూ ఉంటాయి. వెనుకకు జరిగే ఫిరంగిలాగే రాకెట్టు కూడా "ప్రతిక్రియ"వల్ల రవ్వలకు వ్యతిరేక దిశలో క్రమక్రమంగా వేగం పుంజుకుని ప్రయాణం చేస్తుంది. రాకెట్టులోనుంచి మండిన వాయువులు బయటికి వస్తూ ఉన్నంత కాలం రాకెట్టు వేగం వృద్ధి అవుతూనే ఉంటుంది. లోపల ఇంధనం పూర్తిగా ఖర్చు అయిపోయాక ఇంక వేగం వృద్ధికాదు.

పక్షులూ, విమానాలలాగ రాకెట్టు తన గమనానికి చుట్టూ ఉన్న గాలిని ఉపయోగించుకోదు. రాకెట్టు గమనానికి గాలి ఒక ఆటంకం మాత్రమే. గాలే కనుక లేకపోతే నిరాఘాటంగా వేగం తగ్గకుండా ప్రయాణం చేస్తుంది. సరిగ్గా ఈకారణం చేతనే భూవాతావరణాన్ని విడిచిపెట్టి అంతరిక్షంలోకి ప్రయాణం చెయ్యాలంటే తగిన వాహనం రాకెట్టు తప్ప మరొకటి లేదు.

"కారణం ఇదీ" అని సరిగా అర్థం కాకపోయినా బహుకాలం క్రిందటే మానవుడు ఈ "ప్రతిక్రియ"ను గమనించాడు. క్రీ. పూ. 53వ సం॥లో హెరోన్ అనే గ్రీకు విజ్ఞాని ఒక సాధ




నాన్ని తయారు చేశాడు. కిందనున్న కాగులో నీళ్ళు మరిగి ఆవిరి(బొమ్మతో చూడు) 1-1 అనే గొట్టాలలోనుంచి పైనున్న బంతిలో ప్రవేశించి, అక్కడి నుంచి 2-2 అనే యప్ గొట్టాలలో నుంచి విసురుగా బయటికి వచ్చేస్తుంది.


అప్పుడు ప్రతిక్రియవల్ల బంతి 1-1అనే గొట్టాలున్న ఇరుసుమీద గిరగిరా తిరుగుతుంది. దాని అంతట అదే గిరగిరా తిరిగే ఈ వస్తువు ఆకాలంలో బహు విచిత్రమైనదే. ఇది వట్టి ఆట వస్తువుగానే మిగిలిపోయింది.

12వ శతాబ్దంలో ఈ ప్రతిక్రియా సిద్ధాంతాన్ని యుద్ధరంగంలో ప్రప్రథమంగా వాడుకచేసినవారు చైనీయులు.



"నూ—చింకి-త్సుంగ్-తావ్" అనే గ్రంథంలో తారాజువ్వలు. వాటిలో






వాడే మందుల పాళ్లు, వాటిని శత్రువులమీద ప్రయోగించే విధానం — వగైరా వివరాలన్నీ అందులో ఉన్నాయి.


1230 లో "హసన్ అల్రమా" అనే అరబ్బు ఆసామీ తాబేటి బుర్ర ఆకారంలో రాకెట్టును తయారుచేసి, యుద్ధంలో శత్రువుల గుర్రాలను చెదరగొట్టి చెల్లా చెదరుచేసే పద్ధతిని వర్ణించాడు.

1400 లో "జోన్స్-డి-ఫంతానా" అనే ఇటలీ దేశస్థుడు శత్రువుల



ఓడలకు రంధ్రాలు పొడిచి, నిప్పు అంటించ గలిగిన రాకెట్ టార్పెడో లను గురించి వివరించాడు.


"లియనార్డో డా విన్సీ" అనే ప్రసిద్ధ ఇటాలియన్ శాస్త్రజ్ఞుడు శత్రు సేనా వాహినులను చిందర వందరచేసే అగ్ని చక్రం ఒకటి తయారు చేశాడు.





దానిని వెలిగించి వదిలితే తనంతన తాను దొర్లుకుంటూ వెళ్ళి శత్రువులను అల్లకల్లోల పరిచేదిట.

బ్రిటిష్ వాళ్ళు 1760 లో శ్రీరంగ పట్టణాన్ని ముట్టడించినప్పుడు రాకెట్ల ప్రయోగంలో ఆరితేరిన 1200 మంది సైనికులకు హైదర్ అలీ స్వయంగా నాయకత్వం వహించి బ్రిటిష్ అశ్విక సైన్యాలను హడలగొట్టి తరిమివేశాడు.

జెట్ విమానాలు రాకెట్లకు బహు దగ్గర బంధువులు. జెట్ ఇంజను ముందరినుంచి వాతావరణంలోని గాలిని పీల్చుకుని, దానినే వెనుకనుంచి బహు శక్తివంతంగా విడిచి పెడుతుంది. ప్రతి క్రియవల్ల ముందుకి వెడుతుంది. దీని ఇంజనులో పెట్రోలు మండడానికి కావలసిన అక్సిజన్ గాలిలోనుంచే తీసు







కుంటుంది. కనుక జెట్ విమానం గాలి లేనిచోట ప్రయాణం చెయ్యలేదు. అదే రాకెట్టు అయితే లోపలి ఇంధనం మండడానికి కావలసిన ఆక్సిజను అంతా లోపలే నిలువ చేసుకుంటుంది. ఇంధనం-మండగా మిగిలిన వాయువులే బయటికి వచ్చేస్తాయి. కనుక దానికి వాతావరణంతో పనేమీలేదు, కాళ్ళకు బంధాలు తప్ప.


తాను కనుక ఇంత గొప్ప రాకెట్టు అనే సాధనాన్ని కనిపెట్టగలిగానని మానవుడు గర్వపడవలసిన పని ఏమీలేదు; ప్రకృతిలో ఈ ప్రతిక్రియ సిద్ధాంతాన్ని ఉపయోగించుకుని ప్రయాణం చేసే జంతువు ఒకటి ఉంది. అది అట్లాంటిక్ మధ్యధరా సముద్రాలలో ఉంటుంది. "ఆక్టపస్" అనబడే ఎనిమిది కాళ్ళ (లేక ఎనిమిది చేతుల) జంతువుకి ఇది స్వయానా పెత్తల్లి కూతురు. "ఇది "లోలిగో" అనబడే "స్క్విడ్" జాతిలోనిది. దీనికి ఎనిమిది కాళ్ళు, రెండు పొడుగుపాటి చేతులు, వాటి మధ్యలో నోరు ఉన్నాయి. ఈ జంతువు నీటిని పీల్చుకుని ఉఫ్‌మని బయటికి వేగంగావిడిచిపెడుతుంది. పైన చెప్పిన ప్రతి క్రియ సిద్ధాంతాన్ని అనుసరించి ఆ నీటిధారకు వ్యతిరేకదిశలో కదులుతుంది. ఈ విధంగా నీటిని విడుస్తూ ఈ జంతువు బహువేగంగా ప్రయాణం చేస్తుంది.

—డాక్టరు మహీధర్ నళినీమోహన్

***

"ఎప్పుడూ లేనిది గుళ్ళోకెళ్ళి వొస్తున్నావు! దేవుణ్ణి ఏం వరాలడిగావూ ?"

"భార్యకు చాలా జబ్బుగా వుంది; పెద్దవాడు చెట్టుమీదినుంచి పడి, చెయ్యి విరగ్గొట్టుకున్నాడు; అప్పులవాళ్ళు కోర్టులకు యీడుస్తున్నారు.... ఈ కష్టాలన్నిటికీ అలవడిన యీ సమయంలోనే మరేవైనా కష్టాలు నా కోసం ప్రత్యేకించబడి ఉంటే, వాటిని వెంట వెంటనే పంపమని దేవుణ్ణి వేడుకొని వొచ్చాను."



ప్రవృద్ధి ప్రమోషనులకు తగిన అర్హులే వారు, హెర్క్యులిస్ దాని స్వంతదారుడుకూడా ఇన్ని సంవత్సరాలు శ్రమకోర్చి పనిచేసినందుకు. మీరు హెర్క్యులిస్ కొన్నారంటే అది మీ నిత్యజీవితపు భాగస్వామి అయిపోతుంది. ఏళ్లు గడిచిపోతూన్న కొద్దీ జీవితంలో పరిస్థితులు మారిపోతాయి... ఉద్యోగంలో అభివృద్ధులు లభిస్తాయి...మీ పిల్లలు పెరిగి పెద్దవారౌతారు పెళ్లిచేసుకొని వేరేచోట కాపురం పెడతారు. కాని మీ హెర్క్యులిస్ ఎప్పుడూ మీదగ్గరే మంచి పరిస్థితులలోనే ఉంటుంది.

హెర్క్యులిస్

సైకిల్‌కంటె ఎక్కువైనది—
జీవితకాలపు నేస్తము

టి. ఐ. సైకిల్స్ ఆఫ్ ఇండియా, అంబత్తూరు, మద్రాసు-53
ప్రొప్రైటర్లు : ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, మద్రాసు-1.

JWT/TIC/H/2951

అద్దం వెనుక

విజయభార్గవి

ఆకాశంలో వున్న తారల నన్నింటినీ కోసి మాలగా కూర్చి బంగళా అలంకరించినట్టుగా వున్నది. బంగళా ముందున్న పెద్ద కొబ్బరి తోటలో ప్రతి చెట్టుమీదా తారలు వేళ్ళాడుతున్నాయి. గేటునుంచి తోటలోకి వున్న దారి కిరుప్రక్కలా పూల మొక్కలు రంగు రంగు బల్బులను విరగ బూసినయి. పెళ్ళికి బంగళా యజమాని ట్యూబులైట్లతో ప్రహరీ కట్టించాడు.

నారాయణమూర్తికి కళ్ళు జిగేలుమన్నాయి. "హొచ్చావా పంతులూ! రారా!" మాధవరావుగారు ఆహ్వానించేరు.

నారాయణమూర్తి మంద హాసం చేసేడు. చేతులు కట్టుకోబోయి వేళ్ళు నలుపుకున్నాడు. గుండె అదురుతోంది ఓవైపు. కాళ్ళు తడబడ్డాయి. గేటుదాటి లోపలికి వెళ్ళడం పెద్దతప్పుగా అనిపించింది నారాయణ మూర్తికి.

"అలా వెళ్ళి కూర్చోపంతులూ!.... సందేహిస్తున్నావేం?" బలవంత పరిచేడాయన.

నారాయణమూర్తికి అడుగు కదపక తప్పిందికాదు. తోటలో దీపాల వెలుగుతో జనం కొత్త బట్టల్లో, ఇస్త్రీ చెరగని బట్టల్లో హడావుడిగా తిరుగుతున్నారు. తోటంతా డబ్బుతో ప్రకాశిస్తోంది.

గేటుదాటి లోపలికి రాంగానే ఆ డబ్బులో కలిసిపోవాలనీ ఆడబ్బులో కూర్చోవాలనీ అనిపించింది. తను వేసుకున్న గళ్ళచొక్కా, పంచా ఆపెళ్ళివెలుగులో కొత్తవిగా కనిపించేయి నారాయణమూర్తికి. గర్వంగా ఓసారి అందరిమీదకూ చూపులు తిప్పి ముందుకి కదిలేడు. మంటపానికి చుట్టూతా వందల కుర్చీలు వరుసగా ఆక్రమించుకుని కూర్చున్నారు అతిథులు. అక్కడక్కడా ఒకటీ రెండూ కుర్చీలు ఖాళీగా వున్నాయి. ముందు వరుసలో సోఫాలన్నీ ఖాళీగానే వున్నాయి. నారాయణమూర్తికి అక్కడ కూర్చోవా లనిపించింది. అలవాటున్న వాడికిమల్లే వెళ్ళి కూర్చుందామని ప్రయత్నించేడు. అయినా ఆ అలవాటులేని తనం తన నడకలో బాగా కనిపించింది. ఆ సోఫాలో కూర్చోవడం కూడా గొప్పే అనుకున్నాడు. రేపు తను వెళ్ళి స్నేహితులతో చెప్పుకోవచ్చు—తన ఈ అనుభవాన్నీ, అనుభూతినీ.

నారాయణమూర్తి ఒసారి సంతృప్తిగా నిట్టూర్చి వెనక్కి జేరగిలబడి తల ఆన్చేడు. తనేదో పోయిన జన్మలో పుణ్యం చేసుకుని వుండాలనీ, అందుకే



తన కుటుంబంలో ఎవరికీ కలగని అదృష్టం తనకి లభించిందనీ అనుకున్నాడు.

నిజానికి తన్నెన్నిసార్లు ఇలాంటి అనుభవాలని కలల్లో అనుభవించాలని ప్రయత్నించేడు. తన నలభయ్యేళ్ళ జీవితంలోని కలల్లో లభించనిది తానీనాడు ప్రత్యక్షంగా అనుభవిస్తున్నాడూ అంటే....తనదెంత అదృష్టం ??

ఉన్నట్లుండి మేళం వినిపించింది.



నారాయణమూర్తి ఉలిక్కిపడి కళ్ళు తెరచి చూసేడు .... బంగళాముందు కార్లోంచి పెళ్ళికొడుకు దిగేడు మెరుస్తూన్న బట్టల్తో. పెళ్ళికొడుకుని సాదరంగా లోపలకి ఆహ్వానించేడు మామగారు. సందడి హెచ్చింది. పెళ్ళికొడుకుని మంటపంలో కూర్చోబెట్టేరు. పెళ్ళి సంరంభం మొదలైంది. పెళ్ళికొడుకు చుట్టాలూ, తల్లీ దండ్రీ మంటపం చుట్టూతా నిలిచేరు. పెళ్ళికూతురిని తెచ్చి పీటలమీద కూర్చోబెట్టేరు.

ఇదంతా నారాయణమూర్తి చూసేడన్న మాటేగాని అతని మనస్సిక్కడ నిలవలేదు. ఇందాకటిలా అతని మనస్సు డబ్బులో కలవక వెనక్కి మళ్ళి గేటుదాటి యింటివేపు వెళ్ళింది.

ఇంట్లో పరిస్థితులు గుర్తు కొచ్చేయి నారాయణమూర్తికి. వసారాలో కండలేక బొమికలాకారాల్తో ఆడుకొంటూన్న పిల్లలూ, ఇంట్లో నులకమంచంమీద జీవచ్ఛవంలా పడివున్న భార్య రవణమ్మా, వంటింట్లో కట్టెలేక పొగతో బాధపడుతూన్న చిన్న కూతురు జానకీ గుర్తు కొచ్చేరు. అప్రయత్నంగానే కళ్ళనీళ్ళు తుడిచే యాతని చేతివేళ్ళు. ఇంటి విషయాలు గుర్తుకు వచ్చినప్పుడల్లా కళ్ళనీళ్ళు తుడవడం ఆ చేతికి బాగా అలవాటయిపోయింది. బలవంతాన నారాయణమూర్తి తన మనస్సుని పెళ్ళిమీదకు లగ్నం చేసేడు.

పురోహితులు మంత్రాలు చదివేస్తున్నారు. పెళ్ళికూతురూ, పెళ్ళికొడుకూ వాగ్దానాలు చేసుకోవటం విన్నాడు నారాయణమూర్తి. పిచ్చిగా ఓసారి నవ్వేడు. అతను నవ్వాలనే నవ్వేడు.

'ఎంతమంది ఈ వాగ్దానాలకీ, మాటలకీ నిలబడుతున్నారు?' అనే ప్రశ్న నారాయణమూర్తి ఎదర నించుంది.

తన పెద్ద కూతురు సీతని పెళ్ళాడుతూ. నలుగురు పెద్దలున్న పెళ్ళిమంటపంలో, బ్రాహ్మల సమక్షంలో— జీవితంలో ఏ సందర్భంలోనూ భార్యని దూరం చేసుకోననీ విడవననీ వాడూ వాగ్దానం చేసేడు. వాడంటే సీతకి మొగుడు వాడి పేరం టేనే నారాయణమూర్తికి పరమ అసహ్యం. సీతని పెళ్ళాడిన మరుక్షణం కట్నంకాకుండా కానుకలేవీ సంతృప్తికరంగా పెట్టలేదని వాడు సీతని అష్టకష్టాలూ పెట్టేడు. సరిగ్గా ఏలుకోలేదు. అందుకే అది' ఆ సీత తనకోసం తన తండ్రి బాధపడటం యిష్టపడక తను బాధపడింది. తన చావుతోనయినా తన భర్త మారుతాడనుకున్నది. కాని అది ఉత్తి అనుకోవడమే అయిపోయింది. అది చచ్చిపోయింది, వాడుమారలేదు. సీత చనిపోవడానిక్కారణం ఒకరకంగా ముఖ్యంగా డబ్బే అయ్యింది. అందుకో్కపం వచ్చిందప్పుడు నారాయణమూర్తికి. అప్పుడే అతనికి డబ్బుమీద విపరీతమయిన ఏహ్యత పుట్టింది. అంతకుపూర్వం కాస్తోకూస్తో డబ్బుకోసం కక్కుర్తి పడ్డేవాడు. డబ్బులు పుచ్చుకుని మార్కులు వేయటం లాంటివి చేసేవాడు.

ఇప్పుడది మానేడు,

సీతంటే నారాయణమూర్తికీ, అతని

భార్యకీ చాలా ప్రేమ. సీత చచ్చిపోవడంతో రవణమ్మ మంచానికి దగ్గరయ్యింది అలా దగ్గరయి ఇంతవరకూ దూరమవలేదు.

నారాయణమూర్తికి మాధవరావుగారు తన కూతురుపెళ్ళికి పిలవడం గుర్తుకువచ్చింది. 'ఆయనకేం? దేవుడు తరగని ఆస్తి. దేశంలో గొప్పపేరు.'

"పిల్లవాడు ఏం చదివాడు బాబు!" మాధవరావుగారిని తనడిగేడు,

"డాక్టరీ చేస్తున్నాడు అమెరికాలో. బెజవాడ సమ్మంధం. ఉద్యోగం కూడా అమెరికాలోనే చేస్తాట్ట." మీసాల్ని మెలిబెట్టి జవాబిచ్చేరు మాధవరావుగారు.

'ఇంతకీ పిల్ల అదృష్టవంతురాలు' అందామనుకుని ఆగిపోయేడు నారాయణమూర్తి. ఇందులో పిల్ల అదృష్టం ఏమీ కనిపించలేదతనికి.

పురోహితులు మంత్రాలు పల్లిస్తున్నారు. వచ్చిన జనం చేతుల్లో అక్షింతల్ని తమముతుంటున్నారు. కొంతమంది కూల్‌డ్రింక్స్ సప్లయి చేస్తున్నారు. నారాయణమూర్తి ఒకటి అందుకున్నాడు. స్ట్రా నోట్లో పెట్టుకుని కళ్ళు తిప్పేడు. జనంవేపు తిరిగిన అతని కళ్ళు ఓ చోట నిలబడి పోయినయి. అందరివేపూ చూసి సంతృప్తి పడ్డాడు. అందరి చూపుల్నీ ఆకట్టుకున్న ఆవిడని చూస్తూ డ్రింకు పుచ్చుకోవటం మరిచిపోయేడు. చెవులకి రత్నాల దుద్దులూ, చేతికి రవ్వల గాజులూ, వేళ్ళకి ఉంగరాలూ, తలలో డిజైన్ చేసిన బిళ్ళా, మెళ్ళో రాళ్ళు పొదిగిన బంగారు నెక్లెసూ తళతళ మెరుస్తున్నాయి. మనిషి అంత అందగత్తె కాకపోయినా దేవకన్యలా మెరిసిపోతోంది—ఆ నగల్తో, దుస్తుల్తో. అందరితోనూ మాట్లాడుతోంది—చనువుగా. ఏ మాత్రం పరిచయం వున్నా వెళ్ళి విష్‌చేసి మాట్లాడుతున్నారు కొందరు. పెళ్ళికి వచ్చిన అందరి ఆడాళ్ళలోకీ ఆధునికంగా, బాగా డబ్బున్న దానిలా కనిపిస్తోంది.

'ఒట్టి ఆవిడమీదున్న నగలే ఓ లక్ష రూపాయిలు విలువ చేస్తాయి' తెలిసినవాడికిమల్లే వాటి విలువ చెప్పుకున్నాడు—నారాయణమూర్తి. అతని కళ్ళు మిరుమిట్లు గొలిపేయి. ఆవిడమీదనుండి చూపులు తిప్పుకోలేకపోయేడు.

'ఇందుగల డందు లేడను సందేహము వలదు — అందరి హృదయాల్లోనూ ఆవిడ రూపమేనిలిచిపోయింది' అనుకున్నాడు నారాయణమూర్తి.

★ "ఇవాళ ఏూ ఆయన కోటుమీద లిప్‌స్టిక్ మరకలు కనిపించగా ఎవరివని నిలదీసి అడిగాను. అవి లిప్‌స్టిక్ మరకలు కావనీ. టొమాటో జ్యూస్ మరకలనీ దబాయించారు.. నీ వైతే ఏం చేస్తావు ?"

"ఆ టొమాటో ఎవరో కనుక్కుంటాను." అన్నది ఆమె స్నేహితురాలు

ఆమె మెడలోవున్న నెక్లెసుమీదే అతని చూపులు నిలిచేయి. ఎంత మరల్చు కుందామనుకున్నా ఓడిపోయాడు.

'ఆ ఒక్క నెక్లెసు తనకిస్తే? అబ్బ... ఊహించుకో గూడదు గాని ఎంత మార్పువస్తుంది తనలో! — తన కుటుంబంలో!' అనుకున్నాడు.

ఆ మధ్య నారాయణమూర్తి కష్ట పడి సంపాదించి చిన్నపిల్ల ముచ్చట పడితే ఓ ముక్కు పుడక చేయించాడు. అదీ పదోక్లాసు కుర్రాడికి లెక్కల్లోకి నాలుగుమార్కులు తక్కువొస్తే పాస్ చేసి సంపాదించిన నలభయి రూపాయి లతో. దాన్చూసి అందరూ నకిలీ దన్నారే తప్ప ఒక్కరయినా 'ఓహో!' అని అనలేదు.

'అవును. ఎందుకంటారు?' లోలో పలే గొణుక్కున్నాడు నారాయణ మూర్తి.

పెళ్ళికొడుకు పుస్తె కట్టడం పూర్తి చేసేడు. అందరూ అక్షింతలు జల్లేరు. నారాయణమూర్తీ చేయెత్తేడు. తన చేతిలో డ్రింకు సీసానే కనిపించిం దతనికి. చిన్నగా లోలోపలే నవ్వు కున్నాడు. తన గళ్ళ చొక్కా సరి చేసుకున్నాడు మడతలు లేకుండా.

ఒక్కొక్కళ్ళే వచ్చి మంటపంలో ఓ మూల కూర్చున్న పెద్దమనిషి దగ్గర కానుకలు చదివిస్తున్నారు. చదివిస్తున్న ప్రతివాడూ చిన్నదో, పెద్దదో ఒక కవ రందిస్తున్నాడు. అందులో పదులో, వందలో, వేలో వుండి వుంటాయి. వాటిలో ఎంతుందో ఒకడు తెరిచి లెఖ్ఖపెట్టి మరీ చెబు తున్నాడు. మరొకడు నోటు పుస్త కంలో రాసుకుంటున్నాడు.

'వాటిల్లో ఒక కవరు ఇలా ఇస్తే...' అనుకున్నాడు. నారాయణమూర్తి. అను కోంగానే అతనికి యిందాకటి ఆమె గుర్తుకి వచ్చింది. తలతిప్పి ఆ వేయి మందిలోనూ వెదికేడు. ఆవిడకనిపించ లేదు. నారాయణమూర్తికి మనసు నిల కడగా లేదు. మళ్ళీవెళ్ళి మంటపంలోకి చూసేడు. చటుక్కున గుర్తుకువచ్చింది. 'అసలు తనింతవరకు పెళ్ళి కొడుకుని సరిగ్గా చూడలేదని.

సోఫాలోంచి లేచేడు. డ్రింకు పూర్తిగా తాగేసి, మంటపం దగ్గరగా వెళ్ళి నుంచున్నాడు.

'ఫరవాలేదు బాగానే వున్నాడు. కాకపోతే కాస్తంత నలుపు. ఈయనకి అందరికన్నా డబ్బుబాగా వుండి వుంటుంది' అనుకున్నాడు నారాయణ మూర్తి. ఆలోచిస్తూ కదలబోయే దక్కణ్ణుంచి. ఆయన చూపు అతని ఆలోచనలకీ, కదలికకీ బ్రేకు వేసింది.

ఆమె...! ఆమె...పెళ్ళికొడుకుతో ఏదో మాట్లాడుతోంది "ఆవిడ పెళ్ళి కొడుకు చెల్లెలు" వెనకనుంచి నారా యణమూర్తి అడిగినట్టుగానే జవా బిచ్చేడు ఒకాయన.

"థాంక్స్!" అన్నాడు నారాయణ మూర్తి. అలా ఎందుకన్నాడో తెలిలే దతనికి.

ఇందాకటి తన ఆలోచనలని మళ్ళీ గుర్తులోకి తెచ్చుకున్నాడు. ఆలోచనల

అందాన్ని ఇంతమందిలో కూర్చుని అనుభవించటం కంటే ఏ మారుమూలో ప్రశాంతంగా వుండే చోటున కూర్చుంటే బాగుంటుం దనుకుని, ఆ కొబ్బరి తోటలో చివరికంటా పోయి కోనేరుగట్టు ప్రక్కన సిమెంటు బెంచీమీద కూర్చున్నాడు — సంధడికీ, బాధకీ దూరంగా, ఆనందానికి దగ్గరగా. నారాయణమూర్తికి అతని ఆలోచనలు అమరలోకాన్ని చూపించేయి. పదిహేను నిమిషాల వాస్తవిక కాలంలో పదిహేను జన్మలకయినా మరపలేని ఊహా ప్రపంచాన్ని చూసేడు. అందుకే నారాయణమూర్తికి ఆలోచనల్లో జీవించడం యిష్టం.

అతని తల్లి తన చివరి రోజుల్లో నారాయణమూర్తిని కూర్చోబెట్టుకుని, "నారీ! మన వంశం బీదరికానికి పెట్టింది పేరు. ఈ విషయం నీ కెందుకు చెబుతున్నాననూ అంటే — చిన్నప్పట్నుంచీ చూస్తున్నా. నీకీ బీదరికంమీద సదభిప్రాయం లేదు. అప్పుడప్పుడూ ఈ దుస్థితికి దూరంగా పారిపోతున్నావు కూడా! ఇంకో మాట. నువ్వు అలా ప్రయత్నించినా ఎప్పుడూ ఓడిపోతావు జాగ్రత్త! అందుకే నీకు ఈ చెప్పడం. సుఖపడేందుకు ఎప్పుడూ ప్రయత్నించకు! జీవించడానికే ప్రయత్నిస్తావు కదూ?!...."

క్షణం ఆగి కాస్సేపు తీరుబడిగా దగ్గి అంది—

"ఇంక నీకేం చెప్పను?" అని.

ఆంతే, ఆ తరువాత ఆవిడ చచ్చిపోయింది.

ఆవిడ చెప్పింది నిజం అని ఒప్పుకున్నప్పటికీ, అల్లాంటి ప్రయత్నాలు చేయటం కూడా తప్పుకాదనిపించింది నారాయణమూర్తికి.

వాస్తవంగా అనుభవించలేకపోయినా నారాయణమూర్తి ఆలోచనల్లో సుఖాన్ని అనుభవించగలడు. తనలో ఆశక్తి ఉన్నందుకే ఎప్పుడూ ఆలోచిస్తూ వుంటాడతను.

నారాయణమూర్తి తన ఆలోచనల నాపుజేసి మంటపం వేపు కదిలేడు. ఆసరికి పెళ్ళి పూర్తయిపోయింది. వచ్చిన జనం పార్టీ ఏర్పాటుచేసిన షామియానాల్లోకి వెళ్ళుతున్నారు.

నారాయణమూర్తికి అప్పుడే వెళ్ళాలనిపించలేదు. కొంతమంది తోటలో

★ తల్లిపులి చెట్టుకింద విశ్రాంతి తీసుకుంటోంది. పిల్లపులి వేటగాణ్ని తరుముతోంది. వేటగాడు పిల్లపులికి అందకుండా చెట్టు చుట్టూ తిరుగుతున్నాడు.

తల్లిపులి: తినే తిండితో ఆట లాడరాదని నీకు ఎన్నిసార్లు చెప్పినా బుద్ధి లేదేం?

అక్కడక్కడా ఇంకా కూర్చునున్నారు. నారాయణమూర్తి సోఫాలవేపు కదల బోయి చటుక్కున ఆగిపోయాడు. కళ్ళు టపటప లాడించేడు. అంత చల్లగాలిలోనూ చెమటపట్టింది. మెరుస్తున్న వస్తువును చటుక్కున వంగి తీసుకున్నాడు. ఓసారి భయంగా చుట్టూ చూసేడు.

బోసిమెడతో మంటపం ప్రక్కనుంచి పెళ్ళికొడుకు చెల్లెలు తనవేపు వస్తున్నట్లు అనిపించింది. ఓసారి ఒళ్ళు తడుముకుని గబగబా గేటువేపు వెళ్ళిపోయేడు నారాయణమూర్తి.

★ ★ ★

నారాయణమూర్తి ఓపిగ్గా పది రోజులు గడిపేడు—గుండె చిక్కబట్టుకొని. ఈ రోజులన్నీ ఎదురు చూసేడు — మాధవరావుగారింట్లో పెళ్ళికొడుకు చెల్లెలు నగపోయిందనే వార్త ఎవరయినా చెబుతారేమోనని. కాని అట్లాంటిదేమీ జరగలేదు.

ఈ పదిరోజుల్లోనూ నారాయణమూర్తికి గుండెధైర్యం బోలెడంత చేకూరింది. అందుకే మర్నాడు ఆ నెక్లెసు తీసుకుని ఓ షాపుకెళ్ళాడు.

"అమ్మడానికీ, కుదవ బెట్టడానికీ కాదు గానిధరచెప్పాలి!" అన్నాడు దాన్ని షాపువాడి చేతిలోపెట్టి.

దాన్నిచూసి వాడికళ్ళు యింతింతై అంతయిపోయినాయ్. వాడుఆశ్చర్యంగా నారాయణమూర్తికేసి చూసేడు.

"మీదే అయివుంటుంది" అన్నాడు వాడు చిన్నగానవ్వి. నారాయణమూర్తికి వాడి మాటలు అర్థంకాలేదు. ముఖం చిట్లించేడు.

"మంచిడిజైను. ఏకంపెనీది ?" మళ్ళీ అడిగేడు షాపువాడు.

"కంపెనీది కాదు. చేయించింది. మా బంధువులది" "సార్! ఇంకెవ్వళ్ళ కయినా చూపించుకోండి. గిల్టుదానికి బంగారం ధర చెప్పేవాళ్ళు ఎవళ్ళయినా దొరుకుతారేమో కనుక్కోండి."

ఆ తరువాత మాటలు నారాయణమూర్తి వినిపించుకోలేదు. రోడ్డుమీద కొచ్చేడు. తన చేతిలో షాపువాడు పెట్టిన నెక్లెసు నిగనిగలాడుతోంది. అది తాచుపాములా కనిపించింది. ఒళ్ళంతా తేళ్ళూ, జెర్రులూ పాకుతున్నట్లయింది — నారాయణమూర్తికి. దాన్ని చూసి చూసి దూరంగా చీకట్లోకి గిరవాటేసేడు.

అతని కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగినయ్.

తన కూతురుకు చేయించిన బంగారు ముక్కుపుడక గిల్టుగా, నకిలీ నెక్లెసు పెళ్ళికొడుకు చెల్లెలు మెడలోకి బంగారు నగగా ఎందుకు మారుతుందో ఊహల్లో జీవించే నారాయణమూర్తికి ఏం తెలుసు ?

★★★

చదువుకున్న కమల

ముప్పాళ రంగనాయకమ్మ

[గత సంచిక తరువాయి]

రాము అయిష్టంగానే ఊరుకున్నాడు. కానీ నాయనమ్మ కూడా కొత్త సిల్కు చీర కట్టుకుని తల దువ్వుకుని చుట్టాలతో ప్రయాణమైతే వాడు ఓర్చుకోలేక పోయాడు.

ఆ మధ్య మా కాంతం వచ్చినప్పుడు_దానికి బావుండలేదని ఈ చీరె నా కిచ్చిపోయింది వదినా! "అయ్యో! నా కెందుకే సిల్కుచీర అన్నాను. విన్నది కాదు." అంటు జారిపోతోన్న కొంగు బొడ్లో దోపుకొంది శేషమ్మ.

"అమ్మా! నాయనమ్మతో వెళ్తానే!" రామం మళ్ళా అడిగాడు.

"పోనీ రానివ్వమ్మాయ్! పిల్లలు మనం చెప్పినట్టు వింటారా? వాళ్ళ కెంత తోస్తే అంతే" అంది మంగమ్మ అద్దంలో షోకు చూసుకొంటూ.

ఆవిడ మాటలకి కమలేం జవాబు చెప్పలేదు. "అలా కాదులే మంగమ్మొదినా! మా కోడలు పిల్లల్ని అదేదో పుస్తకాల్లోలాగా పెంచుతోంది."

శేషమ్మ మాటలకి తెల్లబోయారు చుట్టాలు, అత్తగారి వ్యంగ్యం చాలా చిరాకుపెట్టింది కమల్ని.

"రామం! రా! ఇవ్వాళ పాఠం చెప్పనే లేదు." తను లేచి వెళ్తూ కొడుకుని పిల్చింది. రామం కదల్లేదు. వాడికా క్షణంలో హితబోధలూ గుణపాఠాలూ - నీతి శతకాలూ - వగైరాలేవీ బొత్తిగా గుర్తురాలేదు.

"నేను పాఠం చదవను. నాయనమ్మతో సినిమా కెళ్తాను." అన్నాడు మొరాయించి.

కమల దగ్గిరికి వస్తూ ఒత్తి అడిగింది___"సినిమాకి వెళ్తావా?"

"ఏం వెళ్తే నీకేం?"

రాము చెంప చెళ్ళుమంది. తూలి పడ్డాడు. "వెళ్ళు. గదిలో కూర్చుని పాఠం చదువు." ఆజ్ఞాపించింది కమల. రాము అయిష్టంగా కాళ్ళీడ్చుకుంటు గదిలోకి పోయాడు.

"అదేమిటే? పిల్లల్ని కొట్టకూడదంటావుగా?"

"పిడుక్కీ బియ్యానికీ ఒక్కటే మంత్రం అని నేనేం చెప్పలేదు. వాడు నన్ను ధిక్కరించి అవమానం జేసినప్పుడు _ ఏం చెయ్యాలో _ ఏం చెయ్యకూడదో ___ నాకు తెలుసు." తను కూడా గదిలోకి వెళ్ళిపోయింది కమల.

కోడలు అత్తగార్ని ఎందుకలా ఈసడించిందో చుట్టాలి కర్థంకాలేదు. వాళ్ళ సానుభూతి చూపులకి తట్టుకోలేక పోయింది శేషమ్మ. రాని నవ్వు తెచ్చుకు నవ్వుతూ — "అబ్బే మా కోడలికి కొంచెం కోపం ఎక్కువ. కుర్ర వెధవ చెప్పిన మాట విన్నాడు కాదని..." అంటూ మసిపూసి మారేడు కాయ చేసినట్టు వాళ్ళందర్నీ మరిపించేసింది.

సాయంత్రం వంటగురించి పురమాయించి అందర్నీ తీసుకు బయటికి పోయింది.

కమల రామానికి పాఠం చెప్పలేదు. మోచేతులు తలగడలో అన్ని మౌనంగా కూర్చుంది చాలాసేపు.

రామం తెరిచి పెట్టుకున్న పుస్తకంలో ఒక్క అక్షరంకూడా చదవలేదు. "ఛీ! అమ్మ మంచిదికాదు." అనుకొన్నాడు చాలాసార్లు.

ముసలాయన రాకతో వాతావరణం కాస్త కదిలింది.

"తాతయ్యా! అమ్మ నన్ను కొట్టింది." నెమ్మదిగా లేచివెళ్ళి బిక్క మొహంతో చెప్పుకున్నాడు రామం.

"గట్టిగా కొట్టిందా? నెమ్మదిగా కొట్టిందా?" మనవణ్ణి వెటకారం చేస్తూ అడిగాడు ముసలాయన.

"గట్టిగానే కొట్టింది తాతయ్యా!"

"అయితే సరే! నాన్నని రానీ! అమ్మని కొట్టిద్దాం."

రాము ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేశాడు—"నాన్న అమ్మని కొడతాడా?"

"ఎందుక్కొట్టడూ? చితగ్గొడతాడు. వాడికి సరిగ్గా కోపం రావాలిగానీ — అసలే వెర్రికోపం వాడికి...."

కమల ఓ నిట్టూర్పు విడిచి వంట ప్రయత్నంలో పడింది—

రాత్రి పదకొండు గంటలవేళ తిళ్ళు తిని—మంగమ్మ డబ్బులు లెక్క చూడ్డం మొదలెట్టింది. సినిమాలో బఠాణీలు కొనుక్కున్నారట. ఒక్కో సోడా తాగారట. ఒక్కో కిళ్ళీ వేసుకున్నారట.


టిక్కట్లు తీసేప్పుడు శేషమ్మ యిచ్చిన అర్థరూపాయి గాక—మరో ముప్పై పైసలు ఇవ్వదేలింది— "ఒసే కమలా! నీ దగ్గిర చిల్లరేమైనా వుంటే యివ్వవే. మూర్తి నిద్రపోతున్నాడల్లే వుంది" అంది శేషమ్మ.

కమల చిల్లరతెచ్చి యిచ్చింది.

రెండోరోజు సముద్ర స్నానానికి చుట్టాలతో కలిసివెళ్తూ మూర్తిని ఓ రూపాయి అడిగింది శేషమ్మ. మూడోరోజు ఆస్పత్రికి వాళ్ళకి సాయంగా వెళ్ళింది ప్రభావతి దగ్గర రహస్యంగా ఓ అర్థరూపాయి అప్పుజేసి.

"శేషమ్మొదినా! నువ్వు మాయింటి కెప్పుడూ రానేరావు. బస్తీవొదిలి ఎందు కొస్తావులే." అంటూ రిక్షా లెక్కారు చుట్టాలు.

కమల జబ్బుపడి లేచిన మనిషిలా అయిపోయింది.



కమలని ఓదార్చటాని క్కూడా మొహం చెల్లలేదు. మూర్తికి.

★ ★ ★

చుట్టాల బెడదతో పిల్లలకి చదువు చెప్పటం పడనేలేదు మూడు రోజుల నుంచీ —.

నాలుగోనాడు పొద్దుటే - పిల్లల్ని కూర్చోబెట్టి - ప్రేమకి కొత్త అక్షరాలు రాసియిచ్చి రామానికి కొత్త పాఠం చెప్పి లేచింది కమల.

"పాతపాఠాలన్నీ ఓసారి చదివెయ్." అంది.

రాము ఉత్సాహంగా గొంతుచించుకొంటూ పాఠాలు చదవటంలో మునిగిపోయాడు.

"చాలుగానీ లేచిపోదూ! ఇంకా ఒళ్ళు కడుక్కోడం ఎప్పుడూ? తిండి తినడం ఎప్పుడూ? లే. లే" అంటూ వెనకపాట మొదలు పెట్టాడు తాతగారు.

రామానికి వుత్సాహంపోయి బద్ధకం వేసింది—"అమ్మా! లేచిపోనా?" అంటూ అరిచాడు.

"వెధవ్వేషం వెయ్యక నే చెప్పేవరకూ కూర్చుని పాఠాలు చదువు" కమల ఆజ్ఞాపించింది.

"ఇంకా ఎంతసేపు చదువుతాడే? గుంట వెధవని పట్టుకు చంపేస్తున్నావు. ఒక్క రోజులోనే పండితుడై పోతాడా ఏమిటి?"

మామగారి చమత్కారానికి కమల కోపం అణుచుకోవాలని ప్రయత్నించింది—"నేను చదవమంటున్నాను. మీరు లేచి పొమ్మంటున్నారు. ఇక వాడి ధ్యాస చదువుమీద వుంటుందా?"

"వేళైపోవటం లేదూ? ఇంకా ఎప్పుడు బడికి వెళతాడు? ఆ బొండాం పంతులమ్మ ఆలశ్యంగా వెళ్తే బాగానే వడ్డిస్తుంది."

కమలకి అంతులేని అసహ్యం ముంచుకొచ్చింది — ముసలాయన మాసిన వాళ్ళందరికీ పేర్లెట్టటం చాలాసార్లు వింది—అదీగాక పిల్లల ఎదుట వాళ్ళ మేష్టర్లని వెటకారాలు చెయ్యటం మంచిపని కాదు. వాళ్ళకా మేష్టర్లమీద బొత్తిగా గౌరవం వుండదు.

అయినా వాణ్ణి ఏ వేళకి బడికి పంపించాలో నాకుతెలుసు. అదంతా నేను చూసుకోగలను. మీకుబొత్తిగా అనవసరం." అనేసింది కోపంగానే.

"అయిందా మీ పెద్దరికం? ఎందుకొచ్చిన తంపటం మీకు? గుడ్లుపెట్టుకు చూస్తూ కూర్చోలేరూ?" అంటూ చివాట్లు పెట్టింది శేషమ్మ.

కమల మళ్ళా అంది—" మొన్ననో రోజు అలాగేచేశారు. వాడు రాసుకుంటోంటే ఏదో పొట్లంతెచ్చి పలకమీద పెట్టారు. ఇక వాడిరాత ఛస్తేసాగలేదు. ఇవన్నీ చూస్తూ ఎలా వూరుకోను?"

దానికికూడా శేషమ్మ మొగుణ్ణే చివాట్లుపెట్టింది—" ఆయన పిచ్చిగానీ అదికాస్తా నోట్లో వేసుకుంటే పోదూ. ఏదో మనసు ఆగక....ప్రేమచేతేకదా ఏంచేసినా...."

"వివేకం లేకుండా బ్రతుకుల్ని నాశనంచేసే ప్రేమ ఎవ్వడికీ అక్కర్లేదు."

"కమలా!" అంతా వింటోన్న మూర్తి విసుగ్గా అన్నాడు—"ఏమిటా దురుసుతనం? సామరస్యంగా మాట్లాడుకోరాదూ?"

కమల మండిపడింది — "ఇక కొత్తగా నేర్చుకుంటాను సామరస్యం. పిల్లాడి చదువు విషయం వాళ్ళమ్మ చూసుకోగలదు కదా? మీ కెందుకు మధ్య?' అని ముసలాయన్ని అడ

గటంపోయి నాది దురుసుతనం అంటు న్నారా ?" అంటూ నిరొ్మహమాటంగా అడిగేషింది.

మూ ర్తి నోరు విప్పలేదు.

★ ★ ★

సినిమాకి వెళ్ళనివ్వని రోజునుంచీ రామం తల్లి బోధనలకు విరుద్ధంగానే వున్నాడు.

సాయంత్రం అన్నాలవేళ — బాదం కాయ స్టీలు పళ్ళెంకోసం దెబ్బలాట పెట్టుకున్నారు పిల్లలు. ఆ పళ్ళెం రామం చిన్నప్పుడు కొంది కమల. తరుచూ వాడే తింటాడు అందులో.

"అమ్మా ! ఆపళ్ళెంలో నే ను తింటానే !" అంది ప్రేమ. ఎందుకో ఆరోజు దానికా బుద్ధిపుట్టింది.

"ఒద్దమ్మా ! ఎవరిపళ్లెంలో వాళ్ళే తినాలి." అందామను కొంది కమల. కానీ, కొ త్తిగా అన్నా చెల్లెళ్ళకి.... ఇంత పసివయస్సులో....ఇంత అతకని పరిస్థితులలో - అలాంటి విభేదాలు కల్పించటం మంచిదికాదని తోచింది.

"రామం ! ఆ పళ్ళెం ఇవాల్టికి చెల్లి కిద్దూ ! నీ చెల్లేకదా ?" అంటూ వాణ్ణి సముదాయించబోయింది - "చిన్నపిల్ల! ఒక్కసారేకదా అడుగుతోంది నీ పళ్ళెం."

"ఛీ ! స్టీలుపల్లెంలో మొగపిల్లలే తినాలని నాయనమ్మ చెప్పలేదేమిటి ? దానికి పింగాణీ పళ్ళెం వుందిగా ?"

నిర్ఘాంతపడి నోటమాటరా నిపరిస్థితి అయింది కమలకి.

"ఆడముండవి. నీకా పరుగు లెందుకే ? ఏమిటాపకపకలూ ? ఆడ ముండవికావూ ? వాడితో సమానంగా నీకు పంతమా ? ఆడదానికి చెల్లేనా ?" అంటూ ఎప్పటికప్పుడు మనవరాల్ని శేషమ్మ చివాట్లు పెడు తోంటే వింటోనేవున్న కమల — "ఏదో పెద్దవాళ్ళు చాదస్తంగా అలాగే వాగుతారు, వాళ్ళని మార్చటం నా వశం కాదు," అనుకొని తనను తను సమ ర్ధించుకుని వూరుకుంది చాలాసార్లు.

తను నిర్లక్ష్యం చేసిన దాని ప్రభావం

★ రాజకీయాల్లో శత్రువర్గాలకు సంబంధించిన ఇద్దరు రాజ్యీయ నాయకు లకు ఎలాగైనా స్నేహం కలపాలని ఒక పెద్దమనిషి ప్రయత్నిం చాడు. ఇద్దర్నీ విందుకు ఆహ్వానించి ఒకరితో మరొకరు కలుపుగోలు తనంగా మాట్లాడమని ఆదేశించాడు.

"మీరు నాకు ఏం జరగాలని వాంఛిస్తున్నారో నేనూ మీకు అదే జరగా లని వాంఛిస్తున్నాను !" అన్నాడొక నాయకుడు.

"చూశారా.... మొదటి మాటలోనే మళ్ళీ శత్రుత్వాన్ని ఎలా వెళ్ళకక్కు తున్నాడో !" అన్నాడు రెండో వ్యక్తి.

ఇంత తీవ్రంగా పనిచేసి—రామం పసి హృదయంలో ఒక విష బీజాన్ని నాటింది. ఆడపిల్లలు స్టీలు పళ్ళేల్లో తినకూడదన్న మాట రామం నోటి నుంచి వచ్చింది — ఇంకా ఈ విషయాన్ని తను నిర్లక్ష్యం చేయవచ్చునా?

పిల్లల్ని విశాలమైన వ్యూహాలతో — సమానత్వ భావాలతో — పొంగి పొర్లే మానవతతో — పెంచి పెద్ద చేయాలని తపస్సు చేస్తున్న కమల — తన ప్రయత్నాలన్నీ వ్యర్థమై — గాలిలో కలిసిపోయి — తన కళ్ళ ముందే పతనమై పోతోన్న బిడ్డని చూసి.... విలవిల్లాడిపోయింది.

తమాయించుకుని కొడుకు కేసి సూటిగా చూసింది— "నేను చెప్తున్నాను రామం! పళ్లెం చెల్లికిచ్చేయ్! నీకంటే చిన్నది అడిగినప్పుడు దాని కోరిక తీర్చాల్సిందే."

హఠాత్తుగా తల్లి మొహంలో తిష్ఠ వేసుకున్న గాంభీర్యం చూసి బెదిరిన రామం చేతిలో స్టీలుపళ్ళెం విసురుగా గిరవాటు పెట్టాడు. అది స్తంభానికి తగిలి భళ్లున శబ్దం చేసుకుంటూ కింద పడి గిరగిరా తిరిగింది.

పళ్ళెం ఆగీ ఆగకుండానే ప్రేమ పరిగెత్తుకు వెళ్ళి పళ్లెం అపురూపంగా తెచ్చుకొంది — శేషమ్మ వడ్డనకి వుపక్రమించింది.

కమల కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. గదిలోకెళ్ళిపోయి కూర్చుంది.

ప్రేమ ప్రవర్తనలో ఆడబిడ్డ కాంతం తత్వం కొట్టవచ్చినట్టు కనిపించింది.

ఈ అత్తమామల చేతుల్లో పెరిగిన కాంతం ఎందుకంత సంకుచితమైన మనస్సుతోనూ—ఎదటి వాళ్ళని దేవిరించేదిగానూ తయారైందో అప్పుడు బాగా అర్థమైంది.

పిల్లలు తామంతా ఒక్కటే అనుకుంటారు స్వతహాగా. వాళ్ళల్లో ఆడ మగ బేధాలనే కారణంగా ఎంచి — హెచ్చు తగ్గులు చూపిస్తే—దాని ప్రభావం చాలా అమానుషంగా వుంటుంది.

మగపిల్లలు అహంకారం — అతిశయం—వెల్లడిస్తూ ఆడపిల్లల్ని — తేలిగ్గా — చులకనగా చూడ్డం నేర్చుకుంటారు.

అలాగే ఆడపిల్లలు మొగపిల్లల అధికారానికి తలలు దించి—తమను తాము చిన్నబుచ్చుకుంటూ — ఎదటి వాళ్ళకి ఒదిగి ఒదిగి బ్రతికే బలహీనమైన వ్యక్తిత్వాన్ని అలవర్చుకుంటారు.

తల్లిదండ్రులచేత — తనకంటే గొప్పవాడుగా చూడబడుతోన్న అన్న మీదగానీ—తమ్ముడిమీదగానీ ఆడపిల్లకి నిజమైన అనురాగం వుండదు.

అందుకే కాంతం మధుమూర్తిని ప్రేమించదు. అతని కష్టం గమనించదు. అతని ఇబ్బందులు లక్ష్యపెట్టదు. అతను సుఖపడటం ఇష్టంలేక జలగలా పీక్కుతింటూ వుంటుంది.

మధుమూర్తి కూడా తను ఎన్ని సమస్యలతో కొట్టుకుంటున్నా - "ఆడపిల్ల అడిగింది." అన్న సానుభూతితోనూ —" దాన్ని వుద్ధరించాల్సిన

బాధ్యత మొగాణ్ణి కాబట్టి నాకెవుంది." అన్న అహంతోనూ — వదోపరకో యిచ్చి తక్కువ వాళ్ళకి సాయం చేసి నప్పుడు దొరికేతృప్తి పొందుతాడు.

రామం అలా పళ్ళెం గిరవాటు పెట్టి నప్పుడు- ప్రేమ దాన్ని కన్నెత్తి కూడా చూడకూడదు.— "అన్నయ్య యిష్టంతో ఇవ్వలేదు. అలా విసిరి కొడితె నేనెందుకు తీసుకుంటాను ?" అన్న ఆలోచన దానికి లేకపోయింది.

ఆత్మాభిమానం - పసితనంనుంచే అలవడుతుంది - కానీ .... ప్రేమ.... కాంతంలా తయారౌతుందా ?

ఏమిటో మనస్సంతా వేదనతో నిండి పోయింది కమలకి.

మరే చిన్న సంఘటనకీ ఈ మనస్సిక తట్టుకోలేదేమో ! ఈ గుండెల్లో బాధంతా....ఎవరికైనా చెప్పేస్తే....? అర్థం చేసుకునే వాళ్ళకి....బాగా అర్థం చేసుకునే వాళ్ళకి....!

ఎవరున్నారు ?

ఎవరున్నారు ?....ఇంకెవరు ? .... పద్మ ! అవును....పద్మ. పద్మకి.... వుత్తరం రాస్తే....?

"అమ్మా !"

కమల గబగబా కళ్ళు ఒత్తుకొంది.

"నాకూ అరిటిపండు పెట్టమనవే !" మజ్జిగ చుక్కలు చేతివెంట కారుతోంటే ఏడుస్తూ నించుంది ప్రేమ.

"ఏమిటమ్మా ? అరిటీ పండేమిటి ? చూడు యెంగిలి యెలా పడుతోందో యింట్లో ?"

అదేం వినిపించుకోలేదు ప్రేమ— "తాతయ్య అన్నయ్యకి అరటిపండిచ్చాడూ ! నాకూ యిమ్మని చెప్పు" అంటూ బిక్కమొహం వేసింది.

"ముందు నువ్వు బయటికి పద" అంటూ కమల కూతుర్ని గదిలోంచి తీసుకుపోయింది. రామం మజ్జిగన్నంలోకి అరిటిపండు ఒల్చి పెట్టుకున్నాడు.

"రామం ! ఎక్కడిది నీకా పండు ?" అంది కమల.

"తాతయ్య యిచ్చాడు."

"చెల్లికి కూడా కొంచెం పెట్టాలని తెలీదూ ? దానికీ కొంచెంపెట్టు. మజ్జిగన్నంలో నంజుకుంటుంది"

"తాతయ్య నాకే యిచ్చాడు." రామంమాటల్లో స్దలు పళ్ళెంకోపం దాగివుంది— "కావాలంటే తాతయ్యనే అడుగు."

కమల ఇక ఆ విషయాన్నంత తేలిగ్గా పోనివ్వదల్చలేదు. మామగారి నుద్దేశిసూ అంది— "ఇద్దరూ కలిసి తిళ్ళు తింటోన్నప్పుడు ఒక్క పిల్లాడి కెలా

★ సభాసదులను ఉద్దేశించి ఒకరు :

సభాసదులారా ! ఇప్పుడు శ్రీయోగానంద స్వామివారు 'మౌనవ్రత ఆవశ్యకత, ఆధిక్యత'లను గూర్చి ఒక గంటసేపు ఉపన్యసిస్తారు !



యిచ్చారు ? ఇదేమై పోతుందను కున్నారు ?"

"హుం ? దానికేం పొబ్బుడాయి ? ఏ పచ్చడి ముక్కో నంజుకు తినలేమా? వాడు బళ్ళోకిపోయి చదువుకు వస్తున్నాడు. ఇది యింట్లో తిని తిరగట మేనా ? ఆడముండ వాడితో పంతు వేసుకుంటుందేమిటి ?"

కమల తల గిర్రున తిరిగింది. ఛీ ! వీళ్ళు మనుష్యులా ? బిడ్డల్ని కని పెంచిన తలి దండ్రులా ?

పసిబిడ్డల హృదయాలకు విషం నూరిపోసే రాక్షసులుగానీ — ప్రేమాను రాగాల్ని పంచిపెట్టే ఆత్మీయులా ?

కమల శరీరం ఆవేశంతో కంపించి పోసాగింది. కళ్ళు ఎర్రబారాయి— "మీ రిద్దరూ దాన్ని పట్టుపని అస్త మానూ—'ఆడముండవి. ఆడముండవి' అని తిట్టి పోస్తోంటే ఇంతకాలం ఊరు కున్నాను. నోరెరగని ' పసివాళ్ళకి తిండిదగ్గిర కూడా యింత వ్యత్యాసం చూపించే మీలాంటి పెద్దవాళ్ళని నే నెక్కడా చూడలేదు. ఏమీ ఎరగని పసిపిల్లలకి ఆడా మగా అన్న ఆలోచ నలు పుట్టించటం మీకు ధర్మంకాదు. అధికుణ్ణని వాడు విర్రవీగటం — అధమురాల్నని అది క్రుంగిపోవటం—"

కోడలి మాటలు పూర్తి గాకుండానే శేషమ్మ బుగ్గలు నొక్కుకొంటూ— "ఇదేం విడ్డూరమే ? ఆడా మగా అన్న ఆలోచన మనం పుట్టించడం ఏమిటీ ? దేవుడే చేశాడు. వాళ్ళకి మాత్రం తెలీదూ ?" అంది.

"అవును. దేవుడే చేశాడు. ఎందుకు ? సృష్టికోసం.

సృష్టికి అవసరం కాబట్టే స్త్రీ పురుషుల్ని ఏర్పాటు చేశాడు, మొగాళ్ళ అక్కర్లేకుండానే సృష్టి పెరిగే మార్గం వుంటే ఒక్క ఆడవాళ్ళనే సృష్టించి వూరుకునేవాడు.

దేవుడి సృష్టిలో పూచికపుల్ల కూడా అప్రయోజకంగా మొలకెత్తదు. ఏది అవసరమో అదే చేస్తాడు.

అవసరంకోసం దేవుడు సృష్టిస్తే యెవరి స్వలాభం వాళ్ళు చూసు కున్నారు.

స్త్రీ పురుషుల్ని దేవుడు సృష్టిస్తే, హెచ్చు తగ్గులు మనం సృష్టించు కున్నాం. మొగవాడంటే గొప్పలూ హోదాలూ దేవుడు సృష్టించినవికావు. మగవాణ్ణి పెత్తనం వెలగబెట్టమని దేవు డెవరికీ వుపదేశించలేదు. మొగవాడికి కాకాలు పట్టి వంతపాడ మని దేవుడు ఆడదానికి బోధించలేదు. మానాభిమానాలు మరిచి మగవాడికి నీడలా కాలం వెళ్ళబుచ్చుకోమని దేవుడు శిక్ష వెయ్యలేదు. బుగ్గలు నొక్కుకుంటూ అంత విస్తుపొమ్మని కూడా మీకు దేవుడు చెప్పలేదు.

మాటిమాటికీ దేవుణ్ణెందుకు అడ్డం వేసుకుంటారో నాకు అర్థంకాదు."

కమల ఆవేశం మూర్తికి కూడా చాలా ఆశ్చర్యం కల్గించింది. అందులో తనని వుద్దేశించి యెంత మాట్లాడింతో కూడా బాగా అర్థమైంది.

ముసలాయనకో ధర్మ సందేహం: "మొగరాజుని మొగరాజనక — ఆడ ముండని ఆడముండనక—ఏమంటారూ?" కోడలి భావాలు అసహ్యంగా తోచాయి ముసలాయనకి.

పిల్లలు హడిలిపోయి పెద్దవాళ్ళ దెబ్బలాట వింటూ తిళ్ళు మానేసి కూర్చున్నారు.

కమల కొడుకు పళ్ళెంలో అరటి పండు తీసి పెంటలోకి విసిరేసింది— "ఆ పాపిష్ఠి తిండి నువ్వు తినదు. హాయిగా అన్నాలు తిని లేవండి." అంటూ విసురుగా గదిలోకి వెళ్ళి పోయింది.

"ఇద్దరూ పసిపిల్లలేగదా? తిండి దగ్గిర అంత పక్షపాతం బావుంటుందా? మనం కన్న పిల్లల్ని మనమే సమాన దృష్టితో చూసుకోలేమా?" అనలేక పోయాడు మధుమూర్తి. ఒళ్ళో నిద్ర పోతోన్న చంటివాణ్ణి భుజంమీద వేసు కుని లేచి గదిలోకి వెళ్ళాడు.

తలగడలో మొహం పెట్టుకుని వెక్కి-వెక్కి ఏడుస్తోంది కమల.

స్థాణువులా నుంచున్నాడు మూర్తి. కమలని ఓదార్చేశక్తి అతనికి లేదా?

★ ★ ★

ప్రియమైన పద్మా?

ఇంతకాలానికి ఇలా అనుకోకుండా నా వుత్తరం చూసి ఆశ్చర్య పడతా వేమో! నేను మాత్రం....నీకు వుత్త రం రాయాలని........"

ఓ సావుగంట వుత్తరం రాస్తూ కూర్చుంది కమల. తన మనస్సంతా వ్యక్తం చేసి - తన ఆవేదనంతా వెల్లడించింది. ఎందుకు? సానుభూతి కోసమా? ఏం లాభం? కమల సమస్యలు పరిష్కార మౌతాయా? కావు, కావని తెలుసు. పద్మ చూపించే సానుభూతి కూడా తనకి అక్కర్లేదు. కానీ తను ఎంత కరెక్టో పద్మ చెప్తుంది. తన డోలాందో ళన ఆగిపోతుంది. తన వివేకం— విజ్ఞానం యెందుకు కొరగాకుండా పోతున్నాయో తెలిసి వస్తుంది.

అవును. పద్మకి మనసు విప్పి అంతా రాయాలి.

"అమ్మా! అన్నయ్య....కొట్టాడే" అంటూ ప్రేమ రావడంతో కాయితాలు మూసి లేచిపోయింది—ఆ రోజు ఉత్తరం రాయటం పడనేలేదు.

★ ★ ★

ఆ రోజు రాత్రివేళ—

భారంగా తిండి తిని బయట వాకిట్లో పడుకున్నాడు ముసలాయన.

"తాతయ్యా! కథ చెప్పవ్?" అంటూ దగ్గిరికి చేరాడు రామం.

వాడివెనకే ప్రేమకూడా వెళ్ళింది. రామం తాతగారి పక్కలో పడు కున్నాడు. ప్రేమ కాళ్ళ వేపున కూర్చుంది.

తాతగారు కథకూడా ప్రారంభిం చాడు "ఆరాజుగారేమో ఓమొగపిల్లాడు కావాలని దేవుడి కోసం తపస్సు చేశాడు."

"మొగపిల్లాడెందుకు తాతయ్యా?"

"అదేం ప్రశ్నరా పిచ్చివెధవా? పుత్రుడు లేందే గతుల్లేవు. ఎంతమంది పిల్లలున్నా మొగబిడ్డ లేనప్పుడు వాళ్ళు గొడ్డువాళ్ళతో సమానం. అందుకని రాజుగారు .... దేవుణ్ణి...."

"దేవుడెక్కడుంటాడు తాతయ్యా?" ప్రేమ.

"ఆకాశంలో."

"అక్కడేనా?" ప్రేమ తలెత్తి ఆకాశంకేసి విస్మయంగా చూడసాగింది.

ఆకాశం నిర్మలంగా ప్రశాంతంగా వుంది. చుక్కలు మిలమిలా మెరిసి పడుతున్నాయి. వాటిని చూస్తోన్నకొద్దీ ప్రేమకి వుత్సాహం పొంగి వచ్చింది— "దేవుడు కన్పించటం లేదేం తాతయ్యా?"

"దేవుడు బాగా కనపడడు. ఆకాశంలో బాగా పైన పేద్ద మేడ వుంటుంది. అక్కడ వుంటాడు. అక్కడికి వెళ్తే కనపడతాడు. నువ్వు వెళ్ళిపోతావుటే?"

అదిరిపడింది కమల.

తన చెవులు తనని భ్రమింప చేయ లేదుకదా? ముసలాయనైతే మాత్రం అంత మాట అంటారా?

"దేవుడి దగ్గిర కెందుకూ?" ప్రేమ సందేహం.

"ఎందుకేవిఁటి? ఎంచక్కా అక్కడ యెన్నో అప్పచ్చులూ అవీ వుంటాయి. మిఠాయిలూ — మామిడి పళ్ళూ వుంటాయి. అన్నీ తినచ్చు. చక్కగా నిన్ను దేవుడు యెత్తుకు తిరుగుతాడు"

"అయితే నేనూ వెళ్తాను తాతయ్యా!" రామం.

"ఛ! వెర్రి వెధవా! నీకేం ఖర్మరా? మొగ మహారాజువి! దానికైతే ఓ పదివేలు ముడుపు చెల్లిస్తే గాని తద్దినం వదలదు." అంతలోనే హాస్య ధోరణి—"వెళ్ళిపోవే తల్లీ! వెళ్ళిపో! దేవుడి దగ్గిరికి వెళ్ళిపో!"

"నువ్వూ వస్తావా తాతయ్యా?"

"ఆసిముండా! ఎంత శిఖండివే! అందర్నీ కదిలించి గానీ నువ్వు కదలవు. ఎలా అడిగిందో విన్నావుటే?" అంటూ రాని నవ్వు తెచ్చిపెట్టుకుంటూ పెళ్ళాన్ని పలకరించాడు.

కమలకంతా అయోమయమై పోయింది. ఇంత దారుణమైన హాస్యం ఏ పెద్ద మనిషైనా చంటి పిల్లలతో ఆడగలడా? అసలీ విషయాన్ని ఎవరైనా వింటే నమ్ముతారా?

కమల ఒళ్ళంతా కోపంతో కంపించి పోసాగింది. గుండెలు దడదడా కొట్టుకుంటున్నాయి. అదృశ్య హస్తం ఆలోచించే మెదడుని కర్కశంగా నలిపి వేస్తోన్నంత బాధ కలిగింది. భరించ లేని దుఃఖంతో ఆవేశం కట్టలు తెంచుకొంది.

భర్తకేసి తీక్షణంగా చూసింది.

"మీరు విన్నారాఆయన మాటలు?"

తెల్లబోయాడు మధుమూర్తి — "ఏమిటి?"

"ఏమిటా !" అంతకన్నా తెల్ల బోయింది కమల.

"ఏ ప్రపంచంలో వున్నారు మీరు?"

"అబ్బ ! చెప్పరాదూ ?"

"ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి? ఎంత కాలం చెప్పాలి? ఆ పిల్లంటే ఆయనకి ఎందుకంత వెగటైపోయింది? అది మన కడుపున పుట్టలేదూ? దానికి తల్లిదండ్రులు లేరూ? దాని బరువు ఆయనేం మోస్తున్నారు? పుట్టిన దగ్గిర్నుంచీ ఏక వరసగా దాన్ని కాల్చుకు తింటోంటే భరించాను. ఇక అది ఈ నరకంలో బ్రతకలేదు. ఏ అనాథాశ్రమంలోనో చేర్పించెయ్యండి. అది యెక్కడైనా సరే బ్రతికివుంటే నేను సంతోషిస్తాను."

కోడలి కోపానికి శేషమ్మ కాస్త తెల్లబోయింది.

"అదేవిటే కమలా? ముసలాయనేదో హాస్యానికి అన్నదాన్ని పట్టుకుని...."

"ఛీ! మీరుకూడా పిల్లల్ని కన్నారు. మీకు కడుపుతీపి తెలీదూ? చచ్చిపొమ్మన్నది హాస్యమా? నాలుగేళ్లు నిండని పసిదానితోనా హాస్యం? కాటికి కాళ్ళు చాచుకున్న వాళ్ళకే పది కాలాలపాటు బ్రతికి ప్రపంచంలో వింతలన్నీ చూసెయ్యాలన్న సంబరం వుందిగానీ – కళ్ళయినా తెరవని పసిబిడ్డ దేవుడి దగ్గిరికి వెళ్ళిపోవాలా ?"

"ఏమిటా వెధవ్వాగుడు?" చెయ్యి యెత్తబోయి నిగ్రహించుకున్నాడు మధుమూర్తి.

కమల తిరస్కారంగా చూసింది– "మీ చేష్టలతోటే నా పరువుపోయింది. ఇక ఆ దెబ్బ నా ఒంటిమీద పడితే వచ్చే నామోషీ ఏమీలేదు. ఆ ఆవేశం అణుచుకోవటం యెందుకూ?—" గిర్రున తిరిగి గదిలోకి పోయింది.

మధుమూర్తి ఏ విషయాన్నీ అంతగా పట్టించుకోడు. ఏ సంగతీ లోతుగా ఆలోచించడు.

మధూ తత్వం చాలావరకు తెలిసినా కమల అతన్ని ప్రేమించింది. ప్రేమిస్తోంది. కానీ తండ్రి అయిన మధుమూర్తి బిడ్డల గురించి అయినా ఆలోచించలేకపోతే కమల భరించలేదు. అలాంటి మధుమూర్తిని కమల క్షమించలేదు.

పిల్లలు పుడితే బాధ్యతలు నిర్వర్తించాలన్న కాంక్షలేని వ్యక్తికి అసలు పిల్లల్ని కనే హక్కులేదు. కన్నబిడ్డల్ని గాలికి వదిలి బాధ్యతలు విస్మరించే తల్లిదండ్రులు సిగ్గుతో చచ్చిపోవాలి.

పాపం! ఆలోచిస్తే అది మధుమూర్తి నేరంకాదేమో! అతను మొగ పుట్టుక పుట్టి తల్లిదండ్రులకి గర్వం కలిగించాడు. ఆ ఔన్నత్యాన్ని అంతరంగంలో పదిలపర్చుకున్నాడు. తల్లిదండ్రుల లోకం విడిచి విద్యార్జనలో వేలు పెట్టినప్పుడైనా స్కూలుగానీ, కాలేజీగానీ, యూనివర్సిటీగానీ అతనికి ఆలోచించటం నేర్పలేదు. అతను పెరిగి పెద్దవాడై భర్త అవుతాడనీ – తండ్రి అవుతాడనీ – ఏ విద్యా సంస్థా గ్రహించలేదు. జీవితంలో అతను

ఏ సమస్య యేలా పరిష్కరించాలో _ ఏ బాధ్యతల యెలా నిర్వహించాలో_ ఏక ర్తవ్యం యెలా పాటించాలో బోధ పడలేదు.

సృష్ట్యాదినుండీ నిర్విరామంగా _ నిరాటంకంగా జరుగుతోంది బిడ్డలు పుట్టడం_తరాలు పెరగడం. "చేపలు మొప్పలతో గాలి పీలుస్తాయని" చెప్పిన మాష్టారు తన శరీరం యెలా నిర్మాణ మైందో _ దానివల్ల సృష్టి యెలా జరుగుతోందో _ త రా లు యెలా గడుస్తున్నాయో _ మాట మాత్రమైనా చెప్పలేదు. అన్ని విషయాల్లోనూ విజ్ఞాన పంతుణ్ణిచేసి పంపిన విద్యా సంస్థలు అతనికి భ ర్తగానూ _ తండ్రి గానూ శిక్షణ యివ్వలేదు. పసితనం వదిలించకుండా వెళ్ళినవాణ్ణి వెళ్ళినట్టే బయటికి పంపాయి.

మ ధు మూ ర్తి సంవత్సరాలకు సంవత్సరాలే కృషిచేసి డిగ్రీలు సంపా దించాడు. అవి అతని జీవితానికి పనికి రాకపోతే అతనేం చేయగలడు ?___ డిగ్రీ పెట్టుకుని వుద్యోగం చేస్తున్నాడు. డబ్బు సంపాదిస్తున్నాడు, డబ్బుతో సరుకులు కొనుక్కోవచ్చు. దేవుడు బ్రతికించి నంతకాలం బ్రతకవచ్చు. డబ్బుతో కూడా జీవితాలు సాగ నప్పుడు _ సమస్యలు పరిష్కారం కానప్పుడు _ బాధ్యతలు తీరిపోనప్పుడు_ అతనేం చెయ్యగలడు ? వాటి మార్గాల కోసం _ జీవితానికి పనికివచ్చే విష యాలకోసం _ మళ్ళా ఏవేవో పుస్త కాలు తిరగవేసే తీరికా_ఓపికా_కోరికా కూడా లేవు మధుమూర్తికి

పిల్లల్ని కన్నతల్లిదండ్రుల దగ్గి ర్నుంచ లాక్కుని, పొట్టకూటకి పని చేసే వుద్యోగస్థుల్నివేసి _ సంస్థలు స్థాపించి_పెంచి ప్రయోజకుల్ని చేయా లని పథకాలువేసే ప్రభుత్వాన్ని మధు మూర్తి ఆమోదించనూలేడు, ఆక్షే పించనూలేడు. అంత ఆలోచన తెలీదు మధుమూర్తికి. అది అతని నేరంకాదు.

నిశ్శబ్దంగా ఓ పావుగంట గడి చింది. మూర్తి తల్లి పిలుపుతో లేచి వెళ్ళి యాంత్రికంగా తిండి తిన్నాడు. కమల అడిగినట్టు తను తల్లిదండ్రుల్ని అడగలేడు సరికదా కమల తప్పేం వుందని కొట్టబోయాడు ? ఎంత మూర్ఖుడు ! — తిండి తిన్నంతసేపూ మధన పడుతోనే వున్నాడు.

కొడుకు భోజనం అయ్యాక కోడల్ని పిల్చింది శేషమ్మ అన్నాలు వడ్డిస్తూ. "మీరు భోం చెయ్యండి. నాకు ఆకలిలేదు." అంటూ వాకిట్లో నిద్రపోతోన్న పిల్లల్ని గదిలో పడుకో బెట్టింది కమల.

మూర్తి అనునయంగా అన్నాడు___ "అన్నం తినిరా ! కమలా, వెళ్ళు."

"తింటాను. ముందు మీతో నేను కొంచెం మాట్లాడాలి."

ఆశ్చర్యంగా చూశాడు మధుమూర్తి "ఏమిటి ?"

"ఇక్కడకాదు. అలా బయటికి వెళ్దాం. వస్తారా ?"

కమలలో ఎన్నడూ చూడని కొత్త దనం కన్పిస్తోంది_" సరే ! పద."

కమల వెళ్ళి వీధి గుమ్మంలో నించుంది

మూర్తి జోళ్ళు వేసుకుని వెళ్తుంటే తెల్లబోయి చూసింది శేషమ్మ.

★ ★ ★

ఇద్దరూ ముభావంగా నడిచారు. హైస్కూలు పిల్లలు ఆటలాడుకునే గ్రౌండువరకూ. గ్రౌండు నిర్మానుష్యంగా సువిశాలంగా వుంది.

రోడ్డుకి దూరంగా సిమెంటు గోడ మీద కూర్చున్నారు.

రెండు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచాయి. కమల అంది— "నేను ప్రేమని తీసుకు వెళ్ళిపోతాను."

"ఎక్కడికి ?"

"ప్రస్తుతం మా వాళ్ళింటికే. తర్వాత ఎక్కడ ఉద్యోగం దొరికితే అక్కడికి"

"కమలా !" విసుక్కోయాడు మధుమూర్తి. కమల చాలా సీరియస్‌గా అంటోందని గ్రహించాడు— "ప్రేమ మాత్రం ఎందుకూ ?" కోపంగా అన్నాడు.

"అది ఆడపిల్ల. ఆడపిల్లని ద్వేషించే వాళ్ళ దగ్గిర దాన్ని విడిచి పెట్టలేను. మొగపిల్లలిద్దరూ ఎలాగో పెరుగుతారు. ప్రాణాలతోనైనా బ్రతుకుతారు. అందర్నీ నెత్తిమీద పెట్టుకునే శక్తి నాకు మాత్రం ఎక్కడిది ? ముందు నా పొట్ట సంగతి నేను చూసుకోవాలి."

"కమలా !" మూర్తి కోపం చాలా వరకు దిగజారిపోయింది. కమల చేతిని గట్టిగా పట్టుకున్నాడు. "ఎందుకంత బాధపడుతున్నావు కమలా ?"

"బాధ కాకపోతే ఏమిటి ? నేనేం సుఖపడుతున్నాననీ. నావల్ల యెవరు సుఖపడుతున్నారని సంతోషిస్తాను ? ఈ సంసారాన్ని చూసుకుని బాధపడనంత వుదాసీనంగా ఎలా వుంటాను ? నా బిడ్డల్ని ద్వేషించే వ్యక్తుల్ని నేనెలా ప్రేమిస్తాను ? ఏళ్ళ తరబడీ ఇలాంటి స్పర్ధలతో వాళ్ళ మధ్య ఎంతకాలం బ్రతుకుతాను ? రోజూ వుండే ఈ చికాకులకు ఓ రోజు అంతంవుండాలిగా ? అది రేపే అయితే సంతోషమే కదా ?"

మూర్తి మౌనం వహించాడు.

"ఒక్కటి చెప్పండి. మీరలా ముభావంగా వుంటేకాదు. ఇవ్వాలైనా మనం మనస్సులు విప్పి మాట్లాడుకుందాం. ఈ ఇంట్లో నేనులేకపోతే జరిగే లోటేమిటి ?"

"కమలా !"

"మనకి యౌవనంలో సగభాగం గడిచిపోయింది. శరీరాల్లో కోరికలు కూడా మనోవేదనలో పడి నలిగి నాశనమైపోయే స్థితిలో వున్నాయి. మన యిద్దరిమధ్య 'మిగిలివున్న ఆ ఒక్క బంధం ఇవ్వాళ తెగిపోతే వచ్చే నష్టమేమీ లేదు. పరస్పరం అభిమానించి గౌరవించుకోలేని వ్యక్తులు మొగుడూ పెళ్ళాలం అంటూ సంబంధం పెట్టుకుని ఒక్క ఇంట్లో ఒక్క గదిలో మసలటం చాలా అమానుషం. ఈ భావం రేకెత్తిన తర్వాత కూడా పూర్వ సంబంధాన్ని నేను పాటించలేను."

మధుమూర్తి తెల్లబోయినట్టు చూశాడు— "కమలా ! చాలా చిత్రంగా

మాట్లాడుతున్నావు. నిన్ను నేను అభిమానించటం లేదని ఇలా నా మొహం చూసి చెప్పు."

"మీ అభిమానం నాకు తెలుసు. దాన్ని నేను శంకించటం లేదు. కానీ నేను కోరుకునేది పిచ్చి పిచ్చి వూహాలోకంకాదు. ప్రేమలకోసం అనురాగాలకోసం—తపించే కన్నెపిల్లని కాదు. మీకు ఆత్మార్పణ చేసుకున్నంత మాత్రాన నేను పొందగలిగే దేమీ లేదీనాడు. మనసుల్లో దాగివుండే అభిమానాలూ గౌరవాలూ - సమస్యల్ని పరిష్కరించలేవు. ఊహలతో రోజులు గడిచిపోవు.

నాకు కావలసిన జీవితం ఎంతో వుంది. అది నిరాటంకం కావటానికి మీరు చేయాల్సిన ప్రయత్నాలెన్నో వున్నాయి. ప్రయోజనం లేని మీ అభిమానంలో మగ్గి బ్రతుకుని భరించటం ఇక నా వశంలో లేదు."

మూర్తి మౌనం !

"ఒక్కటి అడుగుతాను చెప్పండి. ఈ యిల్లూ సంసారం....ఎవరిది ?"

"ఇంకెవరిది ? మనదే."

"అంటే ?"

"నీది - నాదీ."

"ఇంటి బరువుబాధ్యత లెవరివి ?"

"ఇంకెవరివి కమలా ! మనవి కాదని ఎలా అంటాను ? బయటి వ్యవహారాలు నేనూ లోపలి వ్యవహారాలు నువ్వూ చూసుకోవాలి."

"అయితే జరుగుతోందేమిటి? మన బాధ్యతలు మనం ఎందుకు పాటించలేక పోతున్నాం ? మన వ్యవహారాలు మనం ఎందుకు చక్కబెట్టుకోలేక పోతున్నాం ? ఈ సమస్యలూ - ఈ ఇబ్బందులూ - ఈ చికాకులూ - ఈ మనస్పర్థలూ-ఇవన్నీ ఎందుకు ? వీటికి కారణా లేమిటి ? పరిష్కారం ఎప్పుడు ? ఎలాగ ?

పాపంలా పెరిగిపోతోన్న ఈ అప్పులూ - చింతలతో సన్నగిల్లిపోతోన్న మన ఆరోగ్యాలూ - రోజు రోజుకీ అధికమైపోతోన్న అవసరాలూ - పెద్ద చదువుల కెదిగి వస్తోన్న పిల్లలూ - అంధకారమయంగా కన్పిస్తోన్న వాళ్ళ భవిష్యత్తు-వాళ్ళ ఆనందం మీదే ఆధారపడి వున్న మన జీవితాలూ — అబ్బ ! అదంతా తల్చుకుంటోంటే మీకు మతిపోవటంలేదూ ? భయం వెయ్యటం లేదూ ? పిచ్చి ఎక్కటం లేదూ ?"

మధుమూర్తి నిజంగా మతిపోయిన వాడిలాగే రెండు చేతులమధ్యా తల పట్టుకు కూర్చున్నాడు.

"మిమ్మల్ని ఇష్టపడి పెళ్ళి చేసుకున్నరోజు సంసార జీవితాన్ని ఎంతో రమణీయంగా వూహించుకున్నాను. ఏదేదో చేసేద్దామన్న వుద్దేశాలతో మీ యింట్లో కాలు పెట్టాను. కలిగినంతలో సంతృప్తిగా సంసారాన్ని సాగించాలనుకున్నాను. నన్నొక బిడ్డలా భావించి అత్తమామలు ఆదరిస్తారనుకున్నాను. పిల్లల్ని నేను తెలుసుకోగలిగిన మంచితో పెంచి ప్రయోజకుల్ని

చేసుకుంటా మనుకున్నాను. ఏ భీతీ చింతా లేకుండా జీవితాలు సాధ్యమైనంత ప్రశాంతతతో గడిపేద్దా మనుకున్నాను.

కానీ, ఒక్క ఏడాది తిరక్కుండానే నా వెర్రి నాకు తెలిసి వచ్చింది. నేను అనుకున్నవన్నీ తల్లక్రిందులై నా శక్తి సామర్థ్యాలని అపహాస్యం చేశాయి. ఈ గడిచిన కాలం నన్నొక అనామకురాల్ని చేసి కూర్చోబెట్టింది. అతి సహజమైన కోరికలు ఎందుకింత అసాధ్య మయ్యాయో మాత్రం నాకు అర్థం కావటంలేదు.

సంసారాన్ని సుఖమయం చేసుకోవాలన్న కోరిక భార్యాభర్తల్లో ఒక్కరికి వున్నంత మాత్రాన జరిగేది కాదని తెలుసుకో గలిగాను. ఇవ్వాల్టితో నా ఆశ పూర్తిగా నాశనమై పోయింది.'

"కమలా !" మధుమూర్తి నిష్ఠూరంగా అన్నాడు - "ఇలా మాట్లాడ్డం నీకు ధర్మంకాదు. నీ వుద్దేశాల్ని నేనెప్పుడూ ఆక్షేపించలేదు. మన సంసారం నీ చేతులమీదుగా నడిస్తే ప్రశాంతత లభిస్తుందని నాకు తెలుసు. కానీ....ఆచరణకు వస్తే నేనేం చెయ్యాలో తోచదు. నువ్వు చెప్పేవన్నీ పాటించటానికి ధైర్యంచాలదు. ఈ బలహీనత నన్నెప్పుడు వదులుతుందో అర్థం కావటం లేదు."

కమల నిరాశగా నవ్వింది_ "నా యిల్లు నా సంసారం - నా పిల్లలు _ అన్న తపన లేనంతకాలం ఏ బలహీనతా వదలదు. జీవించటానికేపుట్టిన ప్రాణి బలహీనతలతో జీవితాన్ని దుఃఖ పూరితం చేసుకోవటం వివేకం అవదు. అనవసరమూ అర్థరహితమూ అవుతోన్న సంప్రదాయాల్ని ఆచారాన్ని కాలంతోపాటు విస్మరించ లేని బలహీనత _ వ్యక్తిని ప్రగతి పథంకేసి కాలు కదపనివ్వదు. నిశ్చైతన్యంచేసి - నిరాశా మయంచేసి _ చివరికి జీవితాన్నుంచే తిరోగమింప జేస్తుంది. ఆలోచించ గలిగే వ్యక్తి ఆత్మవిశ్వాసంతో అన్ని బలహీనతలూ వదిలించుకుంటాడు."

కమల మాటలు విస్మయంగా విన్నాడు మధుమూర్తి. కమల మొహంకేసి తదేకంగా చూస్తూ వుండి పోయాడు.

మధుమూర్తికి కమలకన్న పొడుగు డిగ్రీయే వుంది. అయినా కమల విజ్ఞానం _ కమల ఆలోచనలూ అతనికి లేవు. ఆడది తన విజ్ఞానాన్ని మస్తిష్కంలో దాచి వుంచుకోదు. దాని అవసరాన్ని ప్రతీ అనుభవంలోనూ రంగరించు కొంటుంది. దాని ప్రభావాన్ని జీవితంమీద ప్రతిఫలింప జేసుకొంటుంది. వెలిగించిన దీపంలా పరిసరాలకు కాంతి ప్రసాదిస్తుంది.

మగవాడు అలా కాదు.

విద్యని అతను జీవితానికి అన్వయించుకోడు. దాని ఔన్నత్యాన్ని ఆచరణకి తెచ్చుకోడు. జీతం రాళ్ళకి పొట్టకూటికి పరిమితం చేసుకుంటాడు. అతని విజ్ఞానాన్నుంచి అతనే శాంతి పొందుతాడు. సాంత్వన పొందుతాడు.

అందులో మరో వ్యక్తి ప్రమేయం లేదు. జోక్యం లేదు విజ్ఞానపరంగా అతనికి ఎవరూ సన్నిహితం కానవసరం లేదు అందుకే మహా విజ్ఞానవంతుడైన మగవాడు కూడా నిరక్షర కుక్షిని భార్యగా స్వీకరించి - నిశ్చింతగా కాలం వెళ్ళబుచ్చగలడు.

మధుమూర్తి సర్వ సామాన్యుడైన మొగవాడే ! కానీ కమల.... అతనితో తన విజ్ఞానానికి సన్నిహితంగా రాని భర్తతో - నిశ్చింతగా కాలం గడపలేని పరిస్థితికి వచ్చింది.

"కమలా !" అప్రయత్నంగా అన్నాడు మధుమూర్తి. "ఇన్నేళ్లూ నీ సాహచర్యాన్ని వ్యర్థంచేసుకున్నానేమో అనిపిస్తోంది నాకు."

"అవును ఎవరి స్థానం వాళ్లు గుర్తించనప్పుడు జీవితాలు చాలావరకు వ్యర్థమైనట్టే. నేను యింటి పెత్తనం కోసం తహతహలాడుతున్నానని మీరు అనుకోవద్దు. కానీ ఇల్లాలిగా నాచోటు నాకు లభించలేదన్న బాధ మాత్రం వుంది నాకు. మనఇంట్లో ఏ వ్యవహారమూ మన యిద్దరికీ ముడి పెట్టలేదు. మీకు మీ తల్లిదండ్రులకి తప్పా - మీకూ మీ భార్యకీ - మీకూ మీ బిడ్డలకి ఏమీ లేదు. ఎవరిస్థానాల్లో వారిని వుంచనప్పుడు ఎవరి జీవితమూ రాణించదు."

మధుమూర్తి తిన్నగా చూస్తూ అడిగాడు - "కమలా ! నీ ఉద్దేశ్యాలన్నీ నాకు తెలిశాయి. నువ్వు యెన్నో విధాల అమ్మనీ నాన్ననీ మార్చాలని ప్రయత్నించావు ప్రయోజనం ఏం కల్పించింది ?"

"మొగుడు కాదన్నదాన్ని ముష్టివాడు కూడా కాదంటాడన్న సామెత మనందరి తలల్లోనూ వుంది. మనం పెళ్ళిచేసుకుని ఈ యింటికి వచ్చాక ఈ సంసారభారాన్ని నాకు అప్పగించే ప్రయత్నం మీరు చేశారా ? ఏ వ్యవహారంలోనైనా నా సలహాలు అడిగారా ? నాకై నేనే చెప్పినప్పుడు నా అభిప్రాయాన్ని పాటించారా ? నా యిష్టాయిష్టాలు ఒక్కనాడైనా గమనించారా?

నా స్థానం నా కివ్వకుండా నా విలువ ఏనాడు లేకుండా చేశారో — ఆనాడే నేను అత్తమామలకి చులకనైపోయాను. నాకు ఎలాంటి జోక్యమూ లేదు సంసారంలో. అన్ని విషయాల్లోనూ చెడ్డదాన్నే అయ్యాను తప్పితే మరో మర్యాదేమీ నాకు దక్కలేదు. ఆఖరికి నా పిల్లలు కూడా నన్ను నిర్లక్ష్యం చేసేంత దుస్థితి అనుభవిస్తూ నేను వుండలేను. ఒకటి కాదు. రెండు కాదు. ఏడేళ్ళు భరించా నీ క్షోభ! నా ఆశలన్నీ వ్యర్థం అని తెలిసిపోయింది_"పసిపిల్లని దేవుడి దగ్గిరికి బొమ్మని ఎలా అనగలిగావు నాన్నా ?" అని అడగలేని మీరు — ఇక నన్ను వుద్ధరిస్తారన్న భ్రమ పూర్తిగా వదిలిపోయింది. ఈ యింట్లో భార్యగా.... తల్లిగా ...నా విలువేమీ లేదు. కోడలు లేనంత మాత్రాన సంభవించే అనర్థమేమీలేదు. అన్నీ అక్షరాలా సవ్యంగా సాగుతూంటాయి.

అందుకనే నేను వెళ్ళిపోదామను కుంటున్నాను నన్ను కరుణించి ప్రేమని నాతో పంపించండి మీరువీల్లే దంటే నేను చెయ్యగలిగిందేమీలేదు. కానీ....మిమ్మల్ని అర్థిస్తున్నాను. ఈ ఏడేళ్ళ సాహచర్యానికి....గుర్తుగానైనా ప్రేమని "నాకు యివ్వండి_" చెంపల మీదుగా కన్నీళ్ళు జారుతోంటే_దుఃఖం ఆపుకోటానికి శతవిధాలా ప్రయత్నిస్తూ ప్రయోజనం లేక తలదించేసుకొంది కమల.

మధుమూర్తి స్థాణువులా చూస్తున్నాడు కొంతసేపటికి కమల లేచింది. "ఇకవెళ్దాం! పదండి. చంటివాడులేస్తాడేమో!"

విస్మయంగా చూశాడు మూర్తి.

ఇద్దరూ నడక సాగించారు. బొత్తిగా మాటలు జరగలేదు.

శేషమ్మ వీధితలుపులు తీసింది. గదికేసి పోతోన్న కోడల్ని వుద్దేశించి _ "అన్నం తినవుటే?" అంది.

మధుమూర్తి కమలచెయ్యి పట్టుకుని "అన్నం తినిరా! వెళ్ళు." అన్నాడు.

కమల వంటింట్లోకి వెళ్ళి పిడికెడు మజ్జిగన్నం కలుపుకుని తిని వచ్చింది.

రాత్రికూడా భార్యాభర్తల మధ్య మాటలు జరగలేదు.

రెండో వ్యక్తి నిద్రపోవటం లేదన్న సంగతి ఇద్దరూ గ్రహించారు.

★ ★ ★

మామూలుగానే తెల్లవారింది.

మధుమూర్తి బయటికి వెళ్ళి మధ్యాహ్నం వేళకి కూడా యింటికి రాలేదు

కమల పెట్టె సర్దుకుని సిద్ధంగా వుంది. మాటిమాటికీ కళ్ళల్లో నీళ్ళు వూరుతున్నాయి. ఎంత ప్రయత్నించినా మనస్సు నిగ్రహించుకోవటం సాధ్యం కావటంలేదు....ముఖ్యంగా .... చంటివాడు....అల్లారు ముద్దుగా పెరుగుతోన్న చంటివాడు....రామం మాత్రం? అప్పుడే తల్లి అవసరంలేని ప్రయోజకుడై పోయాడా? చెవిలో పాట పాడుతూ లేపి _ చదివించి _నీళ్ళు పోసి_అన్నంపెట్టి....బట్టలు తొడిగి_ బడికి పంపి...అయ్యో! అవన్నీ రామం చేసుకుంటాడా? బళ్లోనుంచివచ్చి అమ్మకోసం వెదుక్కోడా? తాతగారు కసిరితే _ యెవరితో _ చెప్పుకుంటాడు?

ఈ యింట్లో పిల్లల్ని యెవరు శ్రద్ధగా చూస్తారు? వాళ్ళకి చదువులు అబ్బుతాయా? మంచి లక్షణాలు అలవడతాయా?

తల్లి....తను వుండి ఏమీ చెయ్యలేదా? "భగవంతుడా! నాకు బిడ్డలెందుకిచ్చావు తండ్రీ? ఈ మాతృహృదయాన్ని యెందుకిలా మోడు చేస్తావు?"

చంటివాణ్ణి ముద్దుపెట్టుకుంటోంటే వాడి బుగ్గలమీద తల్లి కన్నీళ్ళు జలజలా రాలాయి.

కోడలి ధోరణి అర్థంకాని శేషమ్మ_ ఆ ప్రయాణం యెక్కడికో తెలీక గుంజాటన పడుతోంది.

మధుమూర్తి హడావుడిగా వచ్చాడు_ "కమలా! బండి తీసుకొస్తాను లే"

నివ్వెరపోయింది కమల. ఒక్క క్షణం నిశ్చలంగా నించుంది. తనని పంపటానికే నిశ్చయించాడా మధు?

సరే! కమల గబగబా కళ్ళు తుడుచుకొంది. కమల ఆవేదన కూడా తుడిచిపెట్టుకు పోయింది. ఈ ఇంట్లో తన స్థానం లేదనే నిర్ణయించాడు భర్త! తనిక ఎలాంటి మమకారాలూ కొనసాగించుకోవటం ధర్మంకాదు. మొగబిడ్డల గురించి తనేం భయపడ నవసరంలేదు. వాళ్ళు ఎలాగైనా బ్రతుకుతారు. చంటివాడంటే వాళ్ళ నాన్నకి యిష్టం. రాముం అంటే తాత గారికి యిష్టం! పర్వాలేదు. పది రోజుల్లో అమ్మని మర్చిపోతారు, తను చచ్చిపోతే మాత్రం ఏం చేస్తారు?

మూర్తి హడావుడిగా వరండాలోకి వెళ్ళాడు—"అమ్మా!"

"ఏమిట్రా? ఏమిటి? నీ పెళ్ళాం ఎక్కడికేనా వెళ్తోందా?"

"నా పెళ్ళాం ఒక్కతీ కాదు. నేనూ నా పిల్లలూ కూడా వెళ్తున్నాం. అవతల వీధిలో యిల్లు చూశానమ్మా! మేము వేరే వుంటాం"

కమలకి ఆనందం_ దుఃఖం పొంగి వచ్చాయి. బ్రమ్మపడిపోయిన స్థితిలో గుమ్మాన్ని కరుచుకుని వుండిపోయింది.

శేషమ్మా ముసలాయనా తెల్లబోయారు. "వేరే ఏమిట్రా?" శేషమ్మ గుండె దడదడా కొట్టుకుని రెట్టింపు స్పీడుతో పని చెయ్యసాగింది. ఉన్న వాడివి ఒక్కడివి. నీకూ మాకూ వేరే వీట్రా? ఆవేదబుగ్ర దీర్ఘంగా ఆలోచించింది. "ఇదంతా ఎవరు చెప్పి పెట్టార్రా నీకు?"

"అమ్మా!" నొసలు చిట్లిస్తూ తీక్షణంగా చూశాడు మూర్తి. "అనవసరంగా ఎవర్నో అనకు. ఇది నిక్షేపంలా నీ కొడుకు బుర్రకు పుట్టినబుద్ధి. ఒకళ్ళు చెప్పింది వింటే నా పరిస్థితి చాలా మెరుగ్గా ఉండేది."

కొడుకు ధోరణి ముసలాయనకి చిరచిర లాడించింది—. "నీ పరిస్థితి కేమైందోయ్? కనిపెంచినవాళ్ళు అంత పెగటయ్యారా?" అన్నాడు వెటకారంగా.

"కనిపెంచినవారైనా కూడా బిడ్డల జీవితాలు నాశనం చేయటం మీకే చెల్లింది. కొడుకు పెద్దవాడయ్యాడు. కోడలు వచ్చింది, బిడ్డలు పుడుతున్నారు. వాళ్ళ సంసారం వాళ్ళు చేసుకుంటారు" అన్న వివేకం మీకు లేకపోయింది.

మీ రోజులు మీ యిష్టప్రకారం నడిచాయి. మా రోజులు మా యిష్టప్రకారం నడుస్తాయి. అది అర్థం చేసుకోలేని మిమ్మల్ని నేను భరించలేనంటే ఆ తప్పు నాదా? తల్లిదండ్రుల్ని ఆదరించటం ధర్మంకావచ్చు గానీ - ఆ ఆదరాన్ని నిలుపుకోవటానికి కూడా వాళ్ళు కొన్ని బాధ్యతలు పాటించాలి.

నా బిడ్డలు రెక్కలురాని పసివాళ్ళు. వాళ్ళని పెంచి ప్రయోజకుల్ని చేయా

ల్సిన ధర్మంగా [illegible] నాకు.

నిత్యం కమల మొత్తుకుంటోనే వుంది. ఇవ్వాళ నేను కొత్తగా చెప్పే దేముంది? అయినా ఇప్పుడు జరిగి పోతోన్న అఘాయిత్యం మాత్రం ఏమిటి? ఎవరివారిన వాళ్లుంటే ఏ చికాకులూ లేకుండా ప్రశాంతంగా గడుస్తుంది కాలం. నన్ను కని పెంచారన్న వివేకం లేని మూర్ఖుణ్ణి కాదు. నా శక్తికి తగిన విధంగా మీ పోషణకి ఇస్తూ ఉంటాను"

మరి నిలబడలేదు మూర్తి. గదిలోకి పోయి కమలని చూస్తూ—"ఇంకా అలా నిలబడ్డా వెందుకూ? నీ ప్రయాణం ఆపేసి మన సామాన్లు సర్దు" అన్నాడు.

కమల బిత్తరపోయింది—భయంగా అంది—"మనం వేరు పోదామని నే నెప్పుడైనా అన్నానా?"

"నువ్వు చెప్పిందే చేసి - చెప్పింది మానటానికి నేనేం నీ పనిమనిషినా?" మధుమూర్తి తీక్షణంగా చూశాడు—"ఒక సమస్యని పరిష్కరించేపాటి తెలివి తేటలు నాకు వుండకూడ దను కున్నావా? ఈ ఇంటి కలతలతో నే నెంత విసిగిపోయానో - ఎంత తుళ్ళిపోయానో నువ్వేమైనా అర్థం చేసుకో గలిగావా? భార్యా - బిడ్డలూ మూర్ఖుణ్ణను కున్నావా. సరే! సరే! మాటలు తర్వాత. ముందు సామానుసర్దు, మనయిల్లు — మన సంసారం —మనం ఏర్పర్చుకుందాం, ఇందులో కానిపనేం లేదు. అంతవరకూ నా అంతరాత్మ నన్ను గర్వపడనివ్వదు. నేను వెళ్తున్నాను. బండి తీసుకొస్తాను సామాను సర్దు."

మధుమూర్తి విసురుగా వీధిలోకెళ్ళి పోయాడు.

మొగవాడి వ్యక్తిత్వంలో ఆడదాని ప్రభావం వుంటుందా?

శేషమ్మ కొడుకు కమల మొగుడై పోయాడా?

కాదు. కాదు. మధుమూర్తి మధుమూర్తే. అందుకే అతడు 'యెవరి మాటా వినకుండా బండికోసం వెళ్ళాడు.

వరండాలో ముసలాయన - వంటింటి గడపలో శేషమ్మా - గది గుమ్మంలో కమలా - యెక్కడివాళ్ళక్కడే దిగాలుపడి నించున్నారు.

(అయిపోయింది)

***

నూరు చిత్రాల కాంతారావు

సినిమా

మనిషి నూరేళ్ళు జీవిస్తే గొప్పగా పరిగణిస్తాం మనం. నటుడు నూరు చిత్రాల్లో నటించడం మటుకు గొప్ప కాదా?

అందుకే శ్రీ టి. ఎల్. కాంతారావును ఈ మధ్య ఆయన అభిమానులు ఘనంగా సన్మానించారు. ఆయన స్వస్థలమైన నల్లగొండజిల్లా కోదాడులో మహా వైభవంగా సత్కరించారు. కవులు, కళాకారులు, రాజకీయ నాయకులు, పత్రికా రచయితలు, ఇంకా ఎందరో పెద్దలు వచ్చి ఆయన నటనా కౌశలాన్ని ప్రశంసించారు; ఆశీర్వదించారు.

కాంతారావును చూస్తే నిన్న మొన్నటి వాడిలాకనిపిస్తాడు. అప్పుడే నూరు చిత్రాలు పూర్తిచేశాడా అనిపిస్తాడు. నిజానికి అతడు మరీ నిన్న మొన్నటివాడు కాడు. హెచ్. ఎం. రెడ్డిగారి "నిర్దోషి" చిత్రంలో పల్లెటూరి రైతుగా కొద్ది నిమిషాలు మొదటిసారిగా కనిపించాడు. ఆ తరువాత "ప్రతిజ్ఞ" చిత్రంలో హీరోగా నటించాడు. ఇవి ఏనాటివి? అయినా, ఎందుకనో అతడు నూరు చిత్రాలలో నటించాడంటే ఆశ్చర్యమే కలుగుతుంది.

చాలా చిత్రాలలో అతడు అద్వితీయ నాయకుడు కాడు; ద్వితీయ నాయకుడే. కొన్ని చిత్రాలలో నారదుడు వంటి చిన్నపాత్రలు, మరికొన్నిటిలో ఇంకా చిన్నపాత్రలు ధరించాడు. అందుచేతనే బహుశా ప్రేక్షకులకు అతని చిత్రాల సంఖ్య ఆశ్చర్యం కలిగిస్తుంది.

అయితే ఒక విశేషం చెప్పుకోవాలి. అతడు అన్నిరకాల పాత్రలు ధరించాడు. పౌరాణికాలు, జానపదాలు, సాంఘికాలు, చరిత్రాత్మకాలు. రొమాంటిక్ వేషాలు, గంభీరవేషాలు, హాస్య వేషాలు. విలన్‌గా, భక్తుడుగా, వీరుడుగా, భర్తగా, ప్రియుడుగా రకరకాల పాత్రలు అన్నీ ధరించాడు.

తెలుగు చిత్రరంగంలో నటులకు ఇది తప్పని సరే. ఉన్న కొద్దిమందినే నిర్మాతలు అన్నిరకాల పాత్రలకు ఉపయోగించు కోవాలి. ఉన్నవారిలో ఏ పాత్రకు ఏ నటుడు కాస్త దగ్గిరగా వస్తే అతన్ని తీసుకోవాలి. ఒకవేళ అతడు దొరక్కపోతే, ఎవరుదొరికితే వారు. అందుచేత మన నటులు "ఆల్ రౌండర్స్" అయివుండాలి.

నిజానికి, కాంతారావు శృంగార, వినోద, విషాద, భక్త పాత్రలలో కంటె వీరోచిత వేషాలలోనే ఎక్కువగా రాణించాడు.

అందరూ అన్ని రకాల పాత్రలను సమాన నైపుణితో నటించ గలరను కోవడం భ్రమ. ఎవరే పాత్రకు సరి పోతారో చూసి ఉపయోగించు కొనడం లోనే నిర్మాతల తెలివి తేటలు వ్యక్త మవుతాయి. కాంతారావును తెలుగు నిర్మాతలు జానపద వీరనాయక పాత్ర లలో మాత్రమే వినియోగించుకుని వుంటే అతడు ఇప్పటికంటె ఎక్కు వగా విజయం పొంది వుండేవాడు. నాగేశ్వరరావు, రామారావుల తరవాత శ్రేణికి చెందినవాడుగా గాక, వారి సరసనే తన కొక ప్రత్యేక శ్రేణి నిర్మించుకుని ఒక తరహా చిత్రాలలో తనకు తానే సాటి అనిపించుకునేవాడు. నటులను ఆ విధంగా ఉపయోగించు కునే స్థితికి మన తెలుగు చిత్రసీమ ఇంకా చేరుకోలేదు.

'మరొక నూరు చిత్రాలపాటు కాంతా రావు వర్ధిల్లాలని కోరుతున్నాము.

★ ★ ★

నాగేశ్వరరావు నెల చిత్రం

కృష్ణసాయీ వారు హైదరాబాద్‌లో జూన్ 25న "దిల్ ఏక్ మందిర్" తెలుగు వర్షన్ ప్రారంభించి ఒక నెలలో షూటింగ్ పూర్తి చేస్తారు. నాగేశ్వరరావు. సావిత్రి, జగ్గయ్య ముఖ్య పాత్రధారులు.

★ ★ ★

"అగ్గిబరాటా" నిర్మాతలు విరల్ ప్రొడక్షన్స్‌వారి తదుపరి చిత్రం "అగ్గి దొర". రామారావు ముఖ్యనటుడు.


చిలకా - గోరింకా

చిలకా గోరింకల దాంపత్యం ఎంత అన్యోన్యమైనదో, అసలు వాటికి దాంపత్య సంబంధం వుందో లేదో మాకు తెలియదుకాని, ప్రత్యగాత్మగారి చిత్రానికి ఒక మంచి కథా వస్తువు నివ్వడానికి అది కారణమైంది.

తన మొదటి చిత్రం "భార్యాభర్తలు"తోనే ప్రత్యగాత్మ అఖండ విజయాన్ని, ప్రతిష్ఠను ఆర్జించు కున్నారు. ఆ తరవాత ఆయన చిత్రా లన్నీ విజయవంతమై శతదినోత్సవ చిత్ర దర్శకుడుగా ప్రత్యగాత్మను అగ్ర శ్రేణిలో కూర్చుండబెట్టాయి.

ఆత్మా ఆర్ట్స్ పేరిట స్వయంగా స్థాపించిన సంస్థ తరఫున ఆయన తీసిన మొదటి చిత్రం "చిలకా - గోరింకా" కూడా ఆయనకు విజయాన్ని, కీర్తిని సంపాదించి ఇవ్వగలదనే ఆశించ వచ్చు.

ఈ చిత్రంలో మూడు చిలకలు, మూడు గోరింకలు కనిపిస్తాయి. పెద్ద జంట అంజలీదేవి, రంగారావులది. ముప్ఫయ్యేళ్ళు కలిసి సంసారం చేసినా వన్నె తరగనిది వారి దాంపత్యం. కొండలలో పుట్టి, బండరాళ్ళ మధ్య దూకుడుగా ప్రవహించే సెలయేరుగా ప్రారంభమై, పోయినకొద్దీ మైదానాలలో ప్రశాంతంగా గంభీరంగా ప్రవహించే నదివంటిది వారి అనురాగం. (దాన్ని సూచించడానికి ప్రత్యగాత్మ ఈ సంకేతాలనే చిత్రీకరించారు.)



భారత్ ఫిలింస్‌వారి "భక్త పోతన" చిత్రంలో
రంగారావు, బాలయ్య, జయశ్రీ

భార్య వయసు మళ్ళిన తరువాత బిడ్డను కని చనిపోతే ఒంటరి గోరింక వలె మిగిలిపోతాడు రంగారావు. ఆదిగులుతో బిడ్డను నిరాదరిస్తూ, చివరికి ప్రేమకంటె జీవితం విశాలమైనదని, దానికి కొన్ని బాధ్యత లుంటాయని గ్రహించి, ప్రశాంతంగా కన్నుమూస్తాడు.

రెండవ జంట, కృష్ణకుమారి, కృష్ణంరాజులది. కృష్ణకుమారి నడక హొయలును చూసి ప్రేమించినా, కృష్ణంరాజు అనురాగం మొత్తం ఆమె వ్యక్తిత్వం అంతటిపై వ్యాపిస్తుంది, ఆ సంగతి గ్రహించలేక కృష్ణకుమారి తన కాలు ప్రమాదవశాత్తు విరిగిపోతే, తన నిక అతడు ప్రేమించడని భయపడి అజ్ఞాతవాసం గడుపుతుంది. చివరికి అసలైన ప్రేమతత్వాన్ని గ్రహించి సుఖపడుతుంది.

కథలో చక్కని అంశం — కృష్ణకుమారి రంగారావుకు జీవిత పరమార్థాన్ని బోధిస్తుంది. రంగారావు కృష్ణకుమారికి ప్రేమ స్వభావాన్ని ఉపదేశిస్తాడు.

మూడవజంట పద్మనాభం, రమాప్రభ (క్రొత్త నటి)లది. హాస్యం సరఫరా చేయడానికి ఈ జంట ప్రయత్నిస్తుంది.

నటులలో సహజంగానే పెద్ద పీట వేయవలసింది రంగారావుకు. ప్రేమ ఘట్టాలలో ఆయన నటన ఎబ్బెట్టుగా వున్నదనిపిస్తే, ఆ ఎబ్బెట్టు తనంఅరవై యేళ్ళ వృద్ధాప్యంలో ఇరవై యేళ్ళ యువకుని ప్రేమోత్సాహాన్ని చూపించే ఆ పాత్రలోనే వున్నది. భార్య చనిపోయిన ఘట్టంలోను, ఆ తరువాతను నటనలో ఆయన అనుభవ సారమంతా కాచి వడబోసినట్టు కన్పిస్తుంది.

కృష్ణకుమారి తాను చక్కని నటి నని మరొకసారి నిరూపించుకున్నది. రమణారెడ్డి, పద్మనాభంల హాస్యం 'షరా' వలె మామూలే. క్రొత్త నటుడు కృష్ణంరాజు మొదటి చిత్రంలో నటిస్తున్నట్టులేదు, బహూశా రెండవ చిత్రం కావచ్చుననిపించే విధంగా క్రొత్తరికాన్ని కప్పి పుచ్చుకుని బాగా నటించాడు. పినిశెట్టిని చూస్తుంటే ఆయన ఇంత కాలం రచయితగానే ఎందుకు వుండి పోయాడు, ఇంతమంచి నేర్పును దాచి పెట్టుకుని అనిపిస్తుంది.

శ్రీశ్రీ కవితా సౌరభం, రాజేశ్వరరావు సంగీత మాధుర్యం కలిసి పాటలన్నీ ఆహ్లాదకరంగా వున్నాయి.

చిత్రం నిడివి కొంత తక్కువగా వుంటే ఇంకా బాగుండే దనిపిస్తుంది. మొత్తంపై అన్ని తరగతుల ప్రేక్షకులను ఆకర్షిస్తుందనే చెప్పవచ్చు.

"అగ్గిబరాటా"

చిత్రానికి ప్రాణం "టెంపో".

ముఖ్యంగా ఈ కాలంలో – కాలంతోపాటు మనుషులు పరుగులిడే ఈ కాలంలో – సినిమా ఎంత వడిగా, ఎంత బిగువుగా పరుగులిడితే ప్రేక్షకులకు అంత ఆనందం.

వడికి వడి, బిగువుకు బిగువు సినిమాలో వుండాలి అంటే, సన్నివేశ వస్తువులో, సన్నివేశ చిత్రీకరణలో, నటనలో, ఆ మీదట ఎడిటింగ్‌లో, ఇంకా వీలయితే నేపథ్య సంగీత మేళవింపులలో ఆ బిగీ, జిగీ, నగిషీ వస్తుతః వుండాలి.

విఠల్ ప్రొడక్షన్స్ వారి "అగ్గిబరాటా" ఇతరత్రా ఎలా వున్నా పైన పేర్కొన్న సినిమా మంచి అంశాలను పుణికి పుచ్చుకొన్నదని గట్టిగా చెప్పవచ్చు.

కత్తి యుద్ధాలు, కోటప్రవేశాలు, మంత్రగాళ్ళలో ఎత్తులకు పై ఎత్తులు క్రొత్త పద్ధతిలో చిత్రీకరించడం కూడా ఒక చిన్న విశేషం. చిన్న చిన్న నటీనటులకు అవకాశం యివ్వడం, హాస్య పాత్రధారుల చేత బాగా నటింప జేయడం, జానపదంలోనూ ఆంగ్ల వ్యామోహంపై దెబ్బ తీయడం "అగ్గిబరాటా"లోని మరికొన్ని విశిష్టాంశాలు.

ఇవి తప్పితే కథలోకాని, కథనంలో కాని, లక్ష్యంలోకాని చెప్పదగిందేమీ లేదు.



భారత్ ఫిలింస్‌వారి "భక్త పోతన" చిత్రంలో
గుమ్మడి, రోహిణి

సేనాని రాజును వధించి పైకి ప్రజా సేవకుడుగా నటిస్తూ వేరొక వేషంలో ప్రజలను కొల్లగొట్టుతూ తుదకు గ్రామ వీరుడు అగ్గిబరాటాతో తలపడి, ఆతడు (అగ్గిబరాటా) వలచిన రాకుమారిని చేబట్టలేక అంతం పొందిన గాథ "అగ్గిబరాటా" వీరగాధ.

దర్శకుడు: విఠలాచార్య. ఎడిటర్: గోవిందస్వామి. రామారావు, రామదాసు, రాజశ్రీ ముఖ్య పాత్రధారులు.

చిన్నమ్మ - చిట్టమ్మ

గోకుల్ ఆర్టు థియేటర్స్ వారి "చిన్నమ్మ _ చిట్టమ్మ" చిత్రీకరణ జులైలో ప్రారంభం కాగలదు. జి. వి. జి. "గంగా__జమున" ఆధారం. దర్శకుడు: ఎస్. డి. లాల్, నిర్మాత దోనేపూడి.

★ ★ ★

"జ్వాలాద్వీప రహస్యం" నిర్మించిన మధు పిక్చర్సువారి తదుపరి జానపద చిత్రాన్నికూడా విఠలాచార్య డైరెక్టు చేస్తారు.

కీర్తిశేషుల కుటుంబ సహాయ నిధి


తెలుగు చిత్రసీమలో రెండు దశాబ్దాలకు పైగా పేరు ప్రఖ్యాతులు గడించిన నటులు కస్తూరి శివరావు కె. వి. ఎస్. శర్మ, దుస్తులు - అలంకరణ నిపుణుడు కె. అచ్యుతరావు ఇటీవల దిగవంతులయ్యారు. అకాల మరణం చెందిన ఈ ముగ్గురు కళాకారుల కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయడానికి నిధిసేకరించాలని జైహింద్ సత్యం సంకల్పించారు.

త్వరలో ప్రకటితమయ్యే ఒక తేదీన మద్రాసు ట్రిప్లికేన్, అయిస్‌హవుస్ రోడ్డులోవున్న ఎన్. కె. టి. కళా మండపంలో వినోద కార్యక్రమాలు ఏర్పాటవుతాయి. ఒక గంటసేపు జరిగే యీ కార్యక్రమాలలో అగ్రశ్రేణితారలు పాల్గొంటారు. ఆపిమ్మట శ్రీ భమిడిపాటి రాధాకృష్ణచే రచింపబడ్డ "కీర్తి శేషులు" నాటకాన్ని మద్రాసు రవీ ఆర్టు థియేటర్సువారు ప్రదర్శిస్తారు. దీనిలో శ్రీయుతులు, యన్. టి. రామారావు, నాగయ్య, జగ్గయ్య, కాంతారావు, యస్. వి. రంగారావు, గుమ్మడి, రేలంగి, రమణారెడ్డి, పద్మనాభం, రాజనాల శ్రీమతులు, భానుమతి, అంజలీదేవి, సావిత్రి, జమున, కృష్ణకుమారి, షావుకార్ జానకి మొదలైన ప్రముఖ నటీనటులు వివిధ భూమికలను దాలుస్తారు. ఆనాటి కార్యక్రమానికి ప్రవేశ రుసుము రూ. 20/- రూ. 10/- రూ. 5/-

తాము తలపెట్టిన ఈ సత్కార్యానికి చేయూత నివ్వవలసిందిగా తెలుగు సినిమా సీమలోని చిత్ర నిర్మాతల,



ఆర్. ఎస్. ఆర్. పిక్చర్స్‌వారి "హంతకులు వస్తున్నారు జాగ్రత్త"లో గీతాంజలి



బాబు మూవీస్‌వారి "కన్నె మనసులు" చిత్రంలో
సంధ్యారాణి తదితరులు

డిస్ట్రిబ్యూటర్ల, కళాకారుల, సాంకేతిక నిపుణుల, తదితరులకు జైహింద్ సత్యం విజ్ఞప్తి చేస్తూ మొన్ననొక ప్రకటన చేశారు.

తమ విరాళాలను "కీర్తిశేషుల సహాయనిధి" 9, మూసాసేట్ వీధి, మద్రాసు — 17 కు పంపవలసిందిగా శ్రీ సత్యం కోరుతున్నారు.

మద్రాసు సోషల్ అండ్ కల్చరల్ క్లబ్బు 1500 రూపాయల విరాళమివ్వగా హాస్యనటుడు రమణారెడ్డి బాలకుమార్తె ఒక్క రూపాయి విరాళం యిచ్చింది. రమణారెడ్డి విడిగా పెద్ద విరాళం యిచ్చాడు. జూలై మాసాంతానికి నిధి వసూలు పూర్తి కాగలదు.

చలనచిత్ర వార్తలు

నాగేశ్వరరావు, పద్మనాభం గూడుపురాణీ

జూన్ ప్రారంభంలో భరణీవారి కొత్త హాస్యభరిత చిత్రం "గృహలక్ష్మి" నిర్మాణం ప్రారంభమైంది.

ఒక గృహం ఇంటీరియర్‌లో హీరో నాగేశ్వరరావు, పద్మనాభంను ప్రక్కకు పిలిచి, రహస్యంగా "రామావరం వెళ్ళి ఎవరో జబ్బుగా వున్నారని టెలిగ్రాం యివ్వు. నేను, నా భార్య బయలుదేరి వస్తాము. కులాసాగా గడప వచ్చు" అనే చిట్కా యిచ్చే ఘట్టాన్ని తొమ్మిదవ తేదీన చిత్రీకరించారు.

మరొక రోజున సి. నారాయణరెడ్డి వ్రాసిన పాటను ఘంటసాల, భానుమతి పాడగా భరణీలో రికార్డు చేశారు. రెండవ వారాంతంలో ఆ పాటను నాగేశ్వరరావు, భానుమతిగార్లపై చిత్రీకరించారు.

జూన్ మాసాంతం వరకు "గృహలక్ష్మి" చిత్రీకరణ ఏకటాకీగా సాగుతుంది. ఈ షెడ్యూలులో ఇంకా ఎస్. వి. రంగారావు, సూర్యకాంతంల భూమికల చిత్రీకరణ కూడా జరుగుతుంది.

డి. వి. నరసరాజు సంభాషణలు సమకూర్చారు. దాశరధి కొన్ని పాటలు వ్రాశారు.

ఒక బెంగాలీ చిత్రం ఆధారంగా తీస్తున్న ఈ చలాకీ శరవేగ చలనశిల్పం దర్శకుడు పి. రామకృష్ణ.

రమణారెడ్డి కలిపిన విషం

హైదరాబాద్ మూవీస్‌వారి "అర్థరాత్రి"లో జూన్ ఒకటవ తేదీనుంచి వరసగా దాదాపు మూడు వారాలపాటు మరో పెద్ద సెట్టుపై ఏకటాకీగా షూటింగ్ జరిపారు. చిత్రంలోని ముఖ్య భాగాలలో అధిక భాగం ఈ సెట్‌లోనే జరుగుతోంది.

11వ తేదీన, శారదా స్టూడియోలో వేసిన ఆసెట్టులో హీరోమామ రమణారెడ్డి, ఒక ద్రవ పదార్థంలో విషపదార్థం వేసి కొత్తనటి మాధవికి అందించి ఎవ్వరికివ్వాలో చూపించే ఘట్టం చిత్రీకరించారు. విషపదార్థం వేస్తున్నప్పుడు రమణారెడ్డి సన్నచేతులు పెనుగాలిలో లోటకూరు కాడల్లా చెదిరిపోయినవి.

ఈ సెట్టులో యింకా జగ్గయ్య, భారతి, రాధిక, నిర్మల, చదలవాడ, ప్రసాద్, సీతారాం, పెరుమాళ్ళు మొదలైన వారి భూమికలు వస్తవి.

మాటలు, పాటలు, ఆరుద్ర. సంగీతం: వేణు. దర్శకుడు: సాంబశివరావు. నిర్మాత గంగాధరరావు. సత్యనారాయణ ఛాయగ్రహణ దర్శకుడు.



"భక్త పోతన"లో పద్మిని మయూర నృత్యం

"హంతకులు

వస్తున్నారు జాగ్రత్త!"

పి. ఎస్. ఆర్. పిక్చర్స్‌వారి ఈ చిత్రానికి 1966 మే 25 వ తేదీ ఉదయం అరుణాచల స్టుడియోస్‌లో ప్రారంభోత్సవం జరిగింది. ముహూర్తానికి అపరాజిత ఫిలిం డిస్ట్రిబ్యూటర్ శ్రీయుతులు గంగ్వాలా, రాయల్ ఫిలిండిస్ట్రిబ్యూటర్లు, గౌతమీ పిక్చర్స్ రామబ్రహ్మంగారు పత్రికాధిపతులు తదితరులు విచ్చేశారు.

అది రఘురామయ్యగారి భవంతి. ఆయన కొడుకు మురళి 'నా చెల్లెలు వివాహాన్ని శుభప్రదంగా జరిపించు స్వామీ' అని వేంకటేశ్వర స్వామిని ప్రార్థించే ఘట్టాన్ని తొలు దొల్త షూట్ చేశారు. శ్రీ గంగ్వాలా కెమెరా స్విచ్ ఆన్‌చేశారు.

రఘురామయ్యగా గుమ్మడి, మురళిగా చలం నటిస్తున్న ఈ చిత్రంలో ఇుంకా అంజలీదేవి, గీతాంజలి, ప్రభాకరరెడ్డి, పద్మనాభం, ఉదయ కుమార్, త్యాగరాజు, మాలి తదితరులు నటిస్తున్నారు.

ఈ చిత్రానికి నిర్మాత శ్రీ పి. సుబ్బారావు, దర్శకుడు ఎస్. డి. లాల్, రచయిత టి. పి. మహారథి, కెమెరా ఎస్. ఎస్. లాల్, ఎడిటర్ కందస్వామి, ఆర్టు సోమనాథ్ నిర్వహిస్తున్నారు.

"భక్త పోతన"
ప్రత్యేక విశేషాలు

భారత్ ఫిలిమ్స్ వారి "భక్త పోతన"లో జూన్‌లో ప్యాచ్‌వర్క్ పూర్తి కావడంతో షూటింగ్ ఘట్టం ముగించడమైనది.

చివరి షెడ్యూలులో హేమాంగిని (పద్మిని) బాకు దెబ్బకు బలి కాగా శ్రీనాధుడు (రంగారావు) వచ్చి ఖిన్నుడు కావడం, శాలువ కప్పడం చిత్రీకరించారు.

పోతన జీవితమే కాక శ్రీనాధుని బహుముఖ ప్రజ్ఞా చరిత్రను కూడా జోడించడం ఈ చిత్రంలోని ఒక విశేషం. పోతనగా గుమ్మడి, శ్రీనాధుడుగా రంగారావు పోటాపోటీగా నటించి అలనాటి నాగయ్య, జంధ్యాల గౌరీనాధశాస్త్రిగారలను మరపు తెప్పించ యత్నించారు.

ఈ చిత్రంలో నాగయ్య ఒక అతిధి పాత్రలో కన్పిస్తారు. సావిత్రి సరస్వతిగా, కె. ఆర్. విజయ సీతగా, శోభన్ బాబు శ్రీరామునిగా గెస్టు ఆర్టిస్టులుగా నటించారు.

సంగీత శ్రవ్య కావ్యంగా రూపొందిన "భక్త పోతన"లో ఘంటసాల, పి. బి. శ్రీనివాస్, మంగళంపల్లి బాల మురళీకృష్ణ, మాధవపెద్ది సత్యం, పి. సుశీల, ఎస్. జానకి, పి. లీల స్వర మాధుర్యం వింటాము.

సముద్రాల రాఘవాచార్య, రామానుజాచార్య, ఆరుద్ర, సి. నారాయణ రెడ్డి పాటలను రచించారు. రాఘవాచార్య నాటి పోతనకు, నేటి పోతనకు సంభాషణలు సమకూర్చారు.

సంగీత దర్శకుడు: ఎస్. రాజేశ్వరరావు, నృత్య దర్శకుడు: పసుమర్తి కృష్ణమూర్తి, కెమెరా: సి. నాగేశ్వరరావు, కళ: రాజేంద్రకుమార్, కూర్పు: హనుమంతరావు, నిర్మాత: టి. విశ్వేశ్వరరావు, దర్శకుడు: జి. రామినీడు.

తారాగణంలో యింకా అంజలిదేవి, వాసంతి, జయశ్రీ, శారద, బేబి రోహిణి, హరనాధ్, బాలయ్య, ప్రభాకరరెడ్డి, చలం, మిక్కిలినేని, రాజబాబు, కామినేని ఈశ్వరరావు, కోనేశ్వరశాస్త్రి మొదలైనవారు కలరు.



బాబు మూవీస్‌వారి "కన్నె మనసులు" చిత్రంలో
రామమోహన్, సుకన్య

"కన్నె మనసులు" సిద్ధం

బాబూ మూవీస్‌వారి "కన్నె మనసులు" యూనిట్ ఐదు వారాలపాటు ఉదక మండలం, నీలగిరి, హార్స్లీ హిల్స్, శ్రీరంగపట్నం సమీప ప్రాంతాలలో షూటింగ్ జరిపి జూన్ ఆరవ తేదీన మద్రాసుకు తిరిగివచ్చారు. జూన్ మధ్యానికి 200 మీటర్ల ప్యాచ్ వర్క్ మాత్రం మిగిలి వుంది. కృష్ణ, సుకన్యలపై ఎక్కువ చిత్రీకరణ జరిగింది. జులై ఆరంభంలో పాటల రికార్డులు శ్రోతలకు లభ్యం కాగలవు. "మూగ మనసులు" అంత మనోహరంగా "కన్నె మనసులు" వుంటుందని దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు అన్నారు.

ఈ చిత్రం యూనిట్ వివరమిది :

దర్శకుడు : ఆదుర్తి, కధ : ముళ్ళపూడి వెంకటరమణ, సంభాషణలు : ఎన్. ఆర్. నంది, సంగీతం : కె. వి. మహదేవన్. పాటలు : ఆత్రేయ. ఆరుద్ర, కొసరాజు, దాశరధి, గాయనీ గాయకులు : సుశీల, జమునారాణి, ఘంటసాల, డి. వెంకటరావు, ఛాయా గ్రహణ దర్శకుడు : పి. ఎల్. రాయ్, ఆపరేటివ్ కెమేరామాన్: కె.ఎస్. రామకృష్ణారావు, కళ : తోట, కూర్పు : టి. కృష్ణ, నిర్మాత సి. సుందరం.

ఇంటి తాకట్టు : దేవిక పాత్ర ఇంటిగుట్టు

వీనస్ స్టుడియోలో "చిట్టి" సాంఘిక చిత్రం షూటింగ్ జూన్‌లో వడిగా సాగింది. "సిత్తి" అనే తమిళ చిత్రం దీనికి ఆధారం. తెలుగులో తుదకు "పిన్ని" అన్న పేరు నిర్ణయం చెయ్య వచ్చు.

10వ తేదీన ఒక గంభీర సన్ని వేశం చిత్రీకరించారు.

సంసారం గడిపేందుకు త్యాగిని పడుతున్న యిబ్బందుల నిరూపణ ఆ సన్నివేశం.

తల్లిలేని పిల్లలను సాకుతున్న సవతి తల్లి ఆ త్యాగిని. దేవిక ఆ భూమిక నిర్వహిస్తుంది. ఇంటిని కూడా తాకట్టు పెట్టినట్లు తొలిసారిగా శోభన్‌బాబుకు దేవిక శోకంతో క్షోభతో చెబుతుంది. బి. ఏ. సుబ్బారావు, టి. వి. రాజు. పినిశెట్టి, ఎల్లప్ప ముఖ్య సాంకేతికులు.

శ్రీకాంత్ ప్రొడక్షన్సు వారి ఈ చిత్రం షూటింగ్ మొదటి షెడ్యూలు 10వ తేదీతో పూర్తి అయింది. సరిగా పదిరోజులు జరిగింది. ఆరుద్ర రచించిన జోలపాట సుశీల పాడగా దేవికపై చిత్రీకరించారు.

రేలంగి, చలం, నీరజ కూడా నటిస్తున్న ఈ చిత్రానికి సౌందప్ప చెట్టియార్ నిర్మాత.

జానపదంలో రామారావు, పద్మనాభం మస్కా

డి. వి. యస్. ప్రొడక్షన్స్ వారి జానపదం మే మాసాంతంలో షూటింగ్ దశలో పడి జూన్ ఆరంభంలో కోట ఘట్టమొకటి చిత్రీకరించారు. రామా రావు, పద్మనాభం ఆడ వేషాలు వేసు కొని రాజనాల, అల్లురామలింగయ్య లకు మస్కా కొట్టడం ఆ 'చిత్ర' ఘట్టం.

ప్రారంభోత్సవం రోజున వీధి సెట్టుపై షూటింగ్ జరిగింది. రామా రావు, పద్మనాభం, రాజనాల, అల్లురామ లింగయ్య మొదలైనవారు పాల్గొన్నారు.

విఠలాచార్య దర్శకత్వం వహి స్తున్న ఈ చిత్రంలో యింకా రాజశ్రీ, రేలంగి, వాణిశ్రీ, మణిమాల, మిక్కిలి నేని, విజయలక్ష్మి, ఋష్యేంద్రమణి. మీనాకుమారి నటిస్తున్నారు, రచన : జూనియర్ సముద్రాల. పాటలు : సి. నారాయణ రెడ్డి, కెమెరా : వరద రాజన్ కూర్పు : బోషి, నృత్యం : సత్యం, నిర్మాత డి. వి. యస్. రాజు.

★ ★ ★

రూపాయి విలువ తగ్గినందున కలర్ ఫిల్ము వెల బాగా హెచ్చింది. అసలది లభ్యం కావడమే కష్టం. "వసంతసేన", "భక్త ప్రహ్లాద", "రహస్యం" కలర్ చిత్రాలు యిబ్బందు లకు గురికావలసి వస్తున్నది. తెలుపు నలుపు చిత్రాల వ్యయం అరలక్షకు పైగా పెరుగుతుంది.



బాబు మూవీస్‌వారి "కన్నె మనసులు" చిత్రంలో
రామమోహన్,. సుకన్య

"ఆస్తిపరులు"

జగపతివారి "ఆస్తిపరులు" షూటింగ్ దశ ఈ సంచిక వెలువడే సరికి దాటిపోతుంది. ఆస్తి, వేలువిడిచిన అన్నదమ్ములు, అన్న కుమార్తెపై తమ్ముని అనురాగం—వీటిపై బిగువైన కథతో, మనోహర ప్రకృతి దృశ్యాలతో పరుగులిడే "ఆస్తిపరులు" యూనిట్ వివరమిది:

నిర్మాత: రాజేంద్ర ప్రసాద్, దర్శకుడు: వి. మధుసూదనరావు, కెమెరా: సి. నాగేశ్వరరావు, సంభాషణలు - ఆత్రేయ, పాటలు: ఆత్రేయ, కొసరాజు. కళ: జి. వి. సుబ్బారావు, కూర్పు: సంజీవి.

తారాగణం: నాగేశ్వరరావు, జగ్గయ్య, బేబి పద్మిని, జయలలిత, గుమ్మడి, రేలంగి, నాగయ్య, కుటుంబరావు, సూర్యకాంతం, జి. వరలక్ష్మి.

రంగులరాట్నంలో వనజా నివాస్ నిజానిజాలు

గిరగిర తిరిగే రంగులరాట్నమే జీవితమనే నిత్య జీవిత సత్యాన్ని నిరూపించే వాహినీవారి "రంగుల రాట్నం"లో జూన్‌లో వాహినీ స్టుడియోస్‌లో "వనజా నివాస్" సెట్ ఇంటీరియర్‌లో షూటింగ్ జరిపారు. పతాక సన్నివేశంతోసహా అనేక ముఖ్య ఘట్టాలు ఈ సెట్‌లోనే జరుగుతవి. చిత్రంలోని నటీనటు లందరికి ఈ సెట్‌లో పని వుండడం మరొక విశేషం. పతాక సన్నివేశం చిత్రీకరణతో చిత్రంలోని ముఖ్య భాగాలలో పెక్కింటి షూటింగ్ అయిపోయినట్లు చెప్పవచ్చు.

'థీమ్ సాంగ్' (గిరగిర తిరిగే రంగులరాట్నమే జీవితం అని అర్థం వచ్చే ఇతివృత్త గేయం) రచన, చిత్రీకరణ జూన్ మధ్యానికి బకాయిపడి వున్నది. ఈ పాట, చిత్రంలో మూడు నాలుగుసార్లు 'రిపీట్' అవుతుంది.

"వనజా నివాస్"లో షూటింగ్‌కు ముందు సీతమ్మ (అంజలి) ఇంటిలో ఒక ముఖ్య సందర్భమును చిత్రీకరించారు. జూన్ ఆరంభంలో ఈ ఘట్టానికి సెల్యులాయిడ్ ప్రాప్తి జరిగింది.

రామమోహన్ "లా" పట్టా పుచ్చుకొని ఒక డొక్కు కారులో వస్తాడు. సంతోషంతో తల్లికి ఆ పట్టా యిచ్చి తల్లి ఋణం ఎలా తీర్చుకొంటానంటాడు. తల్లి సీతమ్మ చరచరా లోనికి వచ్చి, స్వర్గీయులైన తన భర్త (సి. హెచ్. కృష్ణమూర్తి) ఫొటో యెదుటపెట్టి "మీ కిచ్చినమాట నిలబెట్టాను." అంటూ ఆనంద బాష్పాలు వర్షిస్తుంది.

తండ్రి చనిపోయి చాలా సంవత్సరాలయింది. తన బాల కుమారుని ముద్దుమోము చూచి వీడు తెలివికలవాడని, "లా" చదవాలని తండ్రి చెబుతాడు. తల్లి అలానే చదివిస్తానని మాట యిస్తే చాలని తండ్రి శాశ్వతంగా కన్ను మూస్తాడు. నాటినుంచి సీతమ్మతల్లి నానా ఊడిగంచేసి పెద్దబ్బాయిని చదివిస్తుంది. పట్టభద్రుడౌతాడు. న్యాయశాస్త్రం పట్టాకూడా సంపాదిస్తాడు. అది తీసుకొని వచ్చిన వెంటనే జరిగే సన్నివేశాన్నే పైన ఉదహరించడమైనది.

అందులో రామమోహన్ చెల్లెలు నీరజ, అన్న సాహితీ సాధనను మెచ్చుకొంటూ అమ్మ వద్దకు పరుగిడిన సంఘటన కూడా చిత్రీకరించారు.

ఈ చిత్రంలో రామమోహన్ మేకప్ గురించి ప్రత్యేకశ్రద్ధ తీసుకొన్నారు. హీరోలకు హీరోగా కన్పించే రూపలావణ్యాలను తీర్చిదిద్దారు. పాత్ర స్వభావంబట్టి, రామమోహన్ రూపంబట్టి బి. ఎన్. రెడ్డి "రంగుల రాట్నం"లో ఒక తెలుగు అభిభట్టాచార్యను చూడబోతున్నామని గట్టిగా చెప్పవచ్చు.

చిత్ర కథలో సీతమ్మ తల్లి రెండవ కుమారుడు చంద్రమోహన్. అన్న రామమోహన్ విద్యావంతుడూ, నాగరీకుడూ అయితే తమ్ముడు చంద్రమోహన్ చదువూ సంస్కారమూ లేని వ్యవసాయదారుని వంటివాడు. బలిష్ఠుడు.

ఆ భూమికకు సరిపోయేందుకుగాను వస్తుతః బలిష్ఠుడైన, వెయిట్‌లిఫ్టింగ్ ప్రవీణుడైన చంద్రమోహన్ అనే యువకుని తెచ్చారు. ఆయన నిజ జీవితంలో వ్యవసాయశాస్త్రం పట్టభద్రుడు. ప్రభుత్వోద్యోగానికి సెలవు పెట్టి బి. యన్. రెడ్డిగారి చిత్రంలో నటిస్తున్నారు. నిజ జీవితంలో పట్టభద్రుడు అయిన ఈ చంద్రమోహన్‌ను "రంగులరాట్నం" తెర పాత్ర జీవితంలో నిరక్షరకుక్షిగా, దాదాపు అనాగరికుడుగా మలచి చూపేందుకు బి. ఎన్. రెడ్డి తీసుకొన్న శ్రమ అంతా యింతా కాదు. అయితే శ్రమకు మించిన ఫలితం వచ్చింది. కాబట్టి అంతా సుఖాంతం, శుభాంతం అయింది.

బి. ఎన్. రెడ్డిగారు చంద్రమోహన్‌ను బెంగుళూరుకు తీసుకొని వెళ్ళి అభినయాది అంశాలలో ప్రత్యేక శిక్షణ నిప్పించారు. ఏకాంత స్థలం కోసం, ఏకాగ్రత కోసం, మరెవ్వరి డిస్టర్బెన్స్‌లేకుండా వుండడం కోసం బి. ఎన్. రెడ్డి తన తారను బెంగుళూరు వరకు పరుగులెత్తించా రన్నమాట.

కుర్రవాడికి బార్‌బెల్ ప్రత్యేకంగా తెప్పించి వెయిట్ లిఫ్టింగ్ వ్యాయామం నిర్విఘ్నంగా సాగేటట్లు చూశారు. అప్పటికికాని శరీర సౌష్ఠవం ఏక స్థాయిలో ఉన్నత స్థాయిలో వుండ దన్నమాట.

పోతే అన్నదమ్ముల, అక్కచెల్లెళ్ళ భూమికలకు చిన్నపిల్లలను ఎన్నుకోవడంలో బి. ఎన్. చూపిన శ్రద్ధ కూడా గణనీయం.

పిల్లలు పెద్దవాళ్ళయినప్పుడు రామమోహన్, చంద్రమోహన్, నీరజ లుగా మారుతా రన్నమాట. పిల్లలూ, ఈ పెద్దలూ రూప లావణ్యాలలో సామ్యం పొంది వుంచేనే సహజత్వాన్ని పోషించి నట్లవుతుంది.

పెద్ద నటులకు సరిపోయే పిల్ల నటులను ఎన్నుకోడానికి బి. ఎన్. రెడ్డి తీసుకొన్న శ్రద్ధ ఈ కాల పరిస్థితికి ప్రత్యేకంగా చెప్పదగిందే.

రేడియోలో పిల్లల ప్రోగ్రాములకు ఈ పెద్ద బి. ఎన్. హాజరయ్యేవారు. ప్రోగ్రాములలో పాల్గొన్నవారి నుంచి కొందరిని ఎన్నుకొన్నారు.

నరసింహాచారి, రాధ, రేఖ అనే పిల్లలను అలా ఎన్నుకొన్నారు.

అన్నదమ్ముల మనస్తత్వంలో భేదం వున్నట్లు పైన పేర్కొన్నాము. దాని చిత్రీకరణ కూడా గమ్మత్తుగా జరిగింది.

అన్న టిప్‌టాప్‌గా, జుట్టు నీటుగా దువ్వుకొని అనుక్షణం అందంకోసం చూసుకొంటాడు.

తమ్ముడు పారిశుద్ధ్యంగురించిపట్టించు

కోడు. అమ్మ చీపిరితో ఇల్లు వూడుస్తూ వుంటే చీపిరి తను తీసుకొని వూడుస్తాడు, దుమ్ము అవతల పారేస్తాడు.

ఈతడికి చిత్రంలో జోడీ వాణిశ్రీ, కరకు పిల్ల

పాలగుమ్మి పద్మరాజు సమకూర్చిన కధకు డి వి నరసరాజు సంభాషణలు రచించారు

బి. ఎన్ చిత్రమంటే యస్ రాజేశ్వరరావులో ఏదో కొత్త సంగీత శక్తి వస్తుంది రంగులరాట్నంలోనూ ఈ విషయం రుజువు కాగలదు బి గోపాలం కూడా వీరితో కలిసి పని చేస్తున్నారు రాజగోపాల్ ఛాయాగ్రహణ దర్శకుడు.

ఈ సంచిక వెలువడే సరికి ముప్పాతిక చిత్రం సిద్ధమౌతుంది

నృత్యాలలోనూ "రంగులరాట్నం" కొత్త పుంత త్రొక్కనున్నది

గౌరీ ప్రొడక్షన్స్ కొత్త జానపదం

గౌరీ ప్రొడక్షన్స్‌వారు "భూలోకంలో యమలోకం" పూర్తి చెయ్యక ముందే మేటి తారాగణంతో మరొక జానపద చిత్ర నిర్మాణానికి ఉపక్రమించారు

జూన్ రెండవ తేదీన ముహూర్తం జరిగింది పూర్ణా కామరాజు కెమేరాకు స్విచ్ ఆన్ చేశారు రామారావుపై మొదటి దృశ్యం తీశారు. జయలలిత రాజశ్రీ నాయికలు కెమెరా · వేణు, సంగీతం · కోదండపాణి, రచన పాలగుమ్మి పద్మరాజు, కూర్పు కె ఎస్ ఆర్. దాస్, దర్శకుడు జి విశ్వనాధ్, నిర్మాత · ఎస్ భావనారాయణ

కొత్త చిత్రాలు

ఏ వి. యమ్ వారు ఈస్ట్‌మన్ కలర్‌లో "శ్రీకృష్ణభగవాన్", నరాగం పిక్చర్స్ వారు చుట్టరికం", శ్రీ సత్యనారాయణ పిక్చర్స్‌వారు "తాళిబొట్టు", రామ్ చౌదరి రజనీ ఫిలిమ్సువారు ఒక సాంఘికం, రేఖా అండ్ మురళి ఆర్ట్స్ వారు ఒక సాంఘికం, రఘురాం ఫిలిమ్స్ వారు ఒక జానపదం తీయబోతున్నారు చివరి మూడింటికి దర్శకుడు కె హేమాంబరధరరావు, మహీజా ఫిలిమ్స్‌వారు "భారత్ శ్రీ" అర్జా జనార్దనరావు ఆంజనేయుడుగా "వీరాంజనేయ", విజయ, జయంతీ సంస్థ కె వి రెడ్డి, పింగళి నాగేంద్రరావు, రామారావు, బి సరోజాదేవిలతో జానపదాలు, శ్రీ కేదారీశ్వరరావులు, ఆమంచర్ల శేషగిరిరావు దర్శకత్వాన ఒక జానపదం తీయబోతున్నారు ఇవన్నీ అతి త్వరలో సెట్స్‌కు వెళ్ళనున్నవి.

***

సంపాదకుడు, ప్రచురణకర్త · వి వి రాఘవయ్య. ముద్రణ · జ్యోతి ప్రెస్, కాంగ్రెస్ ఆఫీస్‌రోడ్, విజయవాడ-2.